ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY 5

ప్రకాశం
జిల్లా వార్తలు
శనివారం 12, ఏప్రిల్ 2025

మహనీయుల ఆశయాలను కొనసాగిద్దాం

అదే వారికి మనమిచ్చే నిజమైన నివాళి

సీఎం సహకారంతో పెద్దఎత్తున రుణ మేళాలు

రాష్ట్ర అభివృద్ధికి అన్నివిధాలుగా కేంద్రం సహకారం

గత వైసీపీ ప్రభుత్వం ఒక్క రుణం ఇవ్వని దుస్థితి

వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్

6



ఒంగోలులో పూలే విగ్రహానికి నివాళి అర్పిస్తున్న మంత్రులు సత్యకుమార్, డీఎస్‌బీవీ స్వామి, ఎమ్మెల్యే దామచర్ల, టూరిజం బోర్డు చైర్మన్ బాలాజీ, కలెక్టర్ అన్సారియా



క్యాథ్‌ల్యాబ్‌ను ప్రారంభించి పరిశీలిస్తున్న మంత్రులు సత్యకుమార్ యాదవ్, స్వామి

పేదలకు నాణ్యమైన వైద్యం

అదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం

- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్
- రోగులకు బాధ్యతతో వైద్యసేవలు అందించాలి : మంత్రి స్వామి
- జీజీహెచ్‌లో క్యాథ్‌ల్యాబ్ ప్రారంభం

ఒంగోలు, కార్పొరేషన్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): పేదలకు మెరుగైన, నాణ్యమైన వైద్యం అందించడం కోసం రాష్ట్రప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం ఒంగోలులోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో రూ.6.06 కోట్లతో ఏర్పాటు చేసిన గుండె సంబంధిత పరీక్ష కేంద్రం(క్యాథ్‌లాబ్)ను మంత్రి సత్యకుమార్, సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సత్య మాట్లాడుతూ ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా రూ.25లక్షల వరకు ఉచిత వైద్యసేవలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నామని, ప్రివెంటివ్ మెడిసిన్‌కు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. అన్ని నియోజకవర్గాల్లో 100 పడకల మిగతా 6లో...



స్వర్ణాంధ్ర -2047పై రాష్ట్ర ప్రభుత్వం కేంద్రీకరించింది. ముందుగా విజన్ -2029 ప్రారంభించి ఈ ఏడాది వార్షిక లక్ష్యాల సాధనపై దృష్టిపెట్టింది. అందుకోసం ఇప్పటికే అన్ని జిల్లాల్లో యంత్రాంగం జిల్లా, మండల ప్రణాళికలు రూపొందించింది. గట్టి ఫలితాల సాధన కోసం కొత్తగా జిల్లా, నియోజకవర్గ, సచివాలయ స్థాయిలో ప్లాన్లు రూపొందించేందుకు పర్యవేక్షణ కమిటీలను నియమించనుంది. ప్రణాళిక శాఖ నేతృత్వంలో అధికారులు తదనుగుణ కసరత్తు చేస్తున్నారు. ప్రణాళికల్లో నిర్దేశించుకున్న విధంగా ఫలితాలను రాబట్టడం ప్రధానాంశంగా భావిస్తున్న ప్రభుత్వం నిరంతరం వాటిని క్రోడీకరించేందుకు ప్రత్యేక సిబ్బందిని కూడా నియమిస్తోంది. జిల్లా, నియోజకవర్గ స్థాయిలో ఒక్కొక్క చోట ఐదుగురు ప్రత్యేకంగా ఎంపిక చేసిన సచివాలయ సిబ్బందిని ఇందుకోసం నియమించనున్నారు. వారి ఎంపిక కోసం కూడా ప్రభుత్వం అధికారులతో కూడిన కమిటీలను నియమించడం విశేషం. నియోజకవర్గ స్థాయిలో స్పెషల్ ఆఫీసర్లను కూడా నియమిస్తారు.

స్వర్ణాంధ్రకు మూడంచెల ప్లాన్

జిల్లా, నియోజకవర్గ, సచివాలయ స్థాయిలో పర్యవేక్షణకు కమిటీలు

ప్రత్యేక సిబ్బంది నియామకం

- జిల్లా, మండల ప్రణాళికలు సిద్ధం
- ప్రభుత్వ ఆదేశాలతో నియోజకవర్గ ప్రణాళికలు.. రూపకల్పనకు కసరత్తు
- స్థూల ఉత్పత్తి, తలసరి ఆదాయం పెంపు
- కీలక అంశాలపై నిరంతర పర్యవేక్షణ

ఒంగోలు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : కేంద్రప్రభుత్వం వికసిత భారత్ పేరుతో రానున్న రోజుల్లో ప్రపంచంలో మనం ఆర్థికంగా ఎదగడం, అందరికి ఉపాధి కల్పించడం లక్ష్యంగా ప్రణాళిక రూపొందించింది. తదనుగుణంగా స్వర్ణాంధ్ర-2047 పేరుతో రాష్ట్రప్రభుత్వం విజన్ ప్లాన్‌పై దృష్టిపెట్టింది. అందులోభాగంగా 2024-29 ఐదేళ్ల ప్రణాళికలను తొలుత రూపొందించి గత డిసెంబరులో ఈ ప్రణాళికలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆవిష్కరించారు. దాని అమలులో భాగంగా 2025-26 వార్షిక విజన్ ప్లాన్‌లను ప్రభుత్వ ఆదేశాలతో జిల్లాలో అధికారులు రూపొందించారు. గత నెలాఖరులో జరిగిన కలెక్టర్ల సదస్సులో ఈ ప్రణాళికలు, లక్ష్యసాధన చర్యలే ప్రధానాంశాలుగా ప్రభుత్వం నిర్వహించింది. అందులో జిల్లా, మండల విజన్ ప్లాన్‌లను క్రోడీకరించి కొత్తగా నియోజకవర్గ స్థాయి ప్రణాళికలను కూడా ఈ నెలాఖరులోపు రూపొందించాలని ఆదేశించింది.

● లక్ష్యసాధన కోసం చర్యలు

ప్రధానంగా జిల్లాల్లో ఉన్న వనరులు, ప్రభుత్వ పథకాల సద్వినియోగం, జిల్లాలో స్థూల ఉత్పత్తి, తలసరి ఆదాయం పెంపు లక్ష్యంగా ఈ ప్రణాళికలు రూపొందించారు. ఆయా రంగాల వారీ లక్ష్య సాధనకు తీసుకోవాల్సిన చర్యలు, ఉపాధి అవకాశాల పెంపు, రాబడి పెరుగుదలను ప్రణాళికల్లో పేర్కొన్నారు. జిల్లాలో మిగతా 6లో...

కమిటీ ఏర్పాటు ఇలా..

జిల్లా స్థాయి కమిటీకి జిల్లా ఇన్‌చార్జి మంత్రి చైర్మన్‌గా వ్యవహరిస్తారు. ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్‌గా కలెక్టర్, కన్వీనర్‌గా సీపీవో వ్యవహరించే ఈ కమిటీలో జిల్లాకు చెందిన పార్లమెంట్ సభ్యులు, శాసనమండలి సభ్యులు, శాసనసభ్యులు, జడ్పీ చైర్మన్, కార్పొరేషన్ మేయర్లు సభ్యులుగా ఉంటారు. నియోజకవర్గ స్థాయి పర్యవేక్షణ కమిటీకి స్థానిక ఎమ్మెల్యే చైర్మన్‌గా వ్యవహరిస్తారు. నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్‌గా ఉండే జిల్లాస్థాయి అధికారి ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్‌గా ఉంటారు. నియోజకవర్గ కేంద్ర ఎంపీడీవో కన్వీనర్‌గా, అలాగే ఆ నియోజకవర్గ పరిధిలో ఉండే మునిసిపల్ చైర్మన్లు, తహసీల్దార్లు. ఎంపీడీవోలు సభ్యులుగా ఉంటారు. ఇక సచివాలయ స్థాయి పర్యవేక్షణ కమిటీ స్థానిక సర్పంచ్, పట్టణాలలో అయితే కార్పొరేటర్ లేదా కౌన్సిలర్ చైర్మన్‌గా ఉంటారు. సచివాలయ అడ్మిన్ సెక్రటరి కన్వీనర్‌గా ఉంటారు. ఆ మేరకు ప్రభుత్వ ఉత్తర్వులతో సంబంధిత కమిటీల నియామకం చేస్తున్నారు. ఈ కమిటీలు ఆచరణలోకి వచ్చిన తర్వాత నిరంతర పర్యవేక్షణ కోసం జిల్లా, నియోజకవర్గ స్థాయిలో ప్రత్యేక సిబ్బందిని కూడా నియమిస్తున్నారు.



విజయకేతనం చూపుతున్న బొడ్డు భాస్కర్‌రావు, మద్దతుదారులు

ఒంగోలు బార్ అసోసియేషన్ చైర్మన్‌గా బొడ్డు భాస్కర్‌రావు

- వైస్ ప్రెసిడెంట్‌గా బలరాం, మహిళా ప్రతినిధిగా సుధారాణి
- మిగిలిన నాలుగు పోస్టులు ఏకగ్రీవం

ఒంగోలు క్రైం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు బార్ అసోషియేషన్ చైర్మన్‌గా భాస్కర్‌రావు విజయం సాధించారు. శుక్రవారం స్థానిక జిల్లా కోర్టు ఆవరణంలోని బార్ అసోషియేషన్ హాలులో జరిగిన ఎన్నికలలో మొత్తం 817 మంది ఓటర్లు ఉండగా 694 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికల అధికారిగా బీఎస్‌వీ.గుప్తా వ్యవహరించారు. ఉదయం 10 నుంచి ప్రారంభమైన ఎన్నికలు సాయంత్రం 5 గంటలకు ముగిశాయి. అయితే ప్రెసిడెంట్ పదవి కోసం బొడ్డు భాస్కర్‌రావు, చావలి రమేష్‌బాబు, గోకనకొండ శ్రీనివాసరావు, నాయుడు ఈశ్వరరావు, పీఎస్‌వీ సత్యనారాయణరెడ్డి, వేల్పుల తిరుమల క్రిష్ణయాదవ్ పోటీ పడ్డారు. వారిలో భాస్కర్‌రావు గెలుపొందారు. వైస్ ప్రెసిడెంట్ పోటీలో చుండూరి క్రిష్ణమూర్తి, మోటుమర్రి బలరాం మధ్య ఎన్నిక జరగ్గా బలరాం విజయం సాధించారు. ఇక మహిళా ప్రతినిధికి ఎం.హెలెన్ దీపలత, తాతరాఘ సుధారాణి పోటీలో నిలవగా సుధారాణి గెలుపొందారు. జనరల్ సెక్రటరీగా సలగల జగ్జీవన్‌రావు, జాయింట్ సెక్రటరీగా వేల్పూరి గ్రేసీకుమారి, లైబ్రరీ సెక్రటరీగా గంటా శ్రీనివాసరావు, కోశాధికారి కాకుటూరి సంపత్‌కుమార్ ఏకగ్రీవం అయ్యారు. స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీ పోస్టుకు ఎవరూ పోటీ చేయకపోవడంతో ప్రస్తుతం ఖాళీగా ఉంది.

నేడు పనిచేయనున్న రిజిస్ట్రేషన్ కార్యాలయాలు

ఒంగోలు క్రైం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉన్న అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు, జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం శనివారం పనిచేస్తాయని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ వి.పుష్పలత ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 11 నుంచి సాయంత్రం 5.30 వరకు కార్యాలయాలు పనిచేస్తాయన్నారు. అన్నిసేవలు యథావిధిగా జరుగుతాయని ప్రజలు గమనించాలని కోరారు.



నవతరం.. తొలగిన అంతరం

- కెల్లంపల్లిలో ఫ్యాక్షన్‌కు యువత ఫుల్‌స్టాప్
- సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల్లో పురుడుపోసుకున్న చైతన్యం

7

నేటి నుంచి నెమలిగుండ్ల రంగనాయకస్వామి బ్రహ్మోత్సవాలు



6

పొగాకును ఎప్పటికప్పుడు అమ్ముకోవాలి

పొదిలిలో వేలం కేంద్రాన్ని సందర్శించిన చైర్మన్ యశ్వంత్

7

హద్దులు పరిశీలిస్తున్న ఆర్డీవో కేశవర్దన్ రెడ్డి



సీబీజీ ప్లాంట్ హద్దుల పరిశీలన

- అటవీ, రెవెన్యూ శాఖాధికారుల సమన్వయం

కురిచేడు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగదొనకొండ వద్ద కంప్రెస్డ్ బయోగ్యాస్ (సీబీజీ) ప్లాంట్ నిర్మాణ స్థలంలో శుక్రవారం అటవీ, రెవెన్యూ శాఖల అధికారులు హద్దులు గుర్తించారు. వీటిని ఒంగోలులోని ఉన్నతాధికారులకు పంపారు. అక్కడ ఇరుశాఖల అధికారులు తమ భూముల విషయంలో ఏకాభిప్రాయానికి కృషి చేస్తున్నారు. సర్వే నంబర్లు 88, 90లలో 799.40 ఎకరాలు సీబీజీకి కేటాయించారు. సదరు భూమిలో అటవీ భూమి ఉందని ఆ శాఖాధికారులు పనులను అడ్డుకున్నారు. దీంతో అటవీ, రెవెన్యూ శాఖల అధికారులు తమ రికార్డులు పరిశీలించుకున్నారు. ఇరు శాఖాధికారులు ప్లాంట్ స్థలం వద్ద హద్దులు పరిశీలించారు. అటవీ శాఖ డీఎఫ్‌వో వినోద్ కుమార్, కనిగిరి ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో గత రెండు రోజుల నుంచి కురిచేడు, దొనకొండ మండలాల్లో అటవీ శాఖ హద్దురాళ్ల గుర్తింపు చేపట్టారు. శుక్రవారం ప్లాంట్ వద్ద కొంతమంది సర్వేయర్లు ఉండి ల్యాట్ ల్యాండ్ సర్వే చేపట్టారు. ఈ వివరాలను ఒంగోలులోని అటవీ, రెవెన్యూ శాఖల అధికారులకు పంపగా వారు భూమి వివరాలను గుర్తిస్తున్నారు. శనివారంలోగా ఎవరి భూమి ఎంత ఉందనే విషయం తెలుస్తుందని సమాచారం.

నేటి నుంచి నెమలిగుండ్ల రంగ నాయకస్వామి బ్రహ్మోత్సవాలు

పోలీసులతో పటిష్ఠ బందోబస్తు

రాచర్ల/గిద్దలూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జేపీ చెరువు సమీపంలోని నల్లమల అటవీ ప్రాంతంలో ప్రకృతి సోయగాల నడుమ కొండల మధ్యలో గుండ్లకమ్మ నది తీరంలో నెమలిగుండ్ల రంగనాయకస్వామి బ్రహ్మోత్సవాలు శనివారం నుంచి 4 రోజులపాటు నిర్వహించనున్నారు. భక్తులకు మెరుగైన సేవలు అందించి స్వామి దర్శనాన్ని సులభతరం చేసేందుకు వీలుగా ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ఇప్పటికే పలుమార్లు సమీక్షించి ఏర్పాట్లను పూర్తి చేయించారు. ఈనెల 12 నుంచి 15వ తేదీ వరకు 200 మందికి పైగా సిబ్బందితో సీఐ రామకోటయ్య, ఎస్సై కోటేశ్వరరావు ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. బస్టాప్ నుంచి దేవాలయం వరకు ఉచిత ఆటో సౌకర్యాన్ని ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి సూచనల మేరకు పోలీసుశాఖ, దేవస్థాన అధికారులు నిర్వహిస్తున్నారు. తోపులాటల జరగకుండా ఎక్కడికక్కడే బారీకేడ్లను ఏర్పాటు చేశారు. ఉచిత తాగునీటి సౌకర్యంతో పాటు ప్రత్యేక మెడికల్ క్యాంప్‌ను సిద్ధం చేశారు. కులసంఘాల ఆధ్వర్యంలో ఆయా సత్రాలలో భక్తులకు 4 రోజులపాటు ఉచితంగా అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

స్థల పురాణం

నెమలిగుండ్ల రంగనాయక స్వామి దేవస్థానం మహేశ్వరునితో వరం పొంది నెమలిముఖ ఆకారంలో మయూరుడు అనే మహర్షితో గుండం తవ్వడంతో ఈ గుండానికి నెమలిగుండం అని పేరు వచ్చింది. నీటి గుండానికి ఎదుట మయూర మహర్షి కోరిక మేరకు స్వయంభూ పూజింపబడిన కారణంగా ఈ దేవునికి నెమలి గుండ్ల రంగనాయకుడు అనే పేరు వచ్చింది.

త్రికరణశుద్ధిగా...

రంగనాయకస్వామి ఆలయంలో ప్రతి శనివారం మాత్రమే స్వామి దర్శనం ఉంటుంది. భక్తులు త్రికరణశుద్ధిగా ఆలయానికి రావలసి ఉంటుంది. స్వామిపట్ల భక్తిలేకుండా వస్తే ఆ భక్తులను తేనెటీగలు కుట్టడమే కాకుండా దేవాలయ ప్రాంగణం దాటేవరకు వెంటపడతాయని భక్తుల నమ్మకం. తేనెటీగలు మూకుమ్మడిగా దాడి చేసే సందర్భంలో భక్తులు గోవిందా గోవిందా అంటూ నామస్మరణ చేయాలి.

కార్యక్రమ వివరాలు

ఈనెల 12న జేపీ చెరువు నుంచి ఉత్సవ విగ్రహాలను 8 కిలోమీటర్ల దూరంలో ఉన్న శ్రీనెమలి గుండ్ల రంగనాయకస్వామి దేవస్థానానికి తీసుకుని వస్తారు. తొలిరోజు శ్రీరంగనాయకస్వామి, రాముల వారి అలంకారాలు, వాహనసేవలు నిర్వహిస్తారు. 2వ రోజు ఆదివారం స్వామి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించనున్నారు. రాత్రికి గరుడవాహనంలో విష్ణుమూర్తి అలంకారంలో స్వామి దర్శనమివ్వనున్నారు. రాత్రి 12 గంటల సమయంలో గజ వాహనంలో స్వామి భక్తులకు దర్శనమిస్తారు. 14న ఉదయం 9గంటలకు తెప్పోత్సవం, సాయంత్రం 4గంటలకు రథోత్సవం నిర్వహించనున్నారు. 15వ తేదీ ఉదయం 9గంటలకు చక్రస్నానంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని దేవస్థాన కార్యనిర్వహణాధికారి నాగయ్య తెలిపారు.ఈ సందర్భంగా 12వ తేదీ గిద్దలూరు ఆర్టీసీ డిపో అధికారులు 10 ప్రత్యేక బస్సు సర్వీసులను నెమలిగుండ్ల రంగనాయకస్వామి దేవస్థానానికి నడపనున్నారు.

మహనీయుల ఆశయాలను కొనసాగిద్దాం

- అదే వారికి మనమిచ్చే నిజమైన నివాళి
- సీఎం సహకారంతో పెద్దఎత్తున రుణ మేళాలు
- రాష్ట్ర అభివృద్ధికి అన్నివిధాలుగా కేంద్రం సహకారం
- గత వైసీపీ ప్రభుత్వం ఒక్క రుణం ఇవ్వని దుస్థితి
- వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్



చెక్కును పంపిణీ చేస్తున్న మంత్రులు సత్యకుమార్, స్వామి, కలెక్టర్ అన్సారియా, ఎమ్మెల్యే జనార్దన్, బాలాజీ

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): బడుగు బలహీనవర్గాల అభ్యున్నతికి కృషిచేసిన మహనీయుల ఆశయాలను కొనసాగించడమే మనం వారికిచ్చే నిజమైన నివాళి అని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా శుక్రవారం కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలులో బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా రుణమేళా, యూనిట్ల గ్రౌండింగ్ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి, కలెక్టర్ అన్సారియా, శాసనసభ్యుడు జనార్దన్, టూరిజం చైర్మన్ బాలాజీ, మేయర్ సుజాతతో కలిసి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మంత్రి స్వామి మాట్లాడుతూ బీసీ సాధికారతకు ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. కలెక్టర్ అన్సారియా మాట్లాడుతూ జ్యోతిరావు పూలేను స్ఫూర్తిగా తీసుకొని జిల్లా అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. శాసనసభ్యుడు జనార్దన్ మాట్లాడుతూ సమాజాభివృద్ధి, వ్యక్తిత్వ వికాసానికి విద్య అవసరాన్ని పూలే ఆనాడే గుర్తించారన్నారు. అనంతరం స్వయం ఉపాధి కోసం 671 మందికి రూ.16.77 కోట్ల విలువైన రుణాల మెగా చెక్కును అందజేశారు. లబ్ధిదారులకు రుణ మంజూరు పత్రాలతోపాటు వారి జీవనోపాధికి అవసరమైన ట్రాక్టర్లు, కుట్టుమిషన్లు, ఇతర యూనిట్లు పొందిన లబ్ధిదారులతో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ ఈడీ వెంకటేశ్వరరావు, ఆర్డీవో లక్ష్మీప్రసన్న, మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు, ఎల్‌డీఎం రమేష్, నాయిబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ రమేష్, గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ రామచంద్రరావు ఇతర అధికారులు పాల్గొన్నారు. అంతకుముందు మంత్రులు సత్యకుమార్, స్వామి, కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ, మేయర్ గంగాడ సుజాతలు స్థానిక కొత్తమార్కెట్ సెంటర్‌లో ఉన్న పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీఆర్వో చిన ఓబులేసు, వివిధ శాఖల అధికారులు అంజల, లక్ష్మానాయక్, వరలక్ష్మి, అర్చన, ధనలక్ష్మి, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రామతీర్థం నిధికి తరలిన జనసేన ప్రభ


ప్రభ ముందుభాగాన ఎమ్మెల్యే విజయకుమార్, నేతలు

- హాజరైన ఎమ్మెల్యే బీఎన్

చీమకుర్తి, ఏప్రిల్11(ఆంధ్రజ్యోతి) : రామతీర్థం తిరునాళ్లను వైభవంగా జరుపుకోవటానికి నిర్మించిన ప్రభలను ఒక్కొక్కటిగా నిధికి తరలిస్తున్నారు. శుక్రవారం జనసేన పార్టీ ఆధ్వర్యంలో నిర్మించిన ప్రభను భారీ ఊరేగింపుగా చీమకుర్తి నుంచి రామతీర్థంనకు తరలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ టీడీపీ నాయకులతో కలిసి పాల్గొని సంఘీబావం తెలిపారు. కార్యక్రమంలో జనసేన నాయకులు పెదపూడి విజయ్ బాబు, కందుకూరి బాబు, బాలినేని ప్రణీత్‌రెడ్డి, గొర్రెపాటి శ్రీనివాసరావు, పల్లపు శివప్రసాద్, నున్నా బాలసుబ్రహ్మణ్యం, పెండ్యాల కోటి, తాతినేని శ్రీరామ్, దర్శాసి చందు, ప్రసాద్ పాల్గొన్నారు.


తరలుతున్న ప్రభ

నేడు రామతీర్థం తిరునాళ్ల

- అలరించనున్న ఆరు విద్యుత్‌ప్రభలు

చీమకుర్తి, ఏప్రిల్11(ఆంధ్రజ్యోతి) : భక్తులపాలిట కొంగుబంగారంగా విరాజిల్లుతున్న రామతీర్థం గంగమ్మ తల్లి తిరునాళ్లను అంగరంగవైభవంగా జరుపుకోవటానికి సర్వం సిద్ధమయింది. దక్షిణకాశీగా పేరుగాంచిన రామతీర్థం మోక్షరామలింగేశ్వరస్వామి చెంతనే వెలసిన గంగమ్మతల్లికి తిరునాళ్లను ప్రతి ఏటా చైత్రశుద్ధ పౌర్ణమినాడు జరుపుకోవటం సంప్రదాయంగా వస్తుంది. ఆరుగాలం పండించిన పంటలు ఇంటికి చేరిన తర్వాత ఆ ధాన్యంతో గంగమ్మతల్లి వద్ద పొంగళ్లు పెట్టి తమ మొక్కుబడులను చెల్లించుకోవటం ఆనవాయితీ. కోరిన కోర్కెలు తీర్చే గంగమ్మ తల్లికి తమ మొక్కుబడులను తీర్చుకోవటానికి చుట్టుపక్కల గ్రామాలనుంచి గతంలో కుంకుమతో బండ్లపై ప్రభలు కట్టుకొని వచ్చి తీర్చుకునేవారు. రానురాను భారీ ప్రభలను అమ్మవారి పుట్టిల్లు, అత్తవారి ఇల్లు అయిన కంభంపాడు, చీమకుర్తిల నుంచి సారె, చీరలతో, బొల్లావుల సంబరాలు నిర్వహించుకొని తీసుకెళ్తున్నారు. తిరునాళ్లరోజు ఉదయం నుంచే ఆలయంలో విశేషపూజలు, పొంగళ్ల చెల్లింపు కార్యక్రమాలు నిర్వహిస్తారు. రాత్రివేళ ఆలయ పరిసరప్రాంగణంలో భారీ విద్యుత్‌ప్రభలను ఏర్పాటు చేసి సినీ, టీవీ కళాకారులచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈసారి తెలుగుదేశం పార్టీ నుంచి 4, జనసేన, వైసీపీలకు చెందిన చెరొకటి చొప్పున మొత్తం 6 విద్యుత్ ప్రభలను ఏర్పాటు చేస్తున్నారు. ఆలయ పరిసర ప్రాంతాలు విద్యుద్దీపాలంకరణతో సుందరంగా తీర్చిదిద్దారు. ప్రభలపై ప్రముఖ సినీ హీరోయిన్‌లు కూడా హాజరుకానున్నారు. ఆయా పార్టీలకు చెందిన ప్రముఖనాయకులు తరలిరానున్నారు. కాగా తిరునాళ్లకు ఒంగోలు, పొదిలి నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సు సర్వీస్‌లను నడుపుతున్నారు. పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించనున్నారు.

పేదలకు నాణ్యమైన వైద్యం

(5వపేజీ తరువాయి)

ఆసుపత్రితోపాటు మౌలిక సదుపాయాలతో మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రులను ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో చేయలేని కొన్ని శస్త్రచికిత్సలు ప్రభుత్వ ఆసుపత్రులో చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. ప్రైవేటుకంటే ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే మెరుగైన వైద్యం అందుతున్న భావన ప్రజల్లో కలిగేలా వైద్యులు పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. మంత్రి స్వామి మాట్లాడుతూ ప్రత్యేకించి జీజీహెచ్‌లో పారిశుధ్యలోపం, సెక్యూరిటీ సేవలు మెరుగుపడాల్సి ఉందని అన్నారు. ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందిస్తున్న వైద్యసేవల పట్ల ప్రజల్లో భరోసా కల్పించి, వారికి మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యమన్నారు. అంతకముందు జీజీహెచ్ వైద్యాధికారులు, వైద్యులతో సమీక్షించిన మంత్రులు, ఎమ్మెల్యే, కలెక్టర్ జీజీహెచ్ వైద్య సేవల పట్ల ప్రజల్లో నమ్మకం ఉండేలా పనిచేయాలని, ప్రత్యేకించి నిర్లక్ష్యం అధికంగా కనిపిస్తుందన్నారు. పనితీరు మార్చుకుని బాధ్యతతో పని చేసి, ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని ఆదేశించారు. అనంతరం జీజీహెచ్ ఆవరణంలో వారు మొక్కలు నాటారు. కార్యక్రమంలో కలెక్టర్ తమీమ్ అన్సారీయా, మేయర్ గంగాడ సుజాత, ఏపీ టూరిజం డవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఎన్. బాలాజి, జనసేన అధ్యక్షులు షేక్ రియాజ్, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ జమున, డిప్యూటీ సూపరింటెండెంట్ నామినేని కిరణ్ కుమార్, డీఎంహెచ్ టి. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్రకు మూడంచెల ప్లాన్

(5వపేజీ తరువాయి)

2024-25లో ఉన్న రూ.56,271 కోట్ల స్థూల ఉత్పత్తిని 2025-26లో రూ.65,543 కోట్లకు, అలాగే తలసరి ఆదాయాన్ని రూ.2.03 లక్షల నుంచి రూ.2.36 లక్షలకు పెంచాలని లక్ష్యంగా ఈ ప్రణాళికల్లో పేర్కొన్నారు. జిల్లా, మండలస్థాయిలో ఈ ప్రణాళికలు రూపొందించి ఉండగా వాటిని క్రోడీకరించి నియోజకవర్గ స్థాయిలో ప్రణాళికలను తక్షణం సిద్ధం చేయాలని ప్రభుత్వం ఆదేశించింది.జన్ ప్రణాళిక లక్ష్యసాధనను ప్రధానాంశంగా తీసుకున్న రాష్ట్రప్రభుత్వం దాని అమలును నిరంతరం పర్యవేక్షించనుంది.

- 45మంది అవసరం

జిల్లాస్థాయిలో మానిటరింగ్ సెల్‌కు ఐదుగురు, ఒక్కొక్క నియోజకవర్గానికి ఐదుగురు వంతున మొత్తం జిల్లాలో 45 మంది సిబ్బందిని నియమించనున్నారు. సచివాలయాల్లో ప్రస్తుతం పని చేస్తున్న మహిళా పోలీస్, సర్వే అసిస్టెంట్, వీఆర్వో లేదా వార్డు రెవెన్యూ సెక్రటరి, వార్డు ప్లానింగ్ లేదా రెగ్యులర్ సెక్రటరీల కేడర్ నుంచి వీరిని ఎంపిక చేయాలి. జిల్లాలో 45 మంది సిబ్బంది అవసరం కాగా సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన, సంబంధిత విద్యార్హతలు ఉన్న వారు జిల్లాలో 485 మంది ఈ బాధ్యతల నిర్వహణకు అనుకూలురుగా ప్రభుత్వమే గుర్తించి ఆ జాబితాలను జిల్లా అధికారులకు పంపారు. వారి నుంచి 45 మందిని ఎంపిక చేసి ఆయా నియోజకవర్గాలకు పంపించాలి. ఈ ఎంపికకు కూడా ప్రభుత్వం కమిటీని నియమించింది. కలెక్టర్ చైర్మన్‌గా, సీపీవో కన్వీనర్‌గా, డీపీవో, సచివాలయాల స్పెషలాఫీసర్, జిల్లా కేంద్ర మునిసిపల్ కమిషనర్ సభ్యులుగా ఈ కమిటీలో ఉన్నారు. ఇలా ఎంపిక చేసిన సిబ్బందిలో నియోజకవర్గాల్లో నిమితులయ్యేవారు ఆ నియోజకవర్గ కేంద్ర ఎంపీడీవో, జిల్లాస్థాయి కమిటీ సిబ్బంది సీపీవో పర్యవేక్షణలో పనిచేయనున్నట్లు సమాచారం. వారు తమ పరిధిలో విజన్ ప్లాన్ అమలుపై నిరంతరం డేటా నమోదు చేసి ప్రభుత్వం దృష్టికి నేరుగా తీసుకెళ్తారని సమాచారం.

'మార్కాపురం' బ్రహ్మోత్సవాల్లో లోపాలు రానివ్వొద్దు

అవీఇవీ


సూచనలిస్తున్న సబ్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్

మార్కాపురం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): అన్నిశాఖలు సమన్వయంతో పనిచేసి మార్కాపురంలోని శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని సబ్‌కలెక్టర్ వెంకట్ త్రివినాగ్ అన్నారు. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై పలు శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా ఈ నెల 12న కల్యాణం, 21న జరిగే రథోత్సవాలకు ఆలయపరిసరాలతోపాటు, నాలుగు మాడవీధుల్లో ముందస్తు ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ నాగరాజు, తహసీల్దార్ చిరంజీవి, ఈవో గొలమారి శ్రీనివాసులరెడ్డి, ఫైర్ ఆఫీసర్ రామకృష్ణ, బ్రహ్మోత్సవ కమిటీ సభ్యులు ఆలంపల్లి శ్రీనివాసరావు, బొంతల సుధీర్, బీజేపీ నాయకులు శాసనాల సరోజిని, పీవీ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మార్కాపురంలోని శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారం అంకురార్పణతో ప్రారంభమయ్యాయి. ప్రధానార్చకులు శ్రీపతి అప్పనాచార్యుల ఆధ్వర్యంలో శ్రీదేవి భూదేవి సమేతుడై చెన్నకేశవుడు, మోతకాపుల చెన్నకేశవ నామస్మరణల మధ్య ఆలయం నుంచి వేణుగోపాలస్వామి ఆలయం ఎదురు ఉన్న పుష్కరిణి వద్దకు చేరుకున్నాడు. ప్రధాన అర్చకులు శ్రీపతి అప్పనాచార్యులు ఆధ్వర్యంలో పుట్టమట్టి సేకరించి మూకుళ్లలో వేసి నవధాన్యాలను వాటిలో విత్తుతారన్నారు. అంకుర్పారణ ఉభయదాతలుగా బొజ్జనపల్లి నరసింహారావు కుటుంబ సభ్యులు వ్యవహరించారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

- వైపాలెంలో ముస్తాబైన దేవాలయం - 20వరకు కార్యక్రమాలు

ఎర్రగొండపాలెం రూరల్ : మండలంలోని వెంకటాద్రిపాలెంలోని శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి దేవాలయంలో శనివారం నుంచి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి, అర్చకులు కారంపూడి వెంకటాచార్యులు శుక్రవారం తెలిపారు. 12న ధ్వజారోహణ, అంకురార్పణ, భేరిపూజ, అక్షతారోహణ, రాత్రి 10 గంటలకు కల్యాణం ఉంటుందన్నారు. 13న సింహవాహనం, 14న శేషవాహనం, 15న హనుమంత వాహనం, 16న గరుడవాహనం 17న మోహినిఉత్సవం రాత్రికి గజోత్సవం, 18న రథోత్సవం, 19న అశ్వవాహనం, 20న పూర్ణహుతి వసంతోత్సవం నిర్వహిస్తారన్నారు.

అంబరాన్నంటిన మందిరాల సంబరాలు


టీడీపీ ప్రభపై సాంస్కృతిక ప్రదర్శనలు

చీమకుర్తి, ఏప్రిల్11(ఆంధ్రజ్యోతి): రామతీర్థం తిరునాళ్ల మహోత్సవంలో భాగంగా శుక్రవారంరాత్రి చీమకుర్తి పట్టణంలో నిర్వహించిన మందిరాల సంబరాలు అంబరాన్నంటాయి. తూర్పుబజార్‌లో ఎన్టీఆర్ విగ్రహం వద్ద టీడీపీ ఆధ్వర్యంలో ప్రభను ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ ఈప్రభపై ఎక్కి అభిమానులను ఉత్సాహపరిచారు.బీవీఎస్ఆర్ కల్యాణమండపం వద్ద వైసీపీ ప్రభపై జడ్పీచైర్‌పర్సన్ వెంకాయమ్మ, ఎమ్మెల్యే శివప్రసాదరెడ్డి హాజరయ్యారు. ఇక గాంధీనగర్‌లో పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో, హరిహరక్షేత్రం ప్రాంగణంలో ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో ప్రభలను ఏర్పాటు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా అలరించాయి.



రఘువంశ రామయ్య.. సుగుణాల సీతమ్మ
వరమాలకై వేచె సమయాన..
శివధనువు విరిచాకె.. వధువు మది గెలిచాకె
మోగింది కల్యాణ శుభవేళ..
కల్యాణం.. వైభోగం.. శ్రీరామచంద్రుని కల్యాణం...

అన్నట్లుగా ఏకశిలానగరం పులకరించింది. శ్రీరామ నామస్మరణతో ఒంటిమిట్ట మార్మోగింది. ఆంధ్రా భద్రాద్రి, దక్షిణాది అయోధ్యగా పేరొందిన ఏకశిలానగిరి ఒంటిమిట్ట కోదండరామాలయంలో శ్రీరామనవమి వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శుక్రవారం నిండు వెన్నెలలో సీతారాముల కల్యాణాన్ని టీటీడీ ఆధ్వర్యంలో నభూతో నభవిష్యతి అన్న రీతిలో నిర్వహించారు. ముందుగా రామయ్యకు యజ్ఞోపవీతం, సీతమ్మకు స్వర్ణ కిరీటం కానుకగా అందించారు. ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దంపతులు అందించారు. స్వామివారి కల్యాణాన్ని చూసేందుకు భక్తులు విశేషంగా తరలి రావడంతో ఒంటిమిట్ట జనసంద్రంగా మారింది.


కళాకారుల నృత్యం


పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు తీసుకొస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దంపతులు

ఆలయ శిల్పకళను పరిశీలిస్తున్న సీఎం


ఎదుర్కోలు దృశ్యం

సీతారాముల కల్యాణం తిలకిస్తున్న చంద్రబాబు దంపతులు

● గ్రామంలో మొత్తం 400 గృహాలు ● జనాబా 2,000 మంది



కెల్లంపల్లి గ్రామ వ్యూ

నవతరం.. తొలగిన అంతరం

కెల్లంపల్లిలో ఫ్యాక్షన్‌కు యువత ఫుల్‌స్టాప్

ముండ్లమూరు మండలంలోని కెల్లంపల్లి ఒకప్పుడు ఫ్యాక్షన్ గ్రామం. కొన్ని దశాబ్దాల క్రితం వరకు పగలు పడగవిప్పాయి. దగ్గర బంధువులైనప్పటికీ పండుగలు, శుభకార్యాలకు కూడా కలుసుకోలేని దుస్థితి. ఆ క్రమంలోనే 18 ఏళ్ల క్రితం జరిగిన ఒక హత్యతో గ్రామంలో నిర్మిస్తున్న అంకమ్మ దేవాలయం అర్ధంతరంగా నిలిచిపోయింది. అంతకుముందు జరిగిన రెండుమూడు హత్యల నేపథ్యంలో నాలుగు దశాబ్దాలుగా గ్రామస్థులకు కంటి మీద కునుకు లేకుండాపోయింది. ఏళ్ల తరబడి వందల మంది కోర్టుల చుట్టూ తిరిగారు. ఆస్తులు కరగదీసుకున్నారు. వాటన్నింటినీ గమనించిన యువత ఒకతాటిపైకి వచ్చింది.

ముండ్లమూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి)

యువతలో చైతన్యం

గ్రామానికి చెందిన చాలా మంది విద్యార్థులు ఉన్నత చదువులు చదివి సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలతో పాటు వివిధ రంగాల్లో స్థిరపడ్డారు. ఇక్కడుంటున్న యువతతోపాటు బయటకెళ్లి స్థిరపడిన ఉద్యోగుల్లో కూడా మార్పు వచ్చింది. ఫ్యాక్షన్ వల్ల గ్రామాభివృద్ధి ఆగిపోవటమే కాక ఆస్తిపాస్తులు నష్టపోవడం తప్ప మిగిలేదేమీలేదని అందరికీ అర్థమయ్యేలా వివరించారు. గ్రామాభివృద్ధికి కలిసికట్టుగా ముందడుగు వేయాలని తీర్మానించుకున్నారు. తొలుత ఆగిపోయిన అంకమ్మ దేవాలయ నిర్మాణాన్ని పూర్తి చేయాలని నిర్ణయించుకున్నారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల్లో పురుడుపోసుకున్న చైతన్యం
వారికి వివిధరంగాల్లో స్థిరపడిన వారు అండ
గ్రామాన్ని ఏకతాటిపైకి తెచ్చిన వైనం
అందరూ కలిసి అభివృద్ధికి కంకణం
హత్యతో ఆగిపోయిన అంకమ్మ దేవాలయ నిర్మాణానికి తొలుత శ్రీకారం
కోటి రూపాయల విరాళాల సేకరణ
ఈనెల 23న ప్రతిష్ఠా మహోత్సవం



ప్రతిష్ఠకు ముస్తాబైన అంకమ్మ దేవాలయం

ఒకే తాటిపై నిలిచాం



జీ వెంకటశ్రీహరి

గ్రామం మొత్తం యువత మాటకే కట్టుబడి ఉంది. అందుకు అనుగుణంగా ఏడుగురితో కమిటీగా ఏర్పడి ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టాం. మొదటగా దేవాలయాన్ని ఎంచుకున్నాం. ఫ్యాక్షన్ ముద్ర తొలగి పోవాలనే నిర్ణయంతోనే ముందుకు వచ్చాం.

అంకమ్మ దేవాలయ నిర్మాణమే ముఖ్యం



మాదాల శ్రీను, సాఫ్ట్‌వేర్ ఉద్యోగి, కెల్లంపల్లి

మా గ్రామంలో అంకమ్మ తల్లి దేవాలయ నిర్మాణం 18 ఏళ్ల క్రితం ఆగిపోయింది. ఆనాడు ఫ్యాక్షన్ ఉండటం వల్ల ఎవరూ పట్టించుకోలేదు. సాఫ్ట్‌వేర్‌లు, వివిధ రంగాల్లో స్థిరపడిన యువత ఒక ఆలోచనకు వచ్చింది. గొడవల వల్ల నష్టపోవటం తప్ప ఏమి లేదని అనుకొని అమ్మవారి ఆలయాన్ని ప్రతిష్ఠించాలని నిర్ణయించుకొని ముందుకు వెళ్లాం.

ఏడుగురితో కమిటీ ఏర్పాటు

ఏడుగురు మాదాల శ్రీను, నిడమానూరి అంజయ్య, కుంటా యలమంద, గరికపాటి వెంకటశ్రీహరి, మొదుళ్ల శ్రీనివాసరెడ్డి, నిడమానూరి మణికంఠ, గాలం శంకరరావులు కమిటీగా ఏర్పడ్డారు. ఈనెల 23న అంకమ్మ తల్లి దేవాలయ ప్రతిష్ఠా మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని నిర్ణయించారు.

కోటి రూపాయలకుపైగా విరాళాలు

గ్రామంలో ఉన్న ప్రతి ఒక్కరూ విరాళాలు అందించారు. అలా కోటి రూపాయలకు పైగా విరాళాలు వచ్చాయి. 18 ఏళ్లుగా ఫ్యాక్షన్ గొడవల వల్ల ఆగిపోయి ప్రతిష్ఠకు నోచుకోని అంకమ్మ తల్లి దేవాలయం యువత స్ఫూర్తితో ప్రతిష్ఠా మహోత్సవం జరగనుంది. గ్రామాభివృద్ధికి ఇది తొలి అడుగని కమిటీ నిర్వాహకులు తెలిపారు. ప్రస్తుతం గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

యువత ముందుకు రావటం శుభపరిణామం



నిడమానూరి అంజయ్య, కెల్లంపల్లి,

ఫ్యాక్షన్ వల్ల అభివృద్ధి ఆగిపోవటమే కాక చుట్టుపక్కల గ్రామాల వారందరికీ మా గ్రామంపై చెడు ప్రభావం పడింది. ఆ ముద్రను తొలగించేందుకు ఒక అడుగు ముందుకు వేసి యువత అంతా కూర్చొని ఆలోచించుకున్నాం. ఎలాగైనా అంకమ్మ తల్లి దేవాలయాన్ని గ్రామం మొత్తం కలిసి నిర్మించాలనుకుని ముందుకుసాగుతున్నాం.

ఒకే మాటపై కట్టుబడి ఉన్నాం



కుంటా యలమంద, కెల్లంపల్లి

ఆనాటి పరిస్థితుల వల్ల గ్రామంలో ఎవరూ కూడా కొన్నాళ్ల పాటు ఆలయం నిర్మించేందుకు ముందుకు రాలేదు. చదువుకున్న వారమంతా మాట్లాడుకుని దేవాలయాన్ని అలా వదిలి వేయటం గ్రామానికే అరిష్టమని భావించాం. ప్రతి ఒక్కరినీ చందలు అడిగి కోటి రూపాయలకు పైగా వసూలు చేసి ఆలయాన్ని నిర్మించాం.

చాలా ఆనందంగా ఉంది



నిడమానూరి మణికంఠ, సాఫ్ట్‌వేర్ ఉద్యోగి

నాతో పాటు చాలామంది ముందుకు వచ్చి అంకమ్మతల్లి దేవాలయ నిర్మాణానికి పూనుకోవటం చాలా సంతోషమేసింది. అనవసరంగా ఫ్యాక్షన్ రాజకీయాల వల్ల ఇన్నేళ్ల పాటు దేవాలయ నిర్మాణాన్ని అలా ఉంచటం బాధ వేసింది. గ్రామంలో మారుతున్న యువత మొదటి ప్రయత్నంలో గ్రామస్థులందరినీ ఒప్పించి సఫలీకృతులయ్యాం.

ఆలయం ఆగిపోవటం గ్రామానికే అరిష్టమైంది



మొదుళ్ల శ్రీనివాసరెడ్డి, కెల్లంపల్లి గ్రామస్థుడు

18ఏళ్ల నుంచి ఆలయం మొండి గోడలు దర్శనమివ్వటంతో గ్రామానికి అరిష్టం జరుగుతూ వస్తుండేది. గ్రామంలోని యువత ముందుకు కదిలి వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసుకోవటంతో అందరూ స్పందించారు. విరివిగా చందాలు అందించారు. ఇప్పుడు ప్రతిష్ఠా మహోత్సవానికి సిద్ధమవ్వటంతో ప్రతి ఒక్కరిలో ఆనందం వెల్లివిరుస్తోంది.

ఆ భావంతో అందరం కలిశాం



గాలం శంకర్, కెల్లంపల్లి

దశాబ్దాల పాటు ఫ్యాక్షన్ గొడవల వల్ల కొన్ని కుటుంబాలు ఆర్థికంగా చితికిపోయాయి. ఎన్నికలొస్తే ఎప్పుడు ఏం జరుగుతుందోనని భయపడి బతికాం. చదువుకున్న యువకులందరం కూర్చొని మంచి నిర్ణయానికి వచ్చాం.

మెప్మాలో వసూళ్ల భాగోతంపై మొక్కుబడి విచారణ..?

ఒంగోలు కార్పొరేషన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మెప్మాలో ఆర్పీల అవినీతి భాగోతంపై విచారణ మొక్కుబడిగా చేశారన్న ఆరోపణలున్నాయి. మార్చి 8న మార్కాపురంలో జరిగిన సీఎం చంద్రబాబు సభా కార్యక్రమం పేరుతో ఒంగోలు మెప్మా సిటీ మిషన్ మేనేజర్ చేతివాటం చూపారు. దీనిపై ఆంధ్రజ్యోతి కథనం ప్రచురించింది. కలెక్టర్ తమీమ్ అన్సారియా సీరియస్ అయ్యారు. ఈ మేరకు విచారణ కమిటీని కూడా నియమించారు. ఆ కమిటీలో కడప నుంచి ఐబీ స్పెషలిస్ట్ హరిప్రసాద్ రెడ్డి, నెల్లూరు ఐబీ అంకయ్య గుంటూరు ఎల్‌హెచ్ ఫణికుమార్‌ను నియమితులయ్యారు. శుక్రవారం ఒంగోలు మెప్మాకు విచ్చేసిన ఆ కమిటీ ప్రతినిధులు మొక్కుబడి విచారణతో మమ అనిపించగా, అవినీతికి పాల్పడిన సీఎంఎం ముందు చూపుతో అందరూ అర్పీలను పిలవకుండా తనకు అనుకూలమైన వారిని పిలిపించి, ఎలాంటి డబ్బులు ఇవ్వలేదని చెప్పించినట్లు సమాచారం. దీంతో విచారణ కమిటీ సైతం వచ్చామా.. పోయామా.. అన్నట్లు వ్యవహరించడంపై చర్చనీయాంశంగా మారింది.

రఘునాయకస్వామి ఆభరణాలు అప్పగింత

● గతంలో చోరీ జరగ్గా రికవరీ చేసిన పోలీసులు



రికవరీ చేసిన వెండి, బంగారు వస్తువులను అప్పగిస్తున్న సీఐ శ్రీకాంత్‌బాబు, ఎస్ఐ శ్రీకాంత్

నాగులుప్పలపాడు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఇటీవల చదలవాడలోని శ్రీరఘునాయకస్వామి దేవాలయంలో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి స్వామి వార్లకు అలంకరించిన వెండి, బంగారు వస్తువులను తస్కరించారు. కేసు నమోదు చేసిన పోలీసులు చోరీకి పాల్పడిన వ్యక్తులను గుర్తించి వారి వద్ద నుంచి రికవరీ చేసిన 5 కేజీల వెండి ముద్ద, 400 గ్రాముల వెండి పళ్లెం, సీతమ్మ వారి బంగారు మంగళసూత్రాలను శుక్రవారం ఒంగోలు రూరల్ సీఐ శ్రీకాంత్‌బాబు, ఎస్ఐ బి.శ్రీకాంత్‌లు శుక్రవారం ఆలయ ఈవో అనిల్‌కు అందజేశారు. ఈ నెల 14న శ్రీరఘునాయక స్వామివార్ల కల్యాణం జరగనుండగా చోరీకి గురైన స్వామి వార్ల వెండి, బంగారు వస్తువులను రికవరీ చేసి ఆలయ అధికారులకు అందించినట్లు సీఐ శ్రీకాంత్ తెలిపారు. అనంతరం దేవస్థాన ప్రాంగణంలో కల్యాణ వేడుకల ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆలయ అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు.

ఒకే దేశం-ఒకే ఎన్నిక.. అభివృద్ధికి మార్గం

మంత్రి సత్యకుమార్

ఒంగోలు నగరం, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి) : ఒకే దేశం.. ఒకే ఎన్నిక ఆలోచన దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు ఓ మంచి మార్గమని వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ చెప్పారు. ఒంగోలులోని ఎన్టీఆర్ కళా క్షేత్రంలో శుక్రవారం జరిగిన ఒకే దేశం-ఒకే ఎన్నికపై జరిగిన మేధావుల సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సదస్సుకు విశ్రాంత న్యాయమూర్తి వి.నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. సదస్సులో మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ దేశంలో ఎన్నికలు ఒకేసారి జరగకపోవటం వలన అనేక విధాలా నష్టపోతున్నామన్నారు. పలుమార్లు ఎన్నికల కోడ్ అభివృద్ధి పనులకు ఆటంకంగా మారుతుందని చెప్పారు. ఎన్నికలు విడివిడిగా జరగటం వలన అభ్యర్థుల ఖర్చుకూడా విపరీతంగా పెరిగిపోతుందన్నారు. దేశంలో వివిధ సమయాల్లో జరుగుతున్న ఎన్నికల ఖర్చు రూ.4.50లక్షల కోట్లు ఉంటుందని, ఒకేసారి నిర్వహిస్తే ఈ ఖర్చును అంతా విద్య, వైద్య రంగాలపై పెట్టే అవకాశం ఉంటుందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ఆర్టికల్ 356ని ఉపయోగించుకుని అనేకసార్లు రాష్ట్ర ప్రభుత్వాలను భర్తరఫ్ చేసిందని ఆయన గుర్తు చేశారు. దేశంలో 2034 నాటికి పూర్తి స్థాయిలో జమిలి ఎన్నికలు నిర్వహించేందుకు కేంద్రం ప్రణాళికా బద్ధంగా కృషి చేస్తోందన్నారు. శాసనసభ్యులు దామచర్ల జనార్దన్, బీఎన్ విజయకుమార్, జనసేన జిల్లా అధ్యక్షులు రియాజ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్, పక్కన ఎమ్మెల్యేలు జనార్దన్, విజయ్‌కుమార్

పరిశ్రమలకు రూ.6.44కోట్లు రాయితీ మంజూరు

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని 293 క్లెయిమ్స్‌కు సంబంధించి రూ.6.44 కోట్ల రాయితీలను మంజూరు చేస్తున్నట్లు కలెక్టర్ అన్సారియా చెప్పారు. స్థానిక కలెక్టరేట్‌లో శుక్రవారం సాయంత్రం జరిగిన డీఐఈపీసీ సమావేశానికి జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా అధ్యక్షత వహించారు. ఈసమావేశంలో జిల్లాలో పరిశ్రమల ప్రోత్సాహకాలను ప్రోత్సహించేందుకు తీసుకోవాల్సిన పలు అంశాలపై కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. సింగిల్ డెస్క్ పోర్టర్ ద్వారా అనుమతుల కోసం వివిధశాఖలకు 861 దరఖాస్తులు రాగా 841కు ఆమోదం తెలిపినట్లు కలెక్టర్ తెలిపారు. పీఎంఈజీపీ పథకం జిల్లా రాష్ట్రంలో ద్వితీయ స్థానంలో ఉందన్నారు. తిరస్కరించిన దరఖాస్తులను పునఃపరిశీలించాలని ఎల్‌డీఎంను కలెక్టర్ ఆదేశించారు. ప్రతి నియోజకవర్గంలో ఒక ఇండస్ట్రియల్ పార్కును ఏర్పాటు చేసేందుకు భూమిని గుర్తించినట్లు సంబంధిత అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల కేంద్రం అధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

పొగాకును ఎప్పటికప్పుడు అమ్ముకోవాలి

పొదిలిలో వేలం కేంద్రాన్ని సందర్శించిన చైర్మన్ యశ్వంత్‌కుమార్

పొదిలి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : పొగాకు పండించిన రైతులు త్వరగా పొగాకును వేలంలో ఉంచి అమ్ముకోవాలని పొగాకుబోర్డ్ చైర్మన్ యస్వంత్‌కుమార్ అన్నారు. శుక్రవారం వేలం నిర్వహణ అధికారి గిరిరాజ్‌కుమార్ అధ్యక్షతన పొదిలి పొగాకుబోర్డ్‌ను సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడారు. రైతులు పండించిన పంటలో ఏగ్రేడ్ అయితే మార్కెట్‌లో గిరాకీ ఉండి మంచి ధరకు అమ్ముకోవచ్చన్నారు. బేళ్లు కట్టేటప్పుడు వ్యర్థాలను రానివ్వకుండా, నాణ్యతను మరిచిపోకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మంచి పొగాకును వేలం కేంద్రానికి తీసుకురావాలని కోరారు. నాణ్యత లేని పొగాకు వేలానికి తీసుకురావడం రైతులకు సరైన ధర లభించదన్నారు. మనం కర్నాటక మార్కెట్ వలన కొనుగోళ్లల్లో 10 నుంచి 15 రోజులు వెనుకబడి ఉన్నామన్నారు. అంతేకాకుండా బర్లీపొగాకు కూడా బ్యారన్ పొగాకుతో పోటీగా పండించారన్నారు. అంతర్జాతీయంగా పొగాకు కొనుగోళ్లలో ఒడిదుడుకులు ఉంటాయని చెప్పారు. గతంలో అనుకున్నదాని కంటే ఎక్కువగా పండించినా ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు చేసేందుకు సహకరించామన్నారు. అయితే ఈ ఏడాది పొగాకుసాగు తగ్గించాలని ముందుగా అవగాహన కల్పించినా, రైతులు అధికంగా పండించారన్నారు. దీంతో డిమాండ్ తగ్గుతుందన్నారు. ధరల పెరుగుతాయన భావన వీడి అన్నదాతలు ఎప్పటికప్పుడు అమ్ముకోవాలని సూచించారు. ఈఏడాది పెరిగిన కూలీలు, ఖర్చులకు అనుకూలంగా సరాసరి క్వింటా రూ.30వేలు ధర ఉంటేనే రైతులకు గిట్టుబాటు ఉంటుందని పలువురు రైతులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఆయన అనుకూలమైన ధరలు వచ్చే విధంగా వ్యాపారులతో చర్చించి మంచిధరలు వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రధానంగా పొగాకు పండించే దేశాలతో పోటీగా పొగాకును పండిస్తున్నామన్నారు. ముందుగా వేలంలో పాల్గొని ధరలు ఎలా ఉన్నాయోనని పరిశీలించారు. అనంతరం పొగాకు నాణ్యతను పరిశీలించారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ బ్రహ్మయ్య, రైతు సంఘనాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.



పొగాకువేలంలో పాల్గొన్న బోర్డ్ చైర్మన్ యశ్వంత్‌కుమార్

ఎక్సైజ్ శాఖలో 11 మందికి ఎస్సైలుగా ఉద్యోగోన్నతి

ఒంగోలు క్రైం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పనిచేస్తున్న 8 మంది హెడ్‌కానిస్టేబుళ్లకు, ముగ్గురు జూనియర్ అసిస్టెంట్‌లకు ఎస్సైలుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ గుంటూరు ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం హెడ్‌కానిస్టేబుళ్లుగా పనిచేస్తున్న వారికి సబ్ ఇన్‌స్పెక్టర్‌లుగా ఉద్యోగోన్నతి కల్పించి పోస్టింగ్‌లు ఇచ్చారు. కె.ఏడుకొండలు కనిగిరికి, ఎస్.శ్రీనివాసరావు సింగరాయకొండకు, ఎస్.కె.యూసఫ్ షరీఫ్ దర్శికి, వి.జాన్‌సన్ మాచర్లకు, ఏ శ్యామ్యేల్ విజయపురి చెక్ పోస్టు గుంటూరుకు, సిహెచ్.రవిప్రసాద్ కందుకూరుకు, ఎండీ హసీమ్ నెల్లూరు టీవీపాలెం చెక్ పోస్టుకు బదిలీ చేశారు. అదే విధంగా జూనియర్ అసిస్టెంట్‌లుగా పనిచేస్తున్న ముగ్గురిని సబ్‌ఇన్‌స్పెక్టర్‌లుగా ఉద్యోగోన్నతి కల్పించారు. కె.అప్పయ్య పొదలకూరుకు, ఎం.బాలకృష్ణ పొండుగులా చెక్ పోస్టుకు, కె.తేజేశ్వర్ కనిగిరిలో పోస్టింగ్‌లు ఇచ్చారు.

పేదల అభ్యున్నతే కూటమి ప్రభుత్వ ధ్యేయం

- వైసీపీ ప్రభుత్వంలో బీసీలను అణగదొక్కారు..
- మంత్రి సత్యకుమార్ యాదవ్ ధ్వజం
- సింగరాయకొండలో 100 పడకల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఏర్పాటుకు హామీ
- మంత్రి స్వామి, చైర్మన్లు నూకసాని, సత్యతో కలిసి పూలే విగ్రహం ఆవిష్కరణ


ప్రసంగిస్తున్న మంత్రి సత్యకుమార్‌యాదవ్, ఇన్‌సెట్లో పూలే విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రులు స్వామి, సత్యకుమార్‌యాదవ్

సింగరాయకొండ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : పేదల అభ్యున్నతే కూటమి ప్రభుత్వం ధ్యేయమని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి వై.సత్యకుమార్ యాదవ్ అన్నారు. శుక్రవారం సింగరాయకొండ రైల్వేస్టేషన్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన మహాత్మ జ్యోతిరావుపూలే కాంస్య విగ్రహాన్ని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి, టూరిజం బోర్డు, మారిటైం బోర్డుల చైర్మన్లు నూకసాని బాలాజీ, దామచర్ల సత్యతో కలిసి ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి సత్యకుమార్ మాటాడారు. సామాజిక చైతన్యానికి, సమానత్వానికి పూలే ప్రతీక అని కొనియాడారు. గత వైసీపీ ఐదేళ్ల పాలనలో బీసీలను అణగదొక్కారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీల సాధికారితకోసం సీఎం చంద్రబాబునాయుడు అహర్నిశలు కృషిచేస్తున్నారని తెలిపారు. ఆయన క్యాబినెట్‌లో 8 మంది బీసీలకు అవకాశం కల్పించారని, బడ్జెట్‌లో బీసీల సంక్షేమానికి రూ.45,456 కోట్లు కేటాయించారని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వంలో బీసీ కార్పొరేషన్ నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. పూలే జయంతిని పురస్కరించుకొని బీసీలకు రూ.897 కోట్లు సబ్సిడీ రుణాలు మంజూరు చేసినట్లు వెల్లడించారు. సమాజంలో బలహీన వర్గాలను పైకి తీసుకురావడానికి పీ4 వినూత్న కార్యక్రమానికి చంద్రబాబు శ్రీకారం చుట్టారని తెలిపారు. సింగరాయకొండలో 100 పడకలతో మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఏర్పాటుకు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. పూలే ఆశయాలను కూటమి ప్రభుత్వం కొనసాగిస్తుందని మంత్రి స్వామి అన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో బీసీలపై దాడులు, అక్రమ కేసులు పెట్టి వేధింపులకు గురిచేశాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల్లో బీసీలకు ఉన్న 33 శాతాన్ని 24 శాతానికి కుదించి రాజకీయ అవకాశాలు లేకుండా చేశారని మండిపడ్డారు. జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలను మూతవేశారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో బీసీలకు రాజకీయంగా ప్రాధాన్యత కల్పించిన పార్టీ టీడీపీ నేనని టూరిజం బోర్డు చైర్మన్ నూకసాని బాలాజీ అన్నారు. బలహీన వర్గాల కోసం కృషిచేసిన మహోన్నత వ్యక్తి పూలే అని మారిటైం బోర్డు చైర్మన్ సత్య అన్నారు. సింగరాయకొండలో 100 పడకల ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని కోరారు.

పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి

- కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాధాకృష్ణ

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంతోపాటు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరపై బోనస్ ఇచ్చి రైతులను ఆదుకోవాలని కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై.రాధాకృష్ణ డిమాండ్ చేశారు. ఒంగోలులోని సుందరయ్య భవన్‌లో రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబుతో కలిసి శుక్రవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది వాణిజ్య పంటలకు గిట్టుబాటు ధర లభించడం లేదన్నారు. ఈ ఏడాది రాష్ట్రంలో నాలుగు లక్షల ఎకరాల్లో మిర్చి సాగు చేయగా 60 లక్షల క్వింటాళ్ళు దిగుబడి వచ్చిందన్నారు. గత ఏడాది రూ.20వేల నుంచి రూ.24వేలు ఉండగా, ఈ ఏడాది కేవలం రూ.10వేలు నుంచి రూ.12 వేలు మాత్రమే ఉందన్నారు. దీని వల్ల మిర్చి రైతులు తీవ్రంగా నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. అందువల్ల రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని చెప్పారు. కౌలు రైతుకు చట్టభద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి వి.బాలకోటయ్య పాల్గొన్నారు.

బెదిరించి వాగ్మూలం తీసుకోవడం అవాస్తవం

- డీసీఏవో రాజశేఖర్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఒంగోలు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): పొన్నలూరు పీఎసీఎస్ సీఈవో మనోజ్‌కుమార్ ఫిర్యాదుకు సంబంధించి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అటెండర్ షేక్ నవాజ్‌ను విచారించి స్టేట్‌మెంట్ తీసుకోవడం తప్ప బెదిరించి వాగ్మూలం తీసుకోలేదని డీసీఏవో రాజశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'మోసం రాజా' పేరుతో ఈనెల 10వ తేదీన ఆంధ్రజ్యోతిలో ప్రచురించిన కథనంపై డీసీఏవో రాజశేఖర్ వివరణ ఇచ్చారు. అటెండర్ నవాజ్ తనను బెదిరించినట్లు ఆరోపించడాన్ని ఖండించారు. పొన్నలూరు సొసైటీలో నిధులు దుర్వినియోగం అయినట్లు 2023-24 ఆడిట్ రిపోర్టు ఇచ్చిన ఆడిటర్ ఆ సంఘంపై సెక్షన్ 51 విచారణను కోరడంతో పైఅధికారులకు పంపామన్నారు. అది వారి పరిశీలనలో ఉందని, తమ కార్యాలయం నుంచి ఎలాంటి నోటీసులు ఇవ్వలేదన్నారు. కాగా మంత్రి డాక్టర్ డీఎస్ బీవీ.స్వామికి పొన్నలూరు సీఈవో ఇచ్చిన వినతిపత్రంను విచారణ కోసం కలెక్టర్‌కు పంపారని, అందులో కూడా డీసీఏవోపై ఆరోపణలు చేయలేదని వివరించారు. జిల్లా సహకారాధికారి కార్యాలయంలో పెండింగ్ ఉన్న సెక్షన్ 51 విచారణకు సంబంధించి పొన్నలూరు సీఈవోపై పిటిషన్‌ను డీసీఏవో కార్యాలయం నుంచి తయారు చేశారనేది కూడా అవాస్తవంగా తెలిపారు. నవాజ్ ఆరోపిస్తున్న ఉద్యోగి కూడా డీసీవో కార్యాలయంలో గుమస్తాగా వివరించారు.

ఎమ్మెల్యే దామచర్లకు సత్కారం


ఎమ్మెల్యే జనార్దన్‌ను సన్మానిస్తున్న సంస్థ సభ్యులు

ఒంగోలు కల్చరల్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయ సాహిత్య సాంస్కృతిక సేవాసమితి అధ్యక్షుడు కుర్రా ప్రసాద్‌బాబు ఆధ్వర్యంలో శుక్రవారం ఒంగోలులో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌ను పలువురు సాహితీవేత్తలు శాలువా, జ్ఞాపిక, పుష్పమాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దామచర్ల మాట్లాడుతూ శ్రీకృష్ణదేవరాయ సేవాసమితి ఆధ్వర్యంలో ఇటీవల ఘనంగా ఉగాది కవితా మహోత్సవం నిర్వహించటం అభినందనీయమని అన్నారు. అదే విధంగా సాహిత్య, సాంస్కృతిక రంగానికి, కళాకారులకు తన సహకారం ఎప్పుడూ ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో నాగభైరవ సాహిత్యపీఠం అధ్యక్షుడు ఆదినారాయణ, సింహాద్రి జ్యోతిర్మయి, నాళం నరసమ్మ, బీరం అరుణ, తూము రాజేష్, పసుపులేటి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులతో ప్రజలకు మేలు జరగాలి

- డ్వామా పీడీ జోసఫ్‌కుమార్

మద్దిపాడు, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం ద్వారా ప్రజలకు మేలు జరగాలని డ్వామా పీడీ జోసఫ్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం మద్దిపాడు మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సామాజిక తనిఖీ ప్రజావేదికలో ఆయన మాట్లాడారు. 2023-24కు సంబంధించి 19 గ్రామ పంచాయతీల్లో జరిగిన పనులకు సంబంధించి రికార్డులను తనిఖీచేశారు. మండలంలోని అన్ని పంచాయతీలో మస్టర్లలో జరిగిన తప్పులను పరిగణనలోకి తీసుకుని దిద్దుబాటు జరిగిందని నిర్ధారించి రూ.34,645లను రికవరీ చేయాలని పీడీ ఆదేశించారు. రికార్డులు సక్రమంగా నిర్వహించని వారికి అపరాధరుసుం విధించారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారి వండర్‌మ్యాన్, ఎంపీడీవో ప్రసాద్, టీడీపీ మండల అధ్యక్షుడు జయంత్‌బాబు పాల్గొన్నారు. అనంతరం పీడీ ఉపాధి సిబ్బందితో సమావేశమై సోక్‌పిట్లు, క్యాటిల్ షెడ్లు నిర్మాణాలు వేగవంతం చేయాలని ఆదేశించారు. ఏపీడీ వెంకటస్వామి పాల్గొన్నారు.

వైభవంగా హరిహరక్షేత్రం వార్షికోత్సవాలు


పూజల్లో పాల్గొన్న శిద్దా సుధీర్,శృతి, కుటుంబసభ్యులు

చీమకుర్తి, ఏప్రిల్11 (ఆంధ్రజ్యోతి) : చీమకుర్తిలోని హరిహరక్షేత్రంలో వార్షికోత్సవ పూజలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయాన్ని సుందరంగా తీర్చదిద్దారు. తొలుత అర్చకులు మాజీ మంత్రి శిద్దారాఘవరావు, లక్ష్మీపద్మావతి దంపతులకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం జరిగిన విశేషపూజల్లో శిద్దా సుధీర్‌కుమార్, శృతి దంపతులు కుటుంబసభ్యులతో కలిసి పాల్గొన్నారు. రాత్రివేళ అయ్యప్పస్వామి పడిభజన అత్యంత ఘనంగా జరిపారు. శిద్దా వెంకటేశ్వరరావు, శిద్దా బాలాజీ, శిద్దా సుధాకర్, కుటుంబసభ్యులతో కలిసి పూజల్లో పాల్గొన్నారు. మహిళలు,భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

హనుమంత వాహనంపై శ్రీరఘునాయకుడు


హనుమంత వాహనంపై విహరిస్తున్న స్వామివారు

నాగులుప్పలపాడు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ చదలవాడ శ్రీ రఘునాయకస్వామి వారి వార్షిక కల్యాణ మహోత్సవాలలో భాగంగా ఐదవ రోజు శుక్రవారం ఉదయం స్వామివార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. రాత్రికి స్వామివార్లను ప్రత్యేక అలంకరణలో హనుమంత వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. బి.నిడమానూరు గ్రామానికి చెందిన బొమ్మరాజు రామ కోటయ్య శర్మ, సత్యప్రకాష్, సత్యప్రతీక్ ఉభయదాతలుగా వ్యవహరించారు. చదలవాడ శ్రీఅభయాంజనేయస్వామి డీజే కోలాట బృందంచే కోలాటం, నెల్లూరు శ్రీవేంకటేశ్వర నాట్యమండలి ఆధ్వర్యంలో శ్రీరామాంజనేయ యుద్ధం నాటకం ప్రదర్శించారు. భక్తులకు అన్న ప్రసాద వితరణ జరిగింది.

మొక్కలే లేవు.. అయినా బిల్లులు చెల్లింపులా..

- స్టేట్ రీసోర్స్‌పర్సన్ రామచంద్రరావు


ప్రజావేదికలో మాట్లాడుతున్న పీడీ జోసఫ్‌కుమార్

నాగులుప్పలపాడు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం మండలంలో చేపట్టిన పండ్ల మొక్కల పెంపకం కింద లబ్ధిదారులకు బిల్లులు చెల్లింపులు చేశారని, అయితే ఎక్కడా పండ్ల మొక్కల జాడ కనిపించలేదని సామాజిక తనిఖీ స్టేట్ రీసోర్స్ పర్సన్ రామచంద్రరావు పేర్కొన్నారు. శుక్రవారం నాగులుప్పలపాడు మండల పరిషత్ కార్యాలయం వద్ద ఉపాధి పనులపై ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేట్ రీసోర్స్ పర్సన్ మాట్లాడుతూ 2023 మార్చి నుంచి 2024 ఏప్రిల్ వరకు జరిగిన ఉపాధి పనులను తనిఖీ బృందాలు పరిశీలన చేసినట్లు చెప్పారు. ప్రధానంగా పండ్ల మొక్కల పెంపకం సక్రమంగా జరగలేదని, అనేక గ్రామాల్లో కూలీల మస్టర్లలో సంతకాలు లేకుండా నిశాని అని రాసి నగదు చెల్లింపులు చేశారని, మస్టర్లు తక్కువగా ఉండి ఎక్కువ రోజులకు కూలి నగదు చెల్లింపులు జరిగాయని, కొంతమందికి కూలి జమ కాలేదని గుర్తించినట్లు చెప్పారు. అనంతరం పీడీ జోసఫ్‌కుమార్ మాట్లాడుతూ పండ్ల మొక్కలు నాటే సమయంలో తీసిన ఫొటోల నగదు చెల్లింపులు చేస్తారని, అప్పటి మొక్కలు ఇప్పుడు లేవని ఉపాధి సిబ్బందిని బాధ్యులను చేయడం సరికాదన్నారు. గ్రామాల్లో ఉపాధి సిబ్బందికి అనేక రకాల విధులు ఉంటాయని, అందువల్ల సచివాలయ, ఉద్యానశాఖ సిబ్బందికి వాటి బాధ్యత అప్పగించవచ్చు కదా అని ప్రశ్నించారు. మొత్తం మీద తనిఖీ బృందాలు గుర్తించిన అంశాలపై ప్రజావేదికలో స్పష్టమైన చర్యలు లేకుండానే ముగిసింది. కార్యక్రమంలో విజిలెన్స్ అధికారి వండర్‌మెన్, ఎంపీడీవో వై.మహాలక్ష్మి, ఏపీవో రవిబాబు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రంలో బీసీ కులగణనను అమలు చేయాలి

- బీసీ సమన్వయ కమిటీ డిమాండ్


ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): బీసీ కులగణనను ప్రభుత్వం అమలు చేయాలని బీసీ సమన్వయ కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ రాష్ట్ర అధికార ప్రతినిధి ధరణికోటి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో కలెక్టర్ల ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బందితో జనాభా లెక్కలు తీశారన్నారు. అందులో 52శాతంగా బీసీలు ఉన్నట్లు తేలిందని, అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఎప్పటిలాగే బీసీలకు 36శాతం ఇస్తామని కేంద్రానికి లేఖ రాయడం దారుణంగా ఉందన్నారు. ప్రభుత్వం వద్ద ఉన్న బీసీల లెక్కలను బహిర్గతం చేసి స్థానిక సంస్థల్లో, విద్యా, ఉద్యోగాల్లో 52శాతం కల్పించేలా చట్టం చేయాలని డిమాండ్ చేశారు. బీసీ సంఘాల జిల్లా చైర్మన్ బొట్లా సుబ్బారావు, బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు తాటిపర్తి వెంకటస్వామి మాట్లాడుతూ బీసీలకు న్యాయం చేయాలని కోరారు. ఓపీడీఆర్ రాష్ట్ర అధ్యక్షుడు చావలి సుధాకర్ మాట్లాడుతూ బీసీ జనాభా దామాషా ప్రకారం స్థానిక సంస్థలకు, విద్యా, ఉద్యోగాలు కల్పించేందుకు చట్టం చేయాలన్నారు. కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు దాసరి సుందరం, గుంటూరు మస్తాన్‌రావు, పెద్దన్న, కె.కోటి, కాకుమాను రవిచంద్ర, టి.శివప్రసాద్, మోతే భాస్కర్, నాగళ్ల వీరాంజనేయులు, ఫణిదనపు సుధాకర్, పి.శ్రీనివాసులు, దుర్గాభవాని, అప్పారావు పాల్గొన్నారు.

ఘనంగా మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి

నివాళులర్పించిన పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు


పూలే, అంబేద్కర్ చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న ఏకేయూ రిజిస్ట్రార్ హరిబాబు, అధ్యాపకులు

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఒంగోలులోని పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు శెగ్గం శ్రీనివాసులు ఆధ్వర్యంలో స్థానిక రామనగర్‌లోని విద్యుత్‌భవన్ వద్ద ఉన్న పూలే విగ్రహానికి మంత్రులు సత్యకుమార్, స్వామి, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. మంత్రులకు బీజేపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో పీవీ.కృష్ణారెడ్డి, పీవీ.శివారెడ్డి, యోగయ్యయాదవ్ తదితరులు పాల్గొన్నారు.
- వైసీపీ కార్యాలయంలో జరిగిన పూలే జయంతి వేడుకల్లో జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే శివప్రసాద్‌రెడ్డి, ఇన్‌చార్జి చుండూరి రవిబాబు, బత్తుల బ్రహ్మానందరెడ్డి, బొట్లా సుబ్బారావు, అదెన్న, మాదాశి వెంకయ్య, శంకర్ పాల్గొన్నారు.
- సూర్యబలిజ ఆరామక్షేత్రంలో బీసీభవన్ నిర్మాణ కమిటీ అధ్యక్షుడు రాచగర్ల వెంకట్రావు పూలే చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో జంపని రామచంద్రరావు, గోళ్ల వెంకటేశ్వరరావు, గడ్డం సత్యనారాయణ, దాసరి కృష్ణారావు, బలగాని ఆంజనేయులు, కుంచాల వెంకటేశ్వర్లు, మురళీ, అశోక్, మస్తాన్‌వలి, శివరామకృష్ణ పాల్గొన్నారు.
- కేవీపీఎస్, చేతివృత్తిదారుల సంఘాల ఆధ్వర్యంలో స్థానిక మార్కెట్ సెంటర్‌లోని పూలే విగ్రహానికి నివాళులర్పించారు. బి.రఘురాం, తోట తిరుపతిరావు, వేషపోగు మోజేష్, నారాయణ, కిలారి పెద్దబ్బాయి, రాయల మాలకొండయ్య, టంగుటూరి రాము, రాచకొండ కృష్ణయ్య, చీమకుర్తి కోటేశ్వరరావు, మల్లికార్జున, గోపాల్ పాల్గొన్నారు.
- జిల్లా వృత్తిదారుల సంఘాల ఆధ్వర్యంలో స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో పూలే చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో టంగుటూరి రాము, రాచకొండ వెంకట కృష్ణయ్య, కేఎఫ్‌బాబు, బి.రఘురాం, మాలకొండయ్య, చీమకుర్తి కోటేశ్వరరావు, వేములపాటి మల్లికార్జున, చదలవాడ యానాదిరావు, గోపాల్ పాల్గొన్నారు.
- పూలే, అంబేడ్కర్ జయంతి వేడుకలను శుక్రవారం స్థానిక ఆంధ్రకేసరి యూనివర్శిటీలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ బి.హరిబాబు, ప్రిన్సిపాల్ జి.రాజమోహన్‌రావు, వైస్ ప్రిన్సిపాల్ ఎన్.నిర్మలామణి, సీడీసీ డీన్ సోమశేఖర్, సీఈ కేవీఎస్.రాజు, కోఆర్డినేటర్ హర్షప్రీతమ్ దేవ్‌కుమార్ పాల్గొన్నారు.
- జిల్లా కాపు సంఘం కార్యాలయంలో శుక్రవారం మహాత్మాజ్యోతిరావు పూలే జయంతిని అధ్యక్షుడు కొక్కిరాల సంజీవకుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తంజావూరి శ్రీనివాసమూర్తి, నరహరి సాంబయ్య, చింతపల్లి నారాయణ, ఉమ్మడిశెట్టి శ్రీనివాసరావు, కుమార్, కొల్లా హనుమంతరావు, అయినాబత్తిన గోపీకృష్ణ, వల్లంశెట్టి హనుమంతరావు, మేకల నారాయణ పాల్గొన్నారు.
- బీటీఏ ఆధ్వర్యంలో జరిగిన పూలే జయంతి వేడుకల్లో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పర్రె వెంకట్రావు, రాష్ట్ర కార్యదర్శి మద్దిరాల శరత్‌చంద్ర, పారాబత్తిన జాలరామయ్య, కర్ర దేవసహాయం, కొండమూరి కొండలరాయుడు, పల్లె కృష్ణమూర్తి, నూకతోటి కుమార్‌స్వామి, తిరుపతిస్వామి, బొంత కళ్యాణ్, భాస్కరరావు పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయంలో..

ఒంగోలు క్రైం: స్థానిక ఎస్పీ కార్యాలయంలో మహాత్మాజ్యోతిరావు జయంతిని ఘనంగా నిర్వహించారు. పూలే చిత్రపటానికి ఎస్పీ ఏఆర్.దామోదర్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, ఆర్‌ఐలు సీతారామిరెడ్డి, రమణరెడ్డి, ఏఆర్ ఎస్‌ఐలు రవికుమార్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మద్దిపాడులో..

మద్దిపాడు: స్థానిక టీడీపీ కార్యాలయంలో పూలే జయంతి వేడుకలను మండల అధ్యక్షుడు మండవజయంత్‌బాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో నాగేశ్వరరావు, దుర్గాభవానీ, రఘుబాబు, గోపిచంద్, అనీల్ తదితరులు పాల్గొన్నారు.

సంతనూతలపాడులో..

సంతనూతలపాడు: స్థానిక టీడీపీ కార్యాలయంలో జరిగిన పూలే జయంతి వేడుకల్లో మండల అధ్యక్షుడు మద్దినేని హరిబాబు, ముప్పరాజు శ్రీను, అడకాస్వాములు, ఎం.వెంకటేశ్వర్లు, ఆర్‌వీ.సురేష్, ఎస్.శ్రీరామ్మూర్తి, బి.శంకర్, పి.చౌదరి, సుబ్బారావు, సుబ్బయ్య, మీరయ్య, అంకంశెట్టి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నాగులుప్పలపాడులో..

నాగులుప్పలపాడు: స్థానిక మండల కార్యాలయంలో ఎంపీపీ అంజమ్మ పూలే చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యాలయ సూపరింటెండెంట్ దక్షిణామూర్తి, పోలినేని కోటేశ్వరరావు, ఎంపీటీసీ పవన్, సర్పంచ్ ఘట్టమనేని అశోక్ పాల్గొన్నారు. ఉప్పుగుండూరులో జరిగిన కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కిరణ్‌కుమార్, పెంట్యాల శ్రీనివాసరావు, పేరాల చెన్నకేశవులు, వజ్రంబాబు, లింగేష్, ఆచారి పాల్గొన్నారు.

చీమకుర్తిలో..

చీమకుర్తి: పూలే జయంతిని కేవీపీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం చీమకుర్తిలో ఘనంగా జరిపారు. పోలీస్‌స్టేషన్ సమీపంలో ఉన్న పూలే విగ్రహానికి రాష్ట్ర సహాయకార్యదర్శి దుడ్డు వెంకట్రావు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆరెతోటి రాంబాబు, కొత్రపు రాఘవరావు, కోటి, కౌన్సిలర్ పాటిబండ్ల గంగయ్య, బత్తుల మల్లిఖార్జునరావు, పేరం శ్రీనివాసరావు, ఎస్‌కే.బాషా, దుర్గారావు, తెల్లమేకల గాంధీ, చింతలపాలెం యలమందబాబు, డేవిడ్‌రాజు పాల్గొన్నారు.

కొండపిలో..

కొండపి: బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం జ్యోతిరావుపూలే తన జీవితాన్ని అంకితం చేశారని పలువురు నాయకులు అన్నారు. కొండపిలోని టీడీపీ కార్యాలయంలో జ్యోతీరావుపూలే చిత్రపటానికి శుక్రవారం పూలమాల వేసి టీడీపీ బీసీసెల్ రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల నారాయణస్వామి నివాళలర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కొర్రపాటి వసంతరాయుడు, చాగంరెడ్డి నరసారెడ్డి, నాయకులు దేపూరి సుబ్బారావు, షేక్ ఖాతంషా, తదితరులు పాల్గొన్నారు.

కనీస మద్దతు ధర ఇవ్వాలి

కొండపి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): పొగాకు రైతులకు కనీస మద్దతు ధర ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని కాంగ్రెస్ పార్టీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీపతి సతీష్ డిమాండ్ చేశారు. ఆ మేరకు కొండపి నియోజకవర్గ ఈఆర్వో కుమార్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వామపక్ష పార్టీల నాయకులు కేజీ మస్తాన్, సీపీఐఎంఎల్ నాయకుడు వై.చంద్రశేఖర్, సీపీఐ మండల కార్యదర్శి ఆర్.లక్ష్మి, కాంగ్రెస్‌పార్టీ మండల నాయకుడు గుంటుపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

15, 16వ తేదీల్లో కంప్యూటర్ ఆధారిత పరీక్ష

సంతనూతలపాడు, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): మైనంపాడు డైట్ కళాశాలలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలకు కంప్యూటర్ ఆధారిత పరీక్ష ఈనెల15, 16 తేదీల్లో జరుగుతుందని ప్రిన్సిపాల్ సామా సుబ్బారావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు దారులకు ఈ పరీక్ష నిర్వహించిన ఎంపిక చేస్తారని, ప్రభుత్వం ఇచ్చిన ట్యాబ్ నెంబరు, సీఎఫ్‌ఎంఎస్ నెంబర్లను 9866717186 సెల్‌నెంబరుకు వాట్సాప్ చేయాలన్నారు. గూగుల్‌షీట్ ప్రధానోపాధ్యాయులు, ఎంఈవోల గ్రూపుల్లో ఉందని, దీనిని పూర్తి చేయాలని కోరారు.

క్రీడలతో మానసికోల్లాసం

నాగులుప్పలపాడు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసికోల్లాసం లభిస్తుందని మాజీ ఎంపీపీ ముప్పవరపు వీరయ్యచౌదరి పేర్కొన్నారు. పోతవరంలో అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలను గురువారం రాత్రి ఆయన ప్రారంభించారు. మనోజ్‌కుమార్, శరత్‌బాబు పాల్గొన్నారు.

రీసర్వేపై అభ్యంతరాలు తెలపాలి

సంతనూతలపాడు, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): రీసర్వేపై అభ్యంతరాలు తెలపాలని తహసీల్దార్ వి.ఆదిలక్ష్మి తెలిపారు. శుక్రవారం ఎం.వేములపాడులో ఆమె మాట్లాడారు. పొలాల రీసర్వే పూర్తయిందని, అభ్యంతరాలు తెలపాలని కోరారు.

రిమ్స్‌లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలి

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని రిమ్స్ ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న డాక్టర్ పోస్టులను భర్తీచేసేలా చర్యలు తీసుకోవాలని మాదిగ సంక్షేమ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము సుజన్‌మాదిగ కోరారు. శుక్రవారం నగరానికి వచ్చిన వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌కు ఈమేరకు వినతిపత్రం అందజేశారు. రిమ్స్ ఆస్పత్రిలో క్యాన్సర్ విభాగం, ఊపిరితిత్తుల విభాగాలకు చెందిన డాక్టర్ల కొరత ఉందని, త్వరగా ఆయా పోస్టుల భర్తీ చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆస్పత్రిలో మౌలిక స దుపాయాలు కల్పించాలని మంత్రిని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో త్యాగరాజు, కె.విజయకుమార్, తేళ్ల జయరాజ్, గంగవరపు శేఖర్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

పూలే జయంతికి పిలిచి అవమానించడం దారుణం

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, ప్రజాసంఘాల నాయకులను మహాత్మాజ్యోతిరావు పూలే జయంతి కార్యక్రమానికి ఆహ్వానించి అవమానించడం బీసీ వెల్ఫేర్ శాఖకు తగదని 139 బీసీ కులాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ మిరియం శ్రీనివాసులు ఒక ప్రకటనలో ఖండించారు. ఒంగోలులోని కొత్తకూరగాయాల మార్కెట్ వద్ద ఉన్న పూలే విగ్రహం వద్ద జరిగిన కార్యక్రమానికి పిలిచి కనీస నిబంధనలు కూడా పాటించకపోవడం బాధకరమన్నాను. రాజకీయ పార్టీ నాయకులకు ప్రోటోకాల్ ప్రకారం ప్రాధాన్యత ఇస్తూ ప్రజాసంఘాల నాయకులను కూడా గౌరవించాల్సిన బాధ్యత ఉన్నా పట్టించుకొని పరిస్థితి ఏర్పడిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

పేస్‌లో స్కిల్ కోర్సులో శిక్షణ


ట్రైనర్స్‌ను సత్కరిస్తున్న శ్రీధర్

ఒంగోలు విద్య, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విభాగం ఆధ్వర్యంలో స్కిల్ కోర్సులో శిక్షణ కార్యక్రమం జరుగుతోంది. ఈ సందర్భంగా నస్సెస్ సెమికండక్టర్ అండ్ ఇట్స్ సొల్యూషన్ సీఈవో సుధీర్‌రెడ్డి, ఎస్.సాయిభాను, ఎస్.మోహన్, రమణ ట్రైనర్స్‌గా వ్యవహరించారు. కళాశాల సెక్రటరీ డాక్టర్ మద్దిశెట్టి శ్రీధర్ మాట్లాడుతూ వీఎల్‌ఎస్‌ఐ డిజైన్ వెరిఫికేషన్ ద్వారా కెరీర్ వృద్ధికి, మెరుగైన ఉత్పత్తి, పనితీరు పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జీవీకే.మూర్తి, డీన్ ఆర్.వీరాంజనేయులు, సీవీ.సుబ్బారావు, ఈసీఈ విభాగాధిపతి ఎం.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ

ఒంగోలు కల్చరల్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణ సేవా సంక్షేమ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలో మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. స్థానిక లాయర్‌పేట చిట్టి ఆంజనేయస్వామి దేవస్థానం వద్ద ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని దేవస్థాన ప్రధాన అర్చకులు అళఘరి శ్రీనివాసాచార్యులు ప్రారంభించారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు రామరాజు మల్లిఖార్జునరావు, సభ్యులు డాక్టర్ లంకా ప్రసన్నకుమార్, దూపాటి రఘురామ్, శివదేవుని మురళీధర్, చిలకపాటి రామారావు, పి.నరసింహారావు, కేడీవీ.ప్రసాద్, రాంబాబు, కూరపాటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళాకు విశేష స్పందన

ఒంగోలు విద్య, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని దామచర్ల సక్కుబాయమ్మ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం డీఎస్‌జీడీసీ, ఏపీఎస్‌ఎస్‌డీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. ఎనిమిది కళాశాలల నుంచి 300 మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల నుంచి 129 మంది విద్యార్థులు పాల్గొనగా 119 మంది ఉద్యోగాలు సాధించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డి.కళ్యాణి వారిని అభినందించారు. కార్యక్రమంలో ఎంప్లాయిమెంట్ అధికారి భరద్వాజ్, డీఎస్‌డీవో జె.రవితేజ, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ బాషా పాల్గొన్నారు.

క్విస్‌లో ముగిసిన డ్రోన్ వర్క్‌షాపు


శిక్షణకు హాజరైన విద్యార్థులతో నిర్వాహకులు

ఒంగోలు విద్య, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్ఐటీ రుర్కెలా నిర్వహించిన ఐదు రోజుల బూట్ క్యాంప్ (డ్రోన్) శుక్రవారంతో ముగిసింది. మినిస్ట్రీ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సౌజన్యంతో నిర్వహించిన డ్రోన్ టెక్నాలజీ వర్క్‌షాపులో 120 మంది విద్యార్థులు పాల్గొని వివిధ అంశాలను తెలుసుకున్నారు. డీపీఐఆర్ డైరెక్టర్ బీవీ.సుబ్బారావు క్విస్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ నిడమానూరి సూర్యకళ్యాణ్‌చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ చైర్మన్ డాక్టర్ గాయత్రిలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హనుమంతరావు, ఎన్ఐటీ రుర్కెలా ప్రొఫెసర్ బాలాజీ, డీపీఎస్ఆర్ డిప్యూటీ డైరెక్టర్ భార్గవ్ పాల్గొన్నారు.

121 మంది రక్తదానం : స్థానిక క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. రిమ్స్ బ్లడ్ బ్యాంక్, క్విస్ ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ ఆధ్వర్యంలో 121 మంది విద్యార్థులు, అధ్యాపకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ నవనీత్ కృష్ణన్, డీన్ వాసుబాబు, డాక్టర్ మానసేశ్, సుధ, మోహన్‌రెడ్డి, సుధీర్‌బాబు, సుమన్ పాల్గొన్నారు.

గుడిమెళ్లపాడు అర్బన్ హెల్త్ సెంటర్ పరిశీలన


రికార్డులను పరిశీలిస్తున్న బృందసభ్యులు

ఒంగోలు(రూరల్), ఏప్రిల్11(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం త్రోవగుంట గ్రామం దగ్గర గల గుడిమెళ్లపాడు అర్బన్ హెల్త్ సెంటర్‌ను శుక్రవారం కేంద్ర ప్రభుత్వ వైద్యుల బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా డాక్టర్ ఎస్.పంకజ, డాక్టర్ సి.షీలా ఆసుపత్రి భవనం, లోపల గదులను, రోగులకు కల్పించిన వసతులను పరిశీలించారు. ఓపీ ఇతర రికార్డులను తనిఖీ చేశారు. వైద్యశాలలో లభించే వైద్యసేవల వివరాలు సేకరించారు. తమ పరిశీలన అంశాలను కేంద్ర వైద్యశాఖకు పంపుతామని, వాటి ఆధారంగా ఈ వైద్యశాలకు క్వాలిటీ అస్యూరెన్స్ సర్టిఫికెట్ లభిస్తుందని, దీనివల్ల కేంద్రం నుంచి అదనపు నిధులు వస్తాయని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ సమీర్‌శర్మ, జిల్లా క్వాలిటీశాఖ అధికారి డాక్టర్ కృష్ణప్రసాద్, వైద్యులు ఖాసిం, హనాకీర్తన సిబ్బంది పాల్గొన్నారు

జీజీహెచ్ వైద్యులకు మంత్రుల అభినందన


పేషెంట్లను పరిశీలిస్తున్న మంత్రి సత్యకుమార్

ఒంగోలు కార్పొరేషన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని జీజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ నామినేని కిరణ్, అంకాలజీ విభాగం డాక్టర్ కిషన్‌లను వైద్యఆరోగ్యశాఖమంత్రి సత్యకుమార్‌యాదవ్ ప్రత్యేకంగా అభినందించారు. శుక్రవారం స్థానిక జీజీహెచ్‌లో క్యాథ్ లాబ్‌ను ప్రారంభించి పలు వార్డులను తనిఖీ చేశారు. ఇటీవల ఓ పేషెంట్ ప్రమాదానికి గురై మొహం తీవ్రంగా గాయపడటంతో ఫేషియల్లో సర్జరీ చేసి పూర్వస్థితికి తీసుకువచ్చిన డాక్టర్ కిరణ్‌కుమార్‌ను మంత్రి అభినందించారు. అలాగే క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ వైద్యం పొందుతున్న మరో రోగికి విజయవతంగా శస్త్ర చికిత్స చేసిన డాక్టర్ కిషన్‌ను అభినందించారు.

పేదలకు పట్టాలు ఇవ్వాలి : సీపీఎం

కొత్తపట్నం, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): మండలంలో పేదలు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు ఇవ్వాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం కొత్తపట్నం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ ఈతముక్కల పేదలు 40సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్న భూములకు అధికారులు ఇంతవరకు పట్టాలు ఇవ్వలేదన్నారు. కొత్తపట్నంలో ఆటో కార్మికులకు స్టాండ్ ఏర్పాటు చేయాలని కోరారు. మండల కార్యదర్శి ఎస్.స్వామిరెడ్డి మాట్లాడుతూ ఉప్పు కొటార్లు సాగు చేసుకుంటున్న భూములను ఆన్‌లైన్‌లో ఎక్కించాలని కోరారు. కార్యక్రమంలో పి.ప్రకాష్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

అవి.. ఇవి

జనసేన నాయకుడిపై దాడి

కంభం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): అర్ధవీడు మండల జనసేన నాయకుడు కాల్వ బాలరంగయ్యపై ప్రస్తుతం అదే పార్టీలో ఉన్న పగడాల పాండు, ఆయన వర్గం దాడి చేసింది. ఈ ఘటన అర్ధవీడు మండలం కాకర్లలో చోటుచేసుకొంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం 12, 13, 14 తేదీలలో కాకర్లలో తిరునాళ్ల జరగనుంది. సందర్భంగా కార్యక్రమాల ఏర్పాటు కోసం జనసేన కేడర్ నుంచి పాండు చందాలు వసూలు చేస్తున్నారు. అయితే పాండు ఇటీవలే వైసీపీ నుంచి జనసేనకు వచ్చారు. ఇటీవల జనసేనకు వచ్చి పార్టీ కేండర్ నుంచి చందాలు వసూలు చేయడంపై బాలరంగయ్య అభ్యంతరం తెలిపారు. దీంతో మాటమాట పెరిగింది. ఈ నేపథ్యంలోనే బాలరంగయ్యపై పాండు, ఆయన వర్గం దాడి చేసి గాయపరిచింది. బాలరంగయ్య కూడా ఇటీవలే వైసీపీ నుంచి జనసేనకు వచ్చారు. గాయపడిన బాలరంగయ్యను 108 వాహనంలో ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. దాడి చేసిన ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సుదర్శన్ తెలిపారు.

ఓటర్ కార్డుకు ఆధార్‌లింకు తప్పనిసరి

ఎర్రగొండపాలెం ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఓటరు గుర్తింపు కార్డు కలిగిన ప్రతి ఒక్కరూ తమ కార్డుకు ఆధార్ లింక్ తప్పనిసరిగా చేసకోవాలని ఎన్నికల రిటనింగ్ అధికారి ఎంవీ.సత్యనారాయణ అన్నారు. శుక్రవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులతో, రెవెన్యూ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు కార్డు కలిగిన వారిలో ఆధార్ లింక్, తప్పులు, డెత్‌లను ఆధికారులు గుర్తించి వాటిని సరిచేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎన్నికల డిప్యూటీ తహసీల్దారు ఎస్ చంద్రశేఖర రావు, ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ ప్రసాద్ వివిధ రాజకీయ పక్షాల నేతలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గిద్దలూరు టౌన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): సంజీవరాయునిపేట 33 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా నేడు పలు ప్రాంతాలలో ఉద యం 7 నుండి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈఈ బి.శేషగిరిరావు ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం సంజీవ రాయునిపేట, ఉయ్యాలవాడ సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి నిధుల మంజూరు

- పట్టణానికి శాశ్వత నీటి సమస్య పరిష్కారానికి 153 కోట్లు మంజూరు
- ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి వెల్లడి
- సంబంధిత అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష

గిద్దలూరుటౌన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): పట్ట ణంలో శాశ్వతంగా నీటి సమస్య పరష్కరించేందుకు ప్రభుత్వం రూ.153.24 కోట్లు మంజూరు చేసిందని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి తెలిపారు. ఇటీవల ప్రభుత్వం ఇందుకు సంబంధించి జీవోను విడుదల చేసిందన్నారు. ఏఐబీ ప్రాజెక్టు ద్వారా ఈపథకాన్ని రూపకల్పన చేస్తున్నట్లు, ఇందుకు సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. శుక్రవారం ఇందుకు సంబంధించి జిల్లా పబ్లిక్ హెల్త్ డిపార్ట్‌మెంట్ ఎస్ఈ మోహన్, ఈఈ సంజయ్, డీఈ ఆదామ్‌షఫి, మున్సిపల్ కమిషనర్ ఐ.శ్రీనివాసులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో పట్టణానికి నీటి అవసరాల గురించి, వాటి లభ్యత, నీటి సరఫరాను చేయడానికి అవసరమైన రూటుమ్యాప్‌పై అధికారులతో చర్చించారు. ఈ ప్రాజెక్టు వలన పట్టణ ప్రజల కు శాశ్వతంగా నీటి సమస్య ఉండదని, నిరంతరం పట్టణ ప్రజలకు నీరు అందించేందుకు ఉపయోగ పడుతుందన్నారు.


ఎడ్ల పోటీలను ప్రారంభిస్తున్న అశోక్‌రెడ్డి

బండలాగుడు పోటీలు ప్రారంభం

గిద్దలూరుటౌన్ : శ్రీరామనవమి సందర్భంగా మండలంలోని ముండ్లపాడు రోడ్డులోని అభయాంజ నేయస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎడ్ల బలప్రదర్శన పోటీలను ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు కృష్ణకిషోర్‌రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షులు మార్తాల సుబ్బారెడ్డి, టీడీపీ నాయ కులు అంబవరం శ్రీనివాసరెడ్డి, నంది శ్రీను పాల్గొన్నారు.

ప్రజల దాహార్తి తీర్చేందుకే చలివేంద్రాలు

గిద్దలూరుటౌన్ : వేసవిలో పాదాచారులు, ప్రజలు తాగునీటి ఇబ్బందులను తొలగిం చేందుకే చలివేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎమ్మె ల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నగర పంచాయతీ ఆధ్వర్యంలో పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయం, కుమ్మరాంకట్ట, రైల్వేస్టేషన్, ఆర్టీసి బస్టాండ్ల సమీపంలో చలివేంద్రాలను ఏర్పాటు చేయగా వాటిని ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి రిబ్బన్‌కట్ చేసి ప్రారంభించారు. రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతుం డడంతో వాహనదారులు, పాదాచారులు నీటికి ఇబ్బంది పడకూడదనే ఉద్దేశ్యంతో చలివేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలి పారు. వేసవిలో ప్రజలు తాగునీరు ఎక్కువగా తాగాలని, చలివేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పాముల వెంకటసుబ్బయ్య, కమీషనర్ ఐ.శ్రీనివా సులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.


అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

కల్తీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

వ్యవసాయశాఖ కమిషనరేట్ అధికారి భాస్కర్

పొదిలి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని విత్తన దుకాణాలను గుంటూరు వ్యవసాయ కమీషనరేట్ అధికారి కె భాస్కర్ శుక్రవారం తనిఖీ చేశారు. దర్శి ఏడీఏ బా లాజీనాయక్ అధ్వర్యంలో విత్తన దుకాణా లను పరిశీలించారు. భవానీ ఫర్టిలైజర్స్ వీరాంజనేయ ఫర్టిలైజర్స్ దుకాణాల్లో పత్తి విత్తనాలు 11 శాంపిల్స్‌ను తీసి పరీక్షలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విత్తన డీలర్లు అందరు చట్టానికిలోబడి వ్యాపారం చేయాలన్నారు. కాదని నకిలీ విత్తనాలు అమ్మినట్లు తేలితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామ న్నారు. రైతు విత్త నాలు, మందులు, ఎరువులు కొనుగోలు చేస్తే తప్పకుండా బిల్లు ఇవ్వాల న్నారు. నాణ్యమైన విత్తనాలనే విక్రయించాలని చెప్పారు. గత ఏడాది అమ్మకాల రికార్డులను పరిశీలించారు. ఎప్పటికప్పుడు స్టాకు రిజిస్టర్‌లో స్టాకును సరిచూసుకోవాలని సూచించారు. అనంతరం ట్రాన్స్‌పోర్ట్‌ల్లో నకిలీ విత్తనాలు వస్తున్నాయని విజయజానకి ట్రాన్స్ ఫోర్ట్‌ను తనిఖీ చేశారు. ట్రాన్స్‌పోర్ట్‌లో ఏమైనా విత్తనాలు వస్తే వెంటనే సంబంధిత వ్యవ సాయాధికారికి సమాచారం ఇవ్వాలని ట్రాన్స్‌పోర్ట్ యజ మానికి సూచించారు. ఈ తనిఖీల్లో గుంటూరు ఏడీఏ మోహన్‌రావ్, జిల్లా వ్యవసాయ కార్యాలయం నుండి వీవీ రమేష్, మండల వ్యవసాయా ధికారి షేక్ జైన్‌లాబ్దీన్ పాల్గొన్నారు.


పత్తి విత్తనాలను పరిశీలిస్తున్న ఏవో

మోటార్‌సైకిళ్ల దొంగ అరెస్ట్

ఏడు మోటార్‌బైకులు స్వాధీనం

పొదిలి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : వివిధ కంపెనీలకు చెందిన మోటార్ వాహనాలను దొంగిలించిన వ్యక్తిని పొదిలి పోలీసులు శుక్రవారం పొగాకుబోర్డ్ వద్ద అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గుడిపాటి మణికంఠ అనే వ్యక్తి నూడిల్స్ పాయింట్, రెస్టారెంట్లలో వంట మాస్టర్‌గా పని చేసేవాడన్నారు. నింధితుడికి గంజాయి, తాగుడు వంటి వ్యసనాలు ఉన్నా యన్నారు. అంతేకాకుండా స్నేహితులతో కలిసి జులాయిగా తిరిగేవాడని వచ్చిన డబ్బులు జల్సాలకు సరిపోకపోవడంతో దొంగతనాలకు అలవాటుపడ్డాడన్నారు. ఈక్రమంలో ఎవరులేని సమయంలో ఇళ్ల ముందు నిలిపి ఉన్న మోటార్‌బైకుల లక్ష్యంగా చేసుకొని దొగిలించడం వాటిని అమ్ముకొని జల్సాలు చేసేవాడన్నారు. మణికంఠ దొంగిలించిన మోటార్‌బైకులు ఏపి27 బిక్యూ 5093, డీలక్స్, ఏపి27 ఏక్యూ 9333 హోండాషైన్, ఏపి27 ఏకె 3658 హోండాషైన్, ఏపి39 ఎల్‌బి 2680 హోండాయాక్టీవా, ఏపి27 జి 5689 హోండాస్ప్లెండర్, ఏపి27 ఏజడ్ హోండాషైన్, పాసన్‌ప్రో బ్లూరంగుగల మరో వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ వేమన తెలిపారు. వాటి విలువ సుమారుగా 4 లక్షల 30 వేల ఉంటుందని ఆయన చెప్పారు. మణికంఠపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఆయన తెలిపారు.

విద్యుత్‌శాఖ అధికారుల విస్తృత దాడులు

- 19 గ్రామాల్లో 3150 సర్వీసులు పరిశీలన
- 65 చోట్ల అక్రమ వినియోగం
- రూ.1,48,000 జరిమానా

పెద్దదోర్నాల, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): మండలంలో విద్యుత్‌శాఖ అధికారులు శుక్రవారం విస్తృత దాడులు నిర్వహించారు. మార్కాపురం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పీవీ నాగేశ్వరరావు, ఒంగోలు డీపీఈ హైమావతి ఆధ్వర్యంలో విద్యుత్తు శాఖ సిబ్బంది 36 బృందాలుగా ఏర్పడి 19 గ్రామాలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహిం చారు. ఈ క్రమంలో 3150 సర్వీసులు పరిశీలించగా 65 మంది అక్రమంగా విద్యుత్తును వినియోగిస్తున్నట్లు గుర్తించారు. రూ.1,48,000లు జరిమానా విధిం చినట్లు ఈఈ పీవీ నాగేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో డీఈ ఎస్ సియానాయక్, కంభం,గిద్దలూరు, ఎర్రగొండపాలెం అధికారులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ కోసం ర్యాలీ

కంభం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యాశాఖ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్‌లో భాగంగా వాసవి విద్యాసంస్థలు కంభం పట్టణం నందు డ్రగ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. విద్యాసంస్థల అధినేత గోళ్ల సుబ్బరత్నం మాట్లాడుతూ వివిధ రకాల మాదక ద్రవ్యాల వినియోగం, యువత బంగారు భవిష్యత్తు నాశనం చేస్తున్నదని తెలిపారు. విద్యార్థులు, యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. విద్యార్థులు ర్యాలీలో పాల్గొని 'డ్రగ్స్ యూజర్స్ లైఫ్ లూజర్స్' అని నినాదాలు చేశారు. కార్యక్రమంలో వాసవీ డిగ్రీ, ఇంటర్, బీఈడీ, ఫార్మసీ, ఎంబీఏ అధ్యాపకులు సిబ్బంది పాల్గొన్నారు.

వక్ఫ్‌చట్టం వెనక్కు తీసుకోవాలి

కంభం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): కంభం పంచాయతీలోని అర్బన్ కాలనీలో మూడు మసీదుల ఆధ్వర్యంలో పలువురు ముస్లింలు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్‌చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మతాల పేరుతో ముస్లిం సమాజాన్ని అనగదొక్కాలని కేంద్ర ప్రభుత్వం చూస్తోందన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు షేక్ అన్వర్, ఎంపీజే పట్టణ కార్యదర్శి నాయబ్‌రసూల్, కరీముల్లా, హుస్సేన్, ముజీద్ తదితరులు పాల్గొన్నారు.

కాటంరాజు ఆలయ అభివృద్ధికి నిరంతర కృషి

పెద్దారవీడు, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): వేనూతల కాటంరాజు గంగాభవానీల ఆలయ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని ఆలయ నూతన అధ్యక్షుడు గుమ్మా గంగరాజు అన్నారు. మండలంలోని దేవరాజుగట్టులో శుక్రవారం నూతన చైర్మన్‌గా ఎన్నికైన గుమ్మా గంగరాజు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గంగరాజు మాట్లాడుతూ టీడీపీ నాయకులు గూడూరి ఎరిక్షన్‌బాబు, నూకసాని బాలాజీ, కొలుసు పార్థసారధి, బీదా రవిచంద్ర, జంగా కృష్ణమూర్తి, యాదవ సంఘ ప్రజాప్రతినిధుల సహకారంతో దేవాలయంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు లేకుండా ఏర్పాట్లు చేస్తామన్నారు. అనంతరం గంగరాజును యాదవ సంఘం, టీడీపీ నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మెట్టు శ్రీనివాసులరెడ్డి, బీసీ సంఘం నాయకుడు పీఎల్‌పీ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

రేపు డయల్ యువర్ డీఎం

గిద్దలూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసి ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు వీలుగా డయల్ యువర్ డిఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ బి.చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 13వ తేది ఉదయం 11 నుంచి 12 గంటల వరకు 9959225702 నెంబరుకు ఫోన్ చేసి సలహాలు, సూచనలు, సమస్యలు తెలియచేయవచ్చని పేర్కొన్నారు.

చెన్నయ్య కల్యాణానికి తలంబ్రాలు సిద్ధం

మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 11 ఆంధ్రజ్యోతి: మార్కాపురంలో వెలసియున్న శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయ మధ్యరంగ మండపంలో మహిళా భక్త బృందాల ఆధ్వర్యంలో స్వామి కళ్యాణానికి తలంబ్రాలు, ముత్యాల తలంబ్రాలు సిద్ధం చేశారు. భక్త బృందాల భజనలు, కీర్తనల మధ్య తలంబ్రాలు సిద్ధం చేసే కార్యక్రమం నిర్వహించారు. ప్రధానార్చకులు శ్రీపతి అప్పనాచార్యుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి


ధర్నా నిర్వహిస్తున్న ఎన్ఎంయూ నాయకులు

మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యం లో స్థానిక ఆర్టీసీ డిపో వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎంయూ నాయకులు బీఎన్ రెడ్డి మాట్లాడుతూ.. అన్ని కేటగిరిలలో ప్రమోషన్‌లు ఇవ్వాలని, రిటైర్డ్ ఉద్యోగులకు బకా యిలు ఇవ్వాలని, 1-2019 సర్క్యులర్‌ను అమలు పర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎంయూ డిపో కార్యదర్శి కె.కాశయ్య, అధ్యక్షులు సీహెచ్ శ్రీనివాసులు, గౌరవ అధ్యక్షులు రామిరెడ్డి, సలీం, రవి, పీవీఎస్ రావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు

పెద్దారవీడు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఆధునిక సాంకేతికను అందిపుచ్చుకోవాలని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్, మాజీఎమ్మెల్యే అన్నా రాంబాబు అన్నారు. మండలంలోని దేవరాజు గట్టులోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం ఈసీఈ చివరి సంవత్సరం విద్యార్థుల వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న అన్నా రాంబాబు మాట్లాడుతూ విద్యను అభ్య సించడం అనేది నిరంతరం జరుగుతూనే ఉంటుందన్నారు. తల్లి దండ్రుల ఆశయాలకు అనుగుణంగా, తాము ఎంచుకున్న లక్ష్య సాధనకు నిరంతరం కృషి చేయాలన్నారు. కార్యదర్శి కృష్ణ చైతన్య మాట్లాడుతూ కిట్స్ విద్యార్థులు ఉన్నత స్థితికి చేరాలని ఆకాంక్షిం చారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కృష్టారెడ్డి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

బంగారు బాల్యంపై అవగాహన

ఎర్రగొండపాలెం రూరల్ ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): బంగారు బాల్యం కార్యక్రమంపై ప్రతిగ్రామంలో ప్రజలకు ముఖ్యంగా ఆడపిల్ల లకు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించే బాధ్యత మన అందరిపై ఉందని ఎర్రగొండ పాలెం ఎంపీడీవో బండారు శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యా లయంలో ఐసీడీఎస్, వెలుగు, విద్య, పోలీస్ తదితర శాఖల అధికారులతో సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ 0-6 సంవత్సరాల లోపు చిన్నారులకు ఆదార్‌లింక్, పౌష్టికాహార లోపం, బాల్య వివాహా లు, బడిబయట ఉన్న చిన్నారులను గుర్తించడం, ఐరన్ లోపం వారిని గుర్తించడం, గిరిజనులకు అందిచాల్సిన పథకాలు, బాలల రక్షణ, సంరక్షణ, భద్రత చట్టాలతో పలు అంశాలపై తీర్మానించారు. కార్యక్రమంలో ఎంఈవో పి అంజనేయులు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు ఏ. పద్మజ, సుజాత, కెవి సుబ్బమ్మ, వైద్యులు కోటా నాయక్, వెలుగు ఆధికారులు పాల్గొన్నారు.

బీసీ హాస్టల్‌లో పౌష్టికాహార పక్షోత్సవం

పట్టణంలోని బీసీ హాస్టల్లో శుక్రవారం ఐసీ డీఎస్ పద్మావతి ఆధ్వర్యంలో పౌష్టికాహార పక్షోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పౌష్టికాహారం లోపంతో వచ్చే నష్టాలు, రోగాల గురించి వివరించారు. అలాగే అవి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. పౌష్టికాహారం నిండుగా ఉండే ఆహారం తీసుకోవాలని అన్నారు. కార్యక్రమా లలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.



తనిఖీలు చేస్తున్న మోటారు వెహికిల్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, ఆర్టీసీ అధికారి ధనలక్ష్మి

దర్శిలో వాహనాల తనిఖీలు

దర్శి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాలను నియంత్రించే కార్యక్ర మంలో భాగంగా ఆర్టీసీ, మోటారు వెహికిల్ అధికారులు శుక్రవారం దర్శిలో తనిఖీలు నిర్వహించారు. దర్శి మోటారు వాహనాల తనిఖీ అధికారి రవికు మార్, ఆర్టీసీ అధికారి ధనలక్ష్మి ఓవర్‌లోడ్‌తో వెళ్తున్న ఆటోలను, మినీ లారీ లను తనిఖీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న వాహనాలకు రూ.30 వేలు జరిమానా విధించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఆటోలలో, ఇతర వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ట్రాఫిక్ నిబంధనలు తప్ప కుండా పాటించాలన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలు తగ్గుముఖం

ముండ్లమూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): సీసీ కెమెరాలు ఏర్పాటుతో నేరాలు తగ్గుముఖం పడతాయని ఎస్‌ఐ కె.కమలాకర్ అన్నారు. ప్రజలంద రూ ప్రశాంతంగా జీవించాలన్నదే పోలీసుల లక్ష్యమని చెప్పారు. గురువారం రాత్రి మండలంలోని పెదరావిపాడులో జరిగిన పల్లె నిద్ర కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రామంలో ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీ సుకురావాలన్నారు. చిన్నచిన్న విషయాలకు గొడవలు పడి గ్రామాల్లో ప్రశాంతతకు భంగం కలిగించ వద్దన్నారు. గ్రామాల్లో కొత్త వ్యక్తులు సంచరి స్తుంటే వెంటనే తమ దృష్టికి తీసుకు రావాలన్నారు. చిన్న పిల్లలకు వాహనా లు ఇచ్చి ప్రమాదాలు కొని తెచ్చుకోవద్దన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ వెంకటేశ్వరరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి గ్రామ పంచాయతీలో ఉపాధి పనులు చేపట్టాలి

ముండ్లమూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రతి గ్రామ పంచాయతీలో ఉపాధి హామీ పథకం ద్వారా జాబ్ కార్డు ఉన్న ప్రతిఒక్కరికి పని కల్పించాలని ఏపీడీ ఆర్.లలితకుమారి అన్నారు. శుక్రవారం స్థానిక ఉ పాధి కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రానున్న మూడు నెలలు కాలాన్ని దృష్టిలో పెట్టుకొని పనులు కల్పించాలన్నారు. ప్ర స్తుతం మండలంలో 12,500 జాబ్ కార్డులు ఉన్నాయన్నారు. కనీసం ఆరు వేల మందికి తగ్గకుండా పని కల్పించాల్సిన బాధ్యత ఉందన్నారు. జాబ్ కార్డు వారిస్థానంలో ఇతరులు పనికివస్తే చర్యలు తప్పవన్నారు. ప్రధానంగా ఇటీవల గ్రామ సభల్లో ఆమోదించిన పనులు మాత్రమే చేపట్టాలన్నారు. సమావేశంలో ఏపీవో నాగరాజు, టెక్నికల్ అసిస్టెంట్‌లు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను పేదలకు పంపిణీచేయాలి

హనుమంతునిపాడు (కనిగిరి), ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములను గుర్తించి పేదలకు పంపిణీచేయాలని వ్యవసాయకార్మిక సంఘం నాయకుడు బడుగు వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం హనుమంతునిపాడులోని తహసీల్దార్ కార్యాలయం వద్ద మిట్టపాలెం గ్రామస్థులు ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మిట్టపాలెం రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమయ్యాయన్నారు. వాటిని స్వాధీనం చేసుకుని భూమిలేని పేద కుటుంబాలను పంపిణీచేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు.

ఆక్రమణల్లో డ్రైనేజీలు

» ముందుకుకదలని మురుగునీరు
» ఇబ్బందులు పడుతున్న ప్రజలు
» పట్టించుకోని అధికారులు

పామూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): పామూరు పట్టణంలో డ్రైనేజీలు ఆక్రమణలతో కుంచించుకు పోతున్నాయి. మురుగు కాల్వల్లో చెత్తాచెదారాన్ని తొలగించేందుకు పారిశుధ్య సిబ్బందికి వీలుండటంలేదు. దీంతో మురుగునీరు ఎక్కడికక్కడ నిలిచిపోయి దుర్వాసన వెదజల్లుతుంది. దోమలకు ఆవాలసుగా మారాయి. నెల్లూరు రోడ్డులో చెరువు సప్లయ్ చానల్ ఆక్రమణలతో మురుగు కాలువగా రూపాంతరం చెందింది. ఈప్రాంతం వ్యాపార కేంద్రంగా అభివృద్ధి చెందింది. దీంతో వ్యాపార సముదాలయాల ముందు ఇష్టం వచ్చిన తీరుతో సిమెంటు పైపులు, మరికొందరు రాళ్లతో కట్టుబడి చేసుకొన్నారు. దీంతో సక్రమంగా కాలువ లేకపోవడంతో ఇళ్లలోని వాడుక నీరు, వర్షం నీరు సక్రమంగా ప్రవహించడంలేదు. దాంతో కొన్నిచోట్ల మురుగునీరు నిలబడి దుర్గంధం వెదజల్లుతుంది. భవన యజమానులు డ్రైనేజీలను కూడా ఆక్రమించి కట్టడాలు నిర్మిస్తున్నారు. దీంతో మురుగు కాలువ కొన్ని చోట్ల కనీసం రెండు అడుగులకు కుంచించుకుపోయింది. నెల్లూరు రోడ్డులోని విరాట్ నగర్ వద్ద నుంచి ప్రారంభమైన కాలువ సిండికేట్ బ్యాంకు వద్ద నుంచి పామూరు కొత్త చెరువులోకి కలుస్తున్నది. కాలువలు సక్రమంగా లేకపోవడంతో చిన్నపాటి వర్షం కురిసినా నీరంతా రోడ్డుపైకి ప్రవహిస్తుండటంతో స్థానికులు, వాహనదారులు అసౌకర్యానికి గురవుతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ పాలకులు స్పందించి క్షేత్రస్థాయిలో కాలువలపై ఉన్న ఆక్రమణలు తొలగించి అసౌకర్యాన్ని తొలగించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



నెల్లూరు రోడ్డులో ముందుకు కదలని మురుగునీరు



ఇళ్ల మధ్య ఖాళీ స్థలంలో పేరుకుపోయిన మురుగునీరు

బడుగుల ఆశాజ్యోతి పూలే

» ఆయన సేవలు చిరస్మరణీయం
» మున్సిపల్ చైర్మన్ గఫార్

కనిగిరి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): బలహీనవర్గాలను బడిబాట పట్టించి వారి కుటుంబాల్లో విద్యాకాంతులు నింపిన మహనీయుడు మహాత్మా జ్యోతిబా పూలే అని మున్సిపల్ చైర్మన్ గఫార్ అన్నారు. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహం వద్ద పూలే విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ సామాజిక రుగ్మతలను రూపుమాపి సామాజిక మార్పులు తెచ్చిన మహావ్యక్తి మహాత్మా పూలే అని అన్నారు. అలాంటి మహనీయుల ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ నడుచుకోవలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తమ్మినేని శ్రీనివాసులురెడ్డి, ఫిరోజ్, సిద్దాంతి బారాయిమాం, తిరుపాలు, లక్ష్మయ్య, నజిముద్దీన్, బీసీ సంఘ నాయకులు దేపూరి వెంకటేశ్వర్లు, డి.శివకాశయ్య, దేవర వెంకటేశ్వర్లు, పల్లా మాలకొండరావు, డాక్టర్ పెరుగు మురళీ, పచ్చవ చంద్రశేఖర్, రావినూతల కొండయ్య, దద్దాల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

దర్శిలో.. దర్శి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పువీరాయపాలెం హైస్కూల్‌లో శుక్రవారం జ్యోతి రావుపూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బహుజన ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఇట్లా వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో చిన్నారులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేద విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బహుజన సంఘాల నాయకులు కరుణానిధి, కోటేశ్వర రావు, ప్రధానోపాధ్యాయుడు వి.రవిబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

తాళ్లూరులో.. తాళ్లూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): కులాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలందరూ విద్య నేర్చుకోవాలన్న ఉద్దేశ్యంతో ఉచితంగా బడులు నిర్మించి విద్యను అందించిన జ్యోతిరావు పూలే గొప్ప సంఘసంస్కర్తగా ఖ్యాతి గడించారని ఎంఈవో జి.సుబ్బయ్య అన్నారు. శుక్రవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయం వద్ద పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసం దర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఇంటికే పరిమితం కాకుండా అన్ని రంగాల్లో ముందుండాలని మహిళాభివృద్ధి కృషిచేసిన పూలే అందరి హృదయాల్లో స్థిర స్థాయిగా నిలిచారన్నారు. ముందుగా పూలే చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎం ఈవో-2 ఎల్.సుధాకరరావు, ఉపాధ్యాయులు బి.కళ్యాణ్‌రావు, బి.వేణు, జె.నాగరాజు, నరసయ్య, పి.వేణుబాబు, ఎం.చిరంజీవి, ఖాసీం సాహెబ్, తదితరులు పాల్గొన్నారు. కాగా, ఎంపీడీవో కార్యాలయం వద్ద జయంతి వేడుకలు నిర్వహించలేదు. ముఖ్యనేతల జయంతి, వర్ధంతి వేడుకలు ప్రభుత్వఉత్తర్వుల మేరకు జరిపించేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

పామూరులో.. పామూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): సమ సమాజస్థాపనకు కృషి చేసిన సామాజిక విప్లవకారుడు మహాత్మ జ్యోతిరావు పూలే అని టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద పూలే విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏ. ప్రభాకర్‌చౌదరి, అమీర్‌బాబు, కోటిరెడ్డి డోలా శేషు, ముబినా మౌలాలి, హజిగోస్, తదితరులు పాల్గొన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆపార్టీ నియోజకవర్గ కన్వీనర్ కేవీ రమణయ్య, జె.చినసుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు. వైసీపీ కార్యాలయంలో పూలే చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.



పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్మన్ గఫార్

గుంటిగంగ తిరునాళ్ల ప్రశాంతంగా జరిగేలా చర్యలు

» సీఐ రామారావు

తాళ్లూరు, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రసిద్ధిగాంచిన గుంటిగంగతిరునాళ్ల ప్రశాంత వాతావరణంలో జరిగేలా చర్యలు చేపట్టినట్టు దర్శి సీఐ రామారావు తెలిపారు. ఈనెల 18న తిరునాళ్ల జరగనున్నట్టు చెప్పారు. శుక్రవారం మండలంలోని గుంటిగంగ భవాని ఆలయ పరిసరప్రాంతా లను, తిరునాళ్ల ప్రాంగణాన్ని సీఐ, ఎస్‌ఐలు పరిశీలించారు. అనంతరం జరిగిన సమావేశంలో సీఐ మాట్లాడుతూ తిరునాళ్లకు అత్యధికంగా భక్తులు వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రశాంత వాతావరణంలో గంగమ్మను దర్శించుకునేలా, తిరునాళ్ల జాతరలో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. తిరునాళ్ల సందర్భంగా నిర్వహించాల్సిన ట్రాఫిక్ ఆంక్షలను, ఏఏ ప్రాంతాల్లో రద్దీ ఎక్కువగా ఉంటుందో గుర్తించారు. ప్రభలు ఏర్పాటు చేసే ప్రాంతాలు, వంతెన, కాలువ పరిసరాల్లోగల రద్దీ ప్రాంతాల వద్ద తీసుకోవాల్సిన చర్యల గురించి ఎస్‌ఐ మల్లికార్జునరావుకు వివ రించారు. గుడికి 150 మీటర్ల దూరం లో షాపులు ఏర్పాట్లు చేసుకునేలా చూడాలన్నారు. భక్తులు గంగమ్మను దర్శించుకునేందుకు బారీ కేడ్లు ఏర్పాటుచే యాలన్నారు. భక్తులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా తగు చర్యలు చేపట్టాలని ఆలయకమిటీ చైర్మన్ కొసనా గురుబ్రహ్మంకు సీఐ, ఎస్‌ఐలు సుచించారు. ప్రభల ముందు వంద మీటర్ల మేర ఖాళీ ప్రదేశం ఉంచి బారీకేడ్లు ఏ ర్పాట్లు చేసుకోవాలన్నారు.

కార్యక్రమంలో ఎస్‌ఐ ఎస్ మల్లికార్జునరావు, దర్శి, ముండ్లమూరు ఎస్‌ఐలు మురళి, కమలాకర్, ఏఎస్‌ఐ మోహన్‌రావు, ఆలయ కమిటీ చైర్మన్ కొసనా గురుబ్రహ్మం, దేవదాయశాఖ ఈవో వాసు, ప్రభల నిర్వాహకులుపాల్గొన్నారు.



తిరునాళ్లకు పార్కింగ్ స్థలాలను పరిశీలిస్తున్న సీఐ, ఎస్‌ఐలు

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

» అంగన్‌వాడీ కేంద్రాల్లో ఘనంగా పక్షోత్సవాలు

దొనకొండ, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారంతోనే ఆరోగ్యంగా ఉంటారని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సుభాషిణి అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందించే పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు, చిన్నారులు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. దొనకొండలోని వీవీపురం అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార పక్షోత్సవాలు నిర్వహించారు. ఈసందర్భంగా గర్భిణులు, బాలింతలు ఆరోగ్యపరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఆంగన్‌వాడీ కార్యకర్తలు నసీమాసుల్తాన, ఆదిలక్ష్మి, లలితకుమారి, తదితరులు పాల్గొన్నారు.



కనిగిరి: పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ పార్వతమ్మ

కిశోర బాలికలు ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలి

కనిగిరి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): కిశోర బాలికలు ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పార్వతమ్మ అన్నారు. శుక్రవారం మండలంలోని లింగారెడ్డిపల్లి గ్రామంలో పౌష్టికాహార పక్షోత్సవాలను ఘనంగా నిర్వహించారు. అందుసంబంధించిన లోగోను అంగన్‌వాడీ కేంద్రంలో ప్రదర్శించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఇంటింటికి వెళ్ళి కిశోర బాలికలకు వ్యక్తిగత పరిశుభ్రత, జీవనశైలిపై అవగాహన కల్పించారు. పోషకపదార్థాలు తీసుకోవటంవల్ల కలిగే ఉపయోగాలపై అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరూ తమ నివాసాల్లో ఉన్న ఖాళీస్థలాల్లో న్యూట్రీగార్డెన్స్‌ను పెంచుకోవాలని పార్వతమ్మ సూచించారు. కూరగాయలు, పండ్లు, ఆకుకూరలు వంటి వాటిని పెంచుకుంటే సహజసిద్ధమైన పోషకాలు అందుతాయన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలకు కేంద్రంలో అందించే పౌష్టికాహార మెనూను వివరించారు.

కార్యక్రమంలో సర్పంచ్ నాగార్జునరెడ్డి, నాగూర్‌మీరా, మాధవి, అంగన్‌వాడీ వర్కర్లు సరస్వతి, సుభాషిణి, తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల్లో పోషక విలువలు అధికం

పీసీపల్లి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): చిరుధాన్యాల్లో పోషక విలువలు అధికంగా ఉంటాయని ఎంపీడీవో ప్రభాకరశర్మ అన్నారు. శుక్రవారం మండలంలోని వెంగళాయపల్లి, గోపవరపువారిపల్లి అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. గోపవరపువారిపల్లిలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో మాట్లాడుతూ రాగులు, సజ్జలు, కొర్రలు, తదితర తృణధాన్యాలు తీసుకోవాలన్నారు. వాటిల్లో ఐరన్‌తో పాటు పిండిపదార్థాలు అధికంగా లభిస్తాయని చెప్పారు. గర్భిణులు, బాలింతలు క్రమం తప్పకుండా వాటిని తీసుకోవడంవల్ల సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని ప్రతిఒక్కరూ తీసుకోవాలన్నారు.

కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సుమతి, కార్యకర్తలు, మహిళా పోలీసు, తదితరులు పాల్గొన్నారు. వెంగళాయపల్లిలో జరిగిన కార్యక్రమంలో కార్యకర్తలు లక్ష్మి, బుజ్జి, పద్మ, మహిళా పోలీసుతో పాటు ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కీర్తి, వీఏఏ రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం అందిస్తున్న పోషణ పదార్థాలను వినియోగించుకోవాలి

తాళ్లూరు, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలద్వారా అందజేస్తున్న పోషణ పదార్థాలను గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకుని ఆరోగ్యవంతులుగా ఉండాలని దర్శి సీడీపీవో సీహెచ్ భారతి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక మండల సమావేశం హాలులో పోషణ పక్వాడ పథకంపై అవగాహన కల్గించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రక్తహీనత గలవారిని గుర్తించి అవసరమైన పోషణ పదార్థాలను అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్నట్టు చెప్పారు. తాళ్లూరు పీహెచ్‌సీ వైద్యుడు రాజేష్‌యాదవ్ మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో దారా హనుమంతరావు, ఏపీఎం పి.దేవరాజ్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

కల్తీపాలు తయారుచేస్తే కఠిన చర్యలు



కొత్తవెంకటాపురంలో డెయిరీని మారువేషంలో తనిఖీచేస్తున్న సీఐ రామారావు

దర్శి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): కల్తీపాలు తయారు చేసే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ వై.రామారవు హెచ్చరించారు. మండలంలోని కొత్తవెంకటాపురంలో డెయిరీని సిబ్బందితో కలిసి మారువేషంలో శుక్రవారం తనిఖీచేశారు. అలాగే, ఎస్‌ఐ మురళి మండలంలోని ఎర్రఓబనపల్లి, రాజంపల్లి, దర్శిలో డెయిరీలను తనిఖీ చేశారు. గేదెలలకు పాలుపిండే సమయంలో ఆకస్మికంగా తనిఖీ చేసి పాలక్యాన్లను పరిశీలించారు. కల్తీపాలు తయారుచేసే యూరియా, సల్ఫర్, పాలపిండి వంటి పదార్థాలు ఉన్నాయా అని పరిశీలించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ దర్శి, తాళ్లూరు, ముండ్లమూరు మండలాల్లో కల్తీపాలు తయారుచేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. గతంలో పలు ప్రాంతాల్లో భారీ మొత్తంతో కల్తీపాలు పట్టుబడిన విషయాన్ని గుర్తుచేశారు. కల్తీపాలతో ఆరోగ్యాలు పాడవుతున్నాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ప్రజల ఆరోగ్యాన్ని హరించే కల్తీపాల నివారణకు పటిష్ఠ చర్యలు చేపట్టినట్టు చెప్పారు. అందులోభాగంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలపారు. కల్తీపాలు తయారుచేస్తున్నట్లు సమాచారం తెలిస్తే తెలియజేయాలని సీఐ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు,

సీసీ రోడ్ల నిర్మాణ పనుల పరిశీలన



సీసీ రోడ్ల నిర్మాణాన్ని పరిశీలిస్తున్న నగర పంచాయతీ చైర్మన్ పిచ్చయ్య

దర్శి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): దర్శి పట్టణంలో నిర్మిస్తున్న సీసీ రోడ్లు, కల్వర్టులను శుక్రవారం దర్శి నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యతా ప్రమాణాలకు అనుగణంగా పనులు చేయాలన్నారు. జరుగుతున్న పనులను అధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. అన్నిప్రాంతాల్లో మట్టి రోడ్లు, మెటల్ రోడ్ల స్థానంలో సీసీ రోడ్లు, మురుగు కాల్వలు నిర్మిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏఈ శ్రీనివాస్, కౌన్సిలర్ ఇత్తడి సునీత దినకర్, టీడీపీ నాయకులు శ్రీనాథ్, అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలని మహిళల ధర్నా

కనిగిరి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలని కోరుతూ శుక్రవారం ఐద్వా సంఘం ఆధ్వర్యంలో మహిళలు నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక సుగుణావతమ్మ సెంటరులో ఆసంఘం కార్యదర్శి ప్రసన్న మాట్లాడుతూ గ్యాస్‌ధరలతో పాటు నిత్యావసర ధరలు విపరీతంగా పెరిగాయన్నారు. పెరిగిన ధరలతో సామాన్యుడి కుటుంబ జీవనం ఇబ్బందికరంగా మారిందన్నారు. పెంచిన గ్యాస్, నిత్యావసర ధరలు తగ్గించకపోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో షమీల, రమణమ్మ, తిరుపతమ్మ, ఎలీషమ్మ, చిన్నక్క, ప్రమీల, ఆదిలక్ష్మి, వరలక్ష్మి, నారాయణమ్మ, రుఫియా, మల్లేశ్వరి, సుప్రియ, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

పశువైద్యశాల తనిఖీ

పీసీపల్లి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదఅలవలపాడు పశువైద్యశాలను శుక్రవారం జిల్లా పశుసంవర్థక శాఖ అధికారిణి డాక్టర్ బేబీ రాణి ఆకస్మిక తనిఖీ చేశారు. వైద్యశాలలోని రికార్డులను, ప్రభుత్వం సరఫరా చేసిన మందులను పరిశీలించారు. అనంతరం నేషనల్ లైవ్ స్టాక్ మిషన్, పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో నెలకొల్పిన గొర్రెల యూనిట్‌ను కనిగిరి సహాయ సంచాలకులు జి.శ్రీనివాసరెడ్డితో కలిసి పరిశీలించారు. ప్రభుత్వం 75శాతం రాయితీపై ఇస్తున్న గడ్డి జొన్నలను పశుపోషకులకు పంపిణీ చేశారు. గుదేవారిపాలెం సమీపంలో ఉన్న నీటి తొట్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఏడీ శ్రీనివాసరెడ్డి, పశు వైద్యాధికారులు ఆవుల రెడ్డి, బత్తుల క్రిష్ణ, బాలక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

విఠలాపురం కాలనీలో హోమాలు

తాళ్లూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విఠలాపురం కాలనీలో వైకుంఠరామాలయ ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా శుక్రవారం రుత్వికులు ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. వేణుగోపాలాచార్యులు నేతృత్వంలో నిత్యవాహన, మూలమంత్రమూర్తి, జలవిశేష హోమాలు, విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పలువురు దంపతులు కార్యక్రమంలో పాల్గొని పూజలు చేశారు.

జొన్నల నాణ్యత పరిశీలన

పామూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): పామూరు మండలంలోని కంభాల దిన్నె ప్రాంతంలో రైతులు పండించిన తెల్ల జొన్నల నాణ్యతను పౌర సరఫరాలశాఖ డీఎం వరలక్ష్మి శుక్రవారం పరిశీలించారు. రైతు సేవా కేంద్రంలో నిల్వఉంచిన తెల్లజొన్నలను టెక్నికల్ అసిస్టెంట్ వైష్ణవి, ఏవో కె.రాధతో కలిసి పరిశీలించి శాంపిల్స్‌ను తీసుకెళ్లారు. కంభాలదిన్నె, బొట్లగూడూరు ప్రాంతంలో 350 హెక్టార్లలో జొన్న సాగు చేసినట్లు ఏవో తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్‌సీఐ గోడౌన్ డీటీ మధుసూదనరావు కంప్యూటర్ ఆపరేటర్ కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

పశువుల నీటితొట్లను నిర్మించాలి

పామూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): వేసవికాలాన్ని దృష్టిలో పెట్టుకొని రాష్ట్రప్రభుత్వం ఉపాధి నిధులతో ప్రతి గ్రామ పంచాయతీలో పశువుల నీటి తొట్లను నిర్మిస్తున్నట్టు ఏపీడీ భాస్కరరావు తెలిపారు. మండలంలోని అయ్యవారిపల్లి గ్రామంలో శుక్రవారం నీటితొట్ల నిర్మాణానికి మార్కింగ్ చేశారు. కార్యక్రమంలో ఏపీవో బి.మాల్యాద్రి, మాజీ సర్పంచ్ మార్నెని మాలకొండయ్య, రామకృష్ణ, బి.శ్రీనివాసులురెడ్డి, సీహెచ్ సుబ్బయ్య, జింక మధు, మనోహర్, తేజ, శ్రీను, యాకోబు పాల్గొన్నారు.

పేద కుటుంబానికి సాయం

సీఎస్‌పురం(పామూరు), ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మిట్ట పాలెం ఎస్సీ కాలనీకి చెందిన డికాల శాంతి కుటుంబానికి గృహ నిర్మాణం నిమిత్తం శుక్రవారం మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు తరుపున వ్యవసాయ కళాశాల సెక్రటరీ పార్థ సారథి రూ.40 వేలు, కోవిలంపాడు గ్రామానికి చెందిన గోను చంద్రశేఖర్ రూ.20 వేలు అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల డీన్ పి.వీరన్నగౌడ్, ఉపసర్పంచ్ టి. బాబురావు, పి.తిరుపతయ్య, శ్రీనివాసులు, డి.మాలకొండయ్య, షేక్ నాయబ్‌రసూల్, తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

పామూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు ఆకుకూరలతో నిండిన పౌష్టికాహారాన్ని తీసుకోవాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ గోళ్ల పద్మజ తెలిపారు. మండలంలోని బొట్లగూడూరు సెక్టార్‌లో పౌష్టికాహార వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం పౌష్టికాహారం గురించి అవగాహన కల్పించారు. రక్తహీనత నివారణ చర్యలు తీసుకోవాలని సూచించారు. బరువు తక్కువగా ఉన్న పిల్లలను గుర్తించి ఎన్‌ఆర్‌సీలో చేర్పించాలని తెలిపారు.

ఏఐవైఎఫ్ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలి

పామూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో మే 15 నుంచి 18వ తేది వరకు జరగనున్న ఏఐవైఎఫ్ 17వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని ఆసంఘం జిల్లా కార్యదర్శి పోతుల ప్రభాకర్ పిలుపు నిచ్చారు. శుక్రవారం స్థానిక జీవైఆర్ భవన్‌లో మహాసభలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యకమంలో జిల్లా నాయకులు బి.రామాంజనేయులు, గౌతమ్, ముజాఫ్, ఇర్ఫాన్, నరశింహులు పాల్గొన్నారు.



- పీఈటీ పోస్టుల భర్తీకి వింత సిలబస్
- క్రీడా నైపుణ్యం ఉన్న వారికి అవకాశాలు తక్కువే
- గత ప్రభుత్వ సిలబస్ మార్చాలంటున్న విద్యావేత్తలు
- వచ్చే డీఎస్సీకి మార్పులు చెయ్యాలి.. లేకుంటే ఆటలు అబాసుపాలే
- థియరీ 70, క్రీడా ప్రావీణ్యానికి 30 శాతం ప్రాధాన్యం ఇవ్వాలని సంఘాల అభ్యర్థన

ఆటలొద్దు.. పాఠాలు చాలు



ఆటలు ఆడించాలి.. క్రీడల్లో శిక్షణ ఇవ్వాలి.. పోటీలతో స్ఫూర్తి నింపాలి.. మట్టిలో మాణిక్యాలను వెలికితీయాలి.. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడా వేదికలపై విజయ కేతనం ఎగరేసేలా క్రీడకారులను తీర్చిదిద్దాలి.. వారే వ్యాయామ ఉపాధ్యాయులు. కానీ వ్యాయామ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యే వారికి క్రీడా నైపుణ్యాలు అవసరం లేదట.. తరగతి గదుల్లో పాఠాలు బోధిస్తే చాలంటూ గత వైసీపీ ప్రభుత్వం డీఎస్సీలో చేర్చిన వింత సిలబస్‌పై వివిధ వర్గాలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. త్వరలో డీఎస్సీ ప్రకటించనున్న నేపథ్యంలో ఈ వింత సిలబస్‌ను కూటమి ప్రభుత్వం మార్చాలని విద్యావేత్తలు డిమాండ్ చేస్తున్నారు. వచ్చే డీఎస్సీకి మార్పులు చెయ్యాలని లేకుంటే పాఠశాల స్థాయిలో ఆటలు అబాసుపాలేనని.. బడి పిల్లల్లో క్రీడా స్ఫూర్తి కోల్పోయి శారీరక, మానసిక ఎదుగుదల కోల్పోతారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో డీఎస్సీ సిలబస్‌లో ఉన్నట్లుగా థియరీ 70 శాతం, క్రీడా ప్రావీణ్యానికి 30 శాతం ప్రాధాన్యం ఇవ్వాలని ఉపాధ్యాయ సంఘాలు అభ్యర్థిస్తున్నాయి.



● క్రీడల్లో శిక్షణ ఇస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులు

తెనాలి, ఏప్రిల్ 11, (ఆంధ్రజ్యోతి): వ్యాయామ ఉపాధ్యాయులంటే బడుల్లో చిన్నారులను మైదానాల్లో పరుగులు పెట్టించాల్సిన అవసరం లేదట. ఆటలతో సంబంధం లేదంట. అసలు వ్యాయామ ఉపాధ్యాయులకు క్రీడా నైపుణ్యాలే అవసరం లేదంట. ఈ వింత సిలబస్‌తో గత వైసీపీ ప్రభుత్వం 2024లో డీఎస్సీని ప్రకటించింది. ఎటువంటి స్కిల్ టెస్ట్ లేకుండా కేవలం థియరీలో నైపుణ్యం ఉంటే చాలని వ్యాయామ ఉపాధ్యాయుల ఎంపిక విషయంలో మార్పులు చేసింది. విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని, ఉత్సాహాన్ని నింపాల్సిన ఉపాధ్యాయులకు ఆ నైపుణ్యాలు లేకుండా ఎంపికైతే నెలకొనే పరిస్థితిపై విద్యావేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పిల్లలకు చదువుతోపాటు క్రీడలకూ అంతే ప్రాధాన్యం ఇవ్వాలి. దేహదారుఢ్యాన్నే కాకుండా, మానసిక వికాసాన్ని పెంపొందించే క్రీడలు నేర్పించే వారు ఆటల్లో నైపుణ్యం ఉన్న క్రీడాకారులై ఉండాలి. అటువంటి వారికి ప్రాధాన్యం ఇస్తే రేపటి రోజున మైదానాల్లోనూ చిన్నారులను పరుగులు పెట్టించగలుగుతారు. కానీ ఎటువంటి ఆటలతో పనిలేకుండా, ఏ క్రీడా నైపుణ్యం లేకుండా కేవలం పాఠాలు చెప్పగలిగినవారు, ఛాయిస్‌తో సమాధానాలు రాసి, అదృష్టం కలసి వచ్చిన వారు వ్యాయామ ఉపాధ్యాయులైతే రేపటి రోజున రాష్ట్రంలో క్రీడల పరిస్థితి ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. స్కిల్ టెస్ట్ విధానాన్ని కాదని థియరీకే ప్రాధాన్యం ఇస్తూ జారీ చేసిన గత ఉత్తర్వులపై వ్యాయాయ ఉపాధ్యాయులుగా రాణించాలని ఆశపడేవారికి శరాఘాతంగానే మారాయి. అయితే కూటమి ప్రభుత్వం రావడంతో వ్యాయామ ఉపాధ్యాయులుగా రాణించాలనుకునే వారిలో ఆశలు చిగురించాయి. గతంలో వైఎస్ హయాంలో కూడా 100 శాతం థియరీకే ప్రాధాన్యం ఇవ్వగా ఆ తర్వాత చంద్రబాబు ప్రభుత్వం రద్దుచేసి, పాత పద్ధతినే కొనసాగించింది. జగన్ ప్రభుత్వంలో వైఎస్ హయాంలోని సిలబస్‌నే తిరిగి ప్రవేశపెట్టారు. 1882 నాటి హంటర్ కమిషన్ నుంచి 1977 నాటి

(మిగతా 6వ పేజీలో)

క్రీడలతో సంబంధం లేని సిలబస్

డీఎస్సీలో పీఈటీ పోస్టులకు గతంలో ఉన్న 70 శాతం థియరీ, 30 శాతం ప్రాక్టికల్స్‌తో కూడిన ప్రాక్టికల్స్ సిలబస్‌గా ఉండేది. జగన్ ప్రభుత్వం ప్రాక్టికల్ టెస్ట్ అవ సరం లేదని, కేవలం థియరీలో ఉత్తీర్ణత సాధిస్తే చాలన్నట్లు మార్చేశారు. అదేమని పీడీ, పీఈటీ సంఘాలు ప్రశ్నిస్తే గర్భిణులు పరీక్షల్లో పాల్గొంటే ప్రాక్టికల్స్ ఎలా చేస్తారని, అటువంటి వారికోసమే ఆ విధానాన్ని తొలగించి, కేవలం థియరీకే ప్రాధాన్యం ఇచ్చామంటూ కబుర్లు చెప్పుకొచ్చారు. శారీరక వ్యాయామానికి సంబంధించిన థియరీ, క్రీడల్లో ఏర్పడే గాయాలకు చికిత్స వంటివాటితో లోతుగా సిలబస్ ఇచ్చి, వ్యాయామానికి సంబంధించినవి లేకపోవడం విస్తు కలిగిస్తున్నది. పైగా ఇవన్నీ ప్రశ్నలకు పేరాగ్రాఫ్‌లుగా సమాధానాలు వివరణాత్మకంగా రాయాల్సిన పనికూడా లేదు. కేవలం ఆబ్జెక్టివ్ విధానంలో సమాధానాలుగా నమోదు చేస్తే సరిపోతుంది. ఈ పద్ధతిలో చివరకు థియరీలో కూడా ప్రావీణ్యం చూపాల్సిన అవసరం లేకుండా కేవలం అదృష్టాన్ని పరీక్షించుకున్నాచాలన్నట్లు సిలబస్ రూపొందించడం విశేషం. ఇటువంటి వారు వ్యాయామ ఉపాధ్యాయులైతే రేపటి తరం చిన్నారుల క్రీడా నైపుణ్యం అటకెక్కినట్లే.


సాగర్ కుడికాల్వకు నీరు బంద్

- నీటి సరఫరాను నిలిపివేసిన అధికారులు
- బుగ్గవాగు నుంచి రెండు రోజులు మాత్రమే
- జలాశయంలో 515 అడుగులకు పడిపోయిన నీరు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

నాగార్జున సాగర్ జలాశయం నుంచి కుడి కాల్వకు నీటి సరఫరా నిలిచిపోయింది. జలాశయంలో నీటి మట్టాలు పడిపోవడంతో కుడి కాల్వకు నీటి విడుదలను జలవనరుల శాఖ నిలిపేసింది. ప్రస్తుతం బుగ్గవాగు నుంచి స్వల్పంగా నీటిని సరఫరా చేస్తున్నారు. ఇది కూడా రెండు రోజుల్లో పూర్తిగా నిలిచిపోనున్నది. ఇక డ్యాం నుంచి నీటి సరఫరా ఉండదని అధికారులు తేల్చి చెబుతున్నారు. జలాశయంలో నీటి నిల్వ 140.49 టీఎంసీలకు పడిపోయింది. సాగర్ డెడ్ స్టోరేజి 498 అడుగులు కాగా ప్రస్తుతం 515 అడుగులకు చేరింది. ప్రస్తుతం జలాశయంలో ఉన్న 28.31 టీఎంసీల నీటిని ఇరు రాష్ట్రాలు వినియోగించుకునే అవకాశం ఉంది. డ్యాంకు వరద వచ్చే వరకు ఉన్న నీటిని పొదుపుగా వాడుకోవాల్సిన పరిస్థితులు నెలకున్నాయి. ఈ పరిస్థితుల్లో నీటి విడుదలను నిలిపేశారు. జలాశయంలో ఉన్న నీటి నిల్వలను వేసవిలో తాగునీటి అవసరాలకు మాత్రమే వినియోగించాలని కేఆర్ఎంబీ, ప్రభుత్వం నిర్ణయించింది. మే నెల మూడో వారంలో తాగునీటి అవసరాలకు డ్యాం నుంచి నీటిని విడుదల చేయనున్నట్లు జలవనరుల శాఖ ఎస్ఈ కృష్ణమోహన్ తెలిపారు. నీటి సరఫరా నిలిపివేయడంతో కాల్వల చివర భూముల్లో వరి సాగు చేసిన రైతులు ఆందోళన చెందుతున్నారు.

20 శాతం వరకు ఆవిరి..



సాగర్ జలాశయం నుంచి కుడికాలువకు నిలిచిపోయిన నీటి సరఫరా

ఏప్రిల్ నెలలోనే ఎండ తీవ్రత అధికంగా ఉంది. మే నెలలో 47 డిగ్రీల వరకు ఉష్ణోగ్రత నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణశాఖ చెబుతున్నది. ఈ నేపథ్యంలో జలాశయంలో ఎండకు ఆవిరి కూడా అధికంగా ఉండే అవకాశం ఉంది. ఉన్న నీటిలో 20 శాతం వరకు ఆవిరయ్యే అవకాశం ఉంటుందని అధికారుల అంచనా. ఇది దాదాపు నాలుగు నుంచి ఐదు టీఎంసీలని అధికారులు భావిస్తున్నారు. అవసరం లేని సమయంలో అధికంగా నీటిని కాల్వలకు సరఫరా చేయడంతో పెద్దఎత్తున నీరు వృథాగా వాగుల్లో ప్రవహించింది. ముందస్తు చర్యలు చేపట్టి ఉంటే తాగునీటికి గడ్డు పరిస్థితులు ఏర్పడేవి కాదన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

ధర పతనం తగ్గిన ఆదాయం



- మిర్చి యార్డు ఆదాయంలో 16 శాతం లోటు
- రూ.106 కోట్ల లక్ష్యం కాగా రూ.90 కోట్లే వసూలు

గుంటూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మిర్చి ధరలు పతనమై రైతులు అల్లాడుతుండగా.. ఆ ప్రభావం గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ (జీఏఎంసీ) ఆదాయంపై కూడా తీవ్ర ప్రభావన్నే చూపింది. కొన్నేళ్లలో ఎప్పుడూ లేనివిధంగా మార్కెట్ ఫీజు వసూళ్లలో మిర్చియార్డు లక్ష్యాన్ని అందుకోలేకపోయింది. ఈ నేపథ్యంలో ఆదాయంలో నుంచి వివిధ పనుల కోసం ఖర్చు చేసే నిధులను ప్రభుత్వం సక్రమంగా విడుదల చేస్తుందో, లేదో తెలియని పరిస్థితి నెలకొన్నది. గత ఆర్థిక సంవత్సరంలో గుంటూరు ఏఎంసీకి మార్కెటింగ్ శాఖ రూ.106 కోట్ల సెస్సు వసూళ్లని లక్ష్యంగా నిర్దేశించింది. అయితే గత ఆరేడు నెలలుగా మిర్చి ధరలు నేలచూపులు చూస్తున్నాయి. క్వింటాల్ ధర రూ.7 వేల నుంచి రూ.11 వేల మధ్యనే కొనసాగుతుంది. దీంతో మిర్చియార్డులో టర్నోవర్ తగ్గింది. ఆ ప్రభావం ఒక శాతం వసూలు చేసే మార్కెట్ సెస్సుపై పడింది. మార్చి మొదటి వారంలో రూ.77.40 కోట్లు వసూలైంది. గత నెల నుంచి నిత్యం లక్షా 20 వేలకు పైగా మిర్చి టిక్కీలు యార్డుకు రావడంతో కొద్దిగా ఆదాయం పెరిగింది. అయినా ఆర్థిక సంవత్సరం ముగిసిన మార్చి 31కి సెస్సు రూ.90 కోట్ల వరకే వసూలైంది. కేటాయించిన లక్ష్యం కంటే దాదాపుగా 16 శాతం లోటు ఏర్పడింది.

బడ్జెట్‌పై కసరత్తు..

నూతన ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌పై మార్కెటింగ్ శాఖ కసరత్తు ప్రారంభించింది. మార్కెట్ ఫీజు లక్ష్యం, యార్డులో చేపట్టే పనులకు సంబంధించిన ప్రతిపాదనలను మార్కెటింగ్ శాఖ రాష్ట్ర డైరెక్టర్, కమిషనర్ విజయసునీతకు నివేదించి ఆమోదం తీసుకోనున్నారు. అయితే గత ఏడాది నిర్దేశించిన మార్కెట్ ఫీజు రూ.106 కోట్ల లక్ష్యాన్ని తగ్గిస్తారా... అలానే ఉంచుతారా అన్నది సస్పెన్స్‌గా మారింది. వేసవి సెలవుల అనంతరం ఏమైనా ధర పెరిగితే తప్ప ఆదాయం పెరగదు. ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలను తప్పక అన్వేషించుకోవాల్సిన పరిస్థితి జీఏఎంసీకి ఉత్పన్నమైంది.

వాడరేవుకు గవర్నర్ నజీర్





గవర్నర్‌కు స్వాగతం పలుకుతున్న కలెక్టర్, ఎస్పీ

చీరాల, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్‌నజీర్ వ్యక్తిగత పర్యటనలో భాగంగా శుక్రవారం చీరాల పరిధిలోని వాడరేవు ఐటీసీ గెస్ట్‌హౌస్‌కు విచ్చేశారు. కలెక్టర్ వెంకటమురళి, ఎస్పీ తుషార్‌డూడీ, ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు మర్యాదపూర్వకంగా గవర్నర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందసి స్వాగతం పలికారు. రాత్రికి బస చేసుకుని, శనివారం సాయంత్రం తిరిగి గవర్నర్ రాజ్‌భవన్ చేరుకోనున్నట్లు అధికారులు తెలిపారు. గవర్నర్‌ను కలిసిన వారిలో తహసీల్దార్లు గోపీకృష్ణ, ప్రభాకరరావు, డీఎస్పీ ఎండీ మొయిన్, సీఐ శేషగిరిరావు, ఎస్ఐ చంద్రశేఖర్ తదితర సిబ్బంది ఉన్నారు. గవర్నర్ పర్యటన సందర్భంగా నియోజకవర్గంలో పోలీసులు పటిష్ట భద్రత ఏర్పాటు చేశారు. ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా ఏరియా హాస్పిటల్‌లో సేఫ్టీ గదిని సిద్ధం చేశారు. బాంబ్ స్క్వాడ్ రంగంలోకి దిగి తనిఖీలు నిర్వహించింది.

సీసీ రోడ్ల పనులకు శ్రీకారం



పనులు చేపట్టకముందు రోడ్డు



మార్చి 25న కౌన్సిలర్ వాసిరెడ్డి లింగమూర్తితో కలిసి శంకుస్థాపన చేస్తున్న ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు



గాయత్రినగర్‌లో రూ.45 లక్షలతో జరుగుతున్న సీసీ రోడ్డు పనులు

- ఏళ్ల సమస్య పరిష్కారమవుతుందని హర్షం
- అక్షరం అండగా పరిష్కారమే అజెండాకు స్పందన
- సమస్యలపై ఆంధ్రజ్యోతి చొరవ చూపాలని ప్రజల ఆకాంక్ష

వినుకొండ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఏళ్లుగా సరైన రోడ్డు లేక పడిన అవస్థలు త్వరలో పరిష్కారం కానున్నాయి. వర్షం వస్తే బురద రోడ్డుతో ఇళ్లలో నుంచి బయటకు అడుగుపెట్టలేని పరిస్థితులు మారిపోనున్నాయి. స్థానికులు పడుతున్న ఇబ్బందులపై ఆంధ్రజ్యోతి వినూత్నంగా చేపట్టిన 'అక్షరం అండగా.. పరిష్కారమే



అజెండాగా' కార్యక్రమానికి స్పందన వచ్చింది. ప్రజాసమస్యల పరిష్కారంపై జనవరి 28న ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు పట్టణంలోని 31, 23వ వార్డులో 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా' కార్యక్రమంలో పాల్గొని ప్రజా సమస్యలను పరిశీలించి పలు హామీలు ఇచ్చారు. ఈ క్రమంలో రెండు వార్డుల్లో రూ.62.60 లక్షల మేర పను లకు మార్చి 25న జీవీ శంకుస్థాపనలు కూడా చేశారు. ఈ నేపథ్యంలో 31వ వార్డులో రూ.45 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి శుక్రవారం పనులను ప్రారం భించారు. ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న రోడ్డు సమస్య పనులు ప్రారంభంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. సమస్యల పరిష్కారానికి ఆంధ్రజ్యోతి చూపుతున్న చొరవను అభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు. రానున్న రోజుల్లో మరెన్నో కార్యక్రమాలు చేపట్టి సమస్యల పరిష్కారానికి ఆంధ్రజ్యోతి కృషి చేయాలని స్థానికులు ఆకాంక్షించారు.

25 ఏళ్ల కల సాకారం దిశగా

- నల్లమడ డ్రెయిన్‌పై వంతెనకి శంకుస్థాపన
- రూ.14.10 కోట్లతో కప్పలవారిపాలెం వద్ద నిర్మాణం



డ్రెయిన్‌పై నిర్మించే వంతెనకి శంకుస్థాపన చేస్తున్న ఎంపీ కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే నరేంద్రవర్మ

బాపట్లరూరల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): నల్లమడ డ్రెయిన్‌పై వంతెన నిర్మాణం బాపట్ల మండలం చివరి గ్రామమైన కప్పలవారిపాలెం గ్రామస్తుల 25 ఏళ్ల కల. ఏళ్లుగా నెరవేరని కల ప్రస్తుతం సాకారం దిశగా కూటమి ప్రభుత్వం సిద్ధమైంది. నల్లమడ డ్రెయిన్‌పై కప్పలవారిపాలెం వద్ద రూ.14.10 కోట్లతో నిర్మించబోయే వంతెనకు శుక్ర వారం లోకసభ ప్యానల్ స్పీకర్, ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్‌తో కలిసి బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మశంకుస్థాపన చేశారు. ఈ సంద ర్భంగా తెన్నేటి మాట్లాడుతూ ఈ వం తెన నిర్మాణానికి ఆరు సార్లు టెండర్లు వేసినా ఎవరు రాలేదని జీకేసీ ప్రాజెక్ట్ లిమిటెడ్ కంపెనీ ముందుకు రావడం అభినందనీయమన్నారు. అటువంటి కాంట్రాక్టర్‌కు ప్రజలు సహకరిస్తే బ్రిడ్జి నిర్మాణ పనులు త్వరగా పూర్తవుతాయన్నారు. రేపల్లె-తెనాలికి రెండో రైల్వేలైన్ అనుమతి లభించిందన్నారు. నిజాంపట్నం హార్బర్‌కు నాలుగు లేన్ల రోడ్డు, 216 జాతీయ రహదారి నాలుగు లేన్లగా విస్తరణకు కేంద్రం అనుమతిచ్చిందన్నారు. సూర్యలంక అభివృద్ధికి రూ.97.52 కోట్లు మంజూరయ్యాయన్నారు. లోక్‌సభ స్పీకర్ కుర్చీలో కూర్చొనే అవకాశం తనకు చంద్రబాబు కల్పించారన్నారు. వేగేశన మాట్లాడుతూ సంవత్సరలోపు బ్రిడ్జి నిర్మాణం పూర్తవుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చీరాల గోవర్ధన్‌రెడ్డి, బాలకృష్ణమూర్తి, పంచాయతీరాజ్ ఇఇ రతన్‌బాబు, ఏఎంసీ చైర్మన్ కావూరి శ్రీనివాసరెడ్డి, కర్లపాలెం మండల టీడీపీ అధ్యక్షుడు ఏపూరి భూపతిరావు పాల్గొన్నారు.



వంతెన నిర్మాణ ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే తదితరులు



మార్టూరులో గ్రామోత్సవంలో సీతారామలక్ష్మణ ఉత్సవ విగ్రహాలు

కన్నుల పండువగా సీతారాముల కల్యాణం

మార్టూరు,ఏప్రిల్11(ఆంధ్రజ్యోతి): మార్టూరులోని ఈశాన్య రామాలయంలో సీతారాముల కల్యాణాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. గత కొన్నేళ్లుగా శిథిల దశలో ఉన్న రామాలయంలో తిరిగి కలశగోపురంను పునఃప్రతిష్ఠించి,సీతారామలక్ష్మణ ఆంజనేయ ఉత్సవ విగ్రహాలను తయారుచేయించారు. తదనంతరం స్వామి వారి కల్యాణం నిర్వహించడం పట్ల భక్తులు ఆనంద పరవశులయ్యారు. మార్టూరు గ్రామంలోని తూర్పుబజారుకు చెందిన భక్తులు, ఇంకా తదితర గ్రామస్థులు భారీగా స్వామి వారి కల్యాణం తిలకించడానికి వచ్చారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా వాహనంపై అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు.



తనిఖీలు చేస్తున్న విద్యుత్ సిబ్బంది తో మాట్లాడుతున్న ఈఈ మస్తాన్‌రావు

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే చర్యలు

బల్లికురవ. ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలలో ఎవరైనా విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కేసులు నమోదు చేస్తామని అ శాఖ అద్దంకి డీవిజన్ ఈఈ మస్తాన్‌రావు హెచ్చరించారు. శుక్రవారం బల్లికురవ మండలంలోని 21 గ్రామ పంచాయతీలలో విద్యుత్ సిబ్బందిని 34 బృందాలుగా విభజన చేసి గృహాలలో విద్యుత్ మీటర్లను తనిఖీలు చేయించారు. ఈసందర్భంగా తనిఖీల బృందాలు ఆదనపులోడ్‌కు 50 శాతం రాయితీలు ప్రభుత్వం ఇచ్చిందని, వెంటనే వినియోగదారులు చెల్లించాలని సూచించారు. విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న వారికి జరిమానాలు విధించారు. ఈ తనిఖీలలో విజిలెన్స్ ఏడీ విజయ్ శ్రీనివాస్, మార్టూరు ఏడీ సురేంద్రాబు, ఏఈ శ్రీనివాసరావు, పలు మండలాలకు చెందిన ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠ్య పుస్తకాలు, కిట్‌ల పంపిణీ సక్రమంగా జరగాలి

పంగులూరు, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి):రానున్న విద్యాసంవత్సరంలో పాఠశాల విద్యార్థులకు అందజేసే కిట్‌ల పంపిణీలో తగిన జాగ్రత్తలు పాటించాలని ఎస్ఎస్ఏ సీఎంవో శ్రీనివాసరెడ్డి అన్నారు. పంగులూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో రానున్న విద్యా సంవత్సరంలో పాఠశాల విద్యార్థులకు అందజేసేందుకు కిట్‌లు నిల్వ చేసే స్టాక్ పాయింట్లను శుక్రవారం ఆయన పరిశీలించారు. విడివిడిగా వచ్చే నోట్ పుస్తకాలు, పాఠ్య పుస్తకాలు, ఇతర వస్తువుల ప్యాకింగ్ విషయంలో సీఆర్‌పీలు , పీటీఐలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

సరస్వతమ్మ మృతికి ఎమ్మెల్యే ఏలూరి సంతాపం

చినగంజాం, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి) : మండలంలోని గొనసపూడి గ్రామానికి చెందిన టీడీపీ యువనాయకుడు, లాయిడ్ ఫార్మా ఎండీ విక్రం నారాయణరావు నాయనమ్మ సరస్వతమ్మ(90) శుక్రవారం మృతి చెందారు. సరస్వతమ్మ మృతికి పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు సంతాపం తెలిపారు. ఆమె కుటుంబసభ్యులకు ఎమ్మెల్యే ఏలూరి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు పొద వీరయ్య, పలువురు టీడీపీ నాయకులు ఆమె మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

మిర్చి రైతుకు నష్టాల మంట

లక్షలాది రూపాయల పెట్టుబడులు

అరకొర దిగుబడులు

సగానికి సగం పడిపోయిన ధర

అప్పులపాలైన అన్నదాతలు



మేదరమెట్ల కారం మిల్లు వద్ద బారులు తీరిన మిరపకాయల లారీలు

మేదరమెట్ల, ఏప్రిల్11(ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టించి పనిచేసే రైతులు జీవితాలు వాతావరణ పరిస్థితులపై ఆధారపడి ఉంటున్నాయి. అతివృష్టి, అనావృష్టితో పాటు పురుగులు, తెగుళ్లతో నష్టాలను చవిచూస్తున్నారు. అప్పులపాలైన రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. మిగిలిన రైతులు అప్పులు, వడ్డీలు చెల్లించలేక భూములమ్మి కూలీలుగా మారిపోతున్నారు.

కొరిశపాడు మండలంలో పమిడిపాడు, రాచపూడి, రావినూతల, ప్రాసంగులపాడు, అనమనమూరు, కొరిశపాడు, కనగాలవారిపాలెం, పి. గుడిపాడు తదితర గ్రామాల్లో సుమారు 1000 ఎకరాల్లో మిరప సాగు చేశారు. చాలా మంది రైతులు తెగుళ్ల సోకడంతో మధ్యలోనే పంటను వదిలేశారు. ఈ సంవత్సరం మిరప పంట వేసిన రైతులు మిర్చి ధర నిరాశాజనకంగా ఉండడంతో పాటు ఖర్చులు విపరీతంగా పెరగడంతో విధిలేని పరిస్థితుల్లో అరకొరగా పండిన పంటను అందిన కాడికి తెగనమ్ముకుంటున్నారు. వర్షాలు ఎక్కువగా పడడంతో తెగుళ్ల, కొత్తరకాల వైరస్‌లతో ఎకరానికి లక్షకుపైగా ఖర్చు చేసిన రైతులు అరకొరదిగుబడులను సాధించారు.కొన్ని చోట్ల ఒక్క కాయ కూడా తెంపకుండానే పొలాలను పశువులకు వదిలేశారు. అరకొరగా వచ్చిన మిర్చికి ధర లేక వచ్చినకాడికి తెగనమ్ముతున్నారు. గడిచిన ఏడాది తేజా రకం మిరప క్వింటా రూ. 23 వేలకు అమ్ముడయింది. ఈసంవత్సరం ఇదే తేజా రకం క్వింటా 9 వేల నుంచి రూ. 13వేల వరకు కొనుగోలు చేస్తున్నారు. అన్ని రకాల మిరప ధరలు గత సంవత్సరానికి ఇప్పటికి క్వింటాకు రూ. 10 నుంచి 13 వేలకు పైగా ధర తేడా ఉంది. రైతులు మిరప కాయలు కోసిన కూలీలకు కూలి చెల్లించాల్సి రావడం, ఇతర ఖర్చులకు డబ్బులు లేక వచ్చినకాడికి తెగనమ్ముతున్నారు. గత సంవత్సరం మిరపకు ధరలు బాగా ఉండడంతో ఈ సంవత్సరం ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేశారు. ప్రస్తుతం రైతులు గిట్టుబాటు ధర లేక తీవ్రంగా నష్టపోయారు. ప్రభుత్వం స్పందించి మిర్చికి గిట్టుబాటు ధర కల్పించాలని రైతులు కోరుతున్నారు.

ఫ్యాక్టరీ వద్ద భారీగా మిర్చి లోడ్‌లు

మిరపకాయలు తక్కువ ధరకు లభించడంతో మేదరమెట్లలోని సింథైట్ ఫ్యాక్టరీ భారీగా కాయలను కొనుగోలు చేస్తుంది. 40 రోజుల నుంచి రోజూ దాదాపు 100 లారీలకు పైగా మిరపకాయలను ఫ్యాక్టరీలో దిగుమతి చేస్తున్నారు. ఇక్కడ తయారు చేసిన మిరపకాయల నుండి తీసిన ఆయిల్, కారం ఇతర దేశాలకు ఎగుమతి అవుతోంది.

బాలికా విద్యకు అత్యధిక ప్రాధాన్యత

విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

బల్లికురవ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం బాలికా విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు, స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో రూ. 1.64 కోట్లతో నిర్మాణం చేయనున్న ఆరు వసతి గదులకు మంత్రి రవికుమార్, జాయింట్ కలెక్టర్ ప్రఖర్ జైన్‌లు భూమి పూజ చేశారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ బాలికలకు అన్ని వసతులతో విద్యాలయాన్ని తీర్చి దిద్దుతామన్నారు. వసతి గదులలో విద్యార్థులు నేల పై పడుకోకుండా బెడ్లు ఏర్పాటు చేయిస్తున్నామని తెలిపారు. ఆరు మాసాల వ్యవధిలో వసతి గదులు పూర్తి చేయాలని ఆయన కాంట్రాక్టర్‌కు సూచించారు. అలానే బాలికలకు ఇబ్బందులు లేకుండా విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు, ఎంపీడీవో కుసుమకుమారి, తహసీల్దార్ రవి నాయక్, మండల టీడీపీ నాయకులు మలినేని గోవిందరావు, సర్పంచ్ పందిరి అంజిబాబు, సమగ్ర శిక్ష ఈఈ నాగజ్యోతి, ఏపీసీ నాగిరెడ్డి, ఏఈ రాజన్‌బాబు, జీసీడీవో చారులత, ప్రిన్సిపాల్ సరళకుమారి తదితరులు పాల్గొన్నారు.



బల్లికురవ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో వసతి గదుల నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న మంత్రి రవికుమార్, జేసీ ప్రఖర్‌జైన్



రైతులకు వ్యవసాయ పరికరాలను అందజేస్తున్న మంత్రి రవికుమార్

ఏల్చూరులో రూ.149 కోట్లతో..

సంతమాగులూరు : మండలంలోని ఏల్చూరు గ్రామంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో రూ.1.49 కోట్లతో చేపట్టనున్న అదనపు తరగతి గదుల నిర్మాణానికి మంత్రి గొట్టిపాటి రవికుమార్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. అనంతరం విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో మరుగుదొడ్లు తక్కువగా ఉన్నట్లు మంత్రికి విద్యార్థులు తెలిపారు. వెంటనే మంత్రి స్పందిస్తూ మరుగుదొడ్లు త్వరగా నిర్మించాలని ఎంపీడీవోకు సూచించారు. ఈ కార్యక్రమం లో అధికారులు, కూటమి నాయకులు మంత్రి వెంట పాల్గొన్నారు.



కల్యాణం సందర్భంగా ప్రత్యేక అలంకరణలో స్వామివారు

అంగరంగ వైభవంగా స్వామివార్ల కల్యాణం

ఉప్పుటూరు(పర్చూరు), ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు మండలం ఉప్పుటూరు గ్రామంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి, చెన్నకేశవ స్వామివార్ల ఆలయంలో బ్రహ్మోత్సవాలు గత మూడు రోజుల నుంచి అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్వామివార్ల కల్యాణ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజాకార్యక్రమాలు చేపట్టారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కల్గకుండా ఆలయ కార్యనిర్వాహక కార్యదర్శి దామా నాగేశ్వరరావు ఏర్పాట్లు చేశారు.

నేడు ఉప్పుటూరులో తిరునాళ్ల

పర్చూరు మండల పరిధిలోని ఉప్పుటూరు గ్రామంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి, చెన్నకేశవ స్వామివార్ల తిరునాళ్ల శనివారం జరుగుతుందని ఆలయ కార్యనిర్వాహక కార్యదర్శి దామా నాగేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరునాళ్ల సందర్భంగా స్వామివార్లకు ప్రత్యేక పూజాకార్యక్రమాలు, ఆలయ ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.



ప్రత్యేక అలంకరణలో బొగ్గుల కొండ ఆంజనేయస్వామి పక్కన ఏర్పాటు చేసిన భారీ విద్యుత్ ప్రభ

ఘనంగా బొగ్గులకొండ ఆంజనేయస్వామి వార్షిక తిరునాళ్ల

బల్లికురవ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కూకట్లపల్లి గ్రామ సమీపంలోని బొగ్గులకొండ యోగ ప్రసన్నాంజనేయస్వామి 46 వ వార్షిక తిరునాళ్ల శుక్రవారం వైభవంగా జరిగింది. దేవాలయాన్ని పలు గ్రామాలకు చెందిన భక్తులు సందర్శించి ప్రత్యేక అభిషేకాలలో పాల్గొన్నారు. ఈసందర్భంగా దేవాలయ ధర్మకర్త తాళ్ల శివశంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో దాతల సహకారంతో ఉదయం సాయంత్రం వరకు అన్నదానం నిర్వహించారు. భక్తులు తిరునాళ్లలో విద్యుత్ ప్రభను ఏర్పాటు చేసి సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున ఆంజనేయస్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

అనుమతులు లేకుండా షాపుల నిర్మాణం

● మున్సిపల్ అధికారులకు రామాయపాలెం సర్పంచ్ ఫిర్యాదు

అద్దంకి, ఏప్రిల్11: అద్దంకి పట్టణంలోని భవానిసెంటర్‌లో శింగరకొండ రోడ్డు వెంబడి ఇప్పటికే నిర్వహిస్తున్న సిమెంట్ దుకాణానికి ఎలాంటి మున్సిపల్ అనుమతులు లేవని, మళ్లీ దాని పక్కనే ఆషాపు నిర్వహకులు అనుమతులు లేకుండా గోడౌన్ నిర్మాణం చేస్తున్నారని రామాయపాలెం సర్పంచ్ రామాంజనేయరెడ్డి మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. మున్సిపల్ అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

సాంఘిక దురాచారాలకు వ్యతిరేకంగా పూలే పోరాటం

అద్దంకిటౌన్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): సాంఘిక దురాచారాలకు వ్యతిరేకంగా ఎన్నో పోరాటాలు చేసిన మహోన్నత వ్యక్తి మహాత్మ జ్యోతిరావు పూలే అని పలువురు వక్తలు అన్నారు. శుక్రవారం ఆయన జయంతి కార్యక్రమాన్ని పలు సంఘాలు, సంస్థల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక బంగ్లారోడ్డులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఏపీ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఐక్య వేదిక ఆధ్వర్యంలో పూలే చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో రోటరీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

చీరాల : తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ గోపీకృష్ణ ఆధ్వర్యంలో పూలే జయంతి వేడుకలు జరిగాయి. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి సిబ్బందితో కలిసి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. మునిసిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పట్టణంలోని పూలే కాంస్య విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. టీడీపీ కూటమి నాయకుల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో కౌతవరపు జనార్దన రావు, గజవల్లి శ్రీనివాసరావు, గూడూరు శివరామ ప్రసాద్ తదితర నాయకులు పాల్గొన్నారు.

అద్దంకి : అద్దంకి పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం పూలే జయంతిని నిర్వహించారు. చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు యర్రాకుల రామాంజనేయులు, బచ్చల వాసు, పూనూరి నరేంద్ర, కాసా పుల్లయ్యనాగరాజు, విశ్వరూపాచారి, అబ్దుల్లా, అద్దంకి నరేష్, సుబ్బారావు, రసూల్, మావు, పాపారావు తదితరులు పాల్గొన్నారు.

మహనీయుడు జ్యోతిరావు పూలే

పంగులూరు :పూలే చిరస్మరణీయుడని ఎంపీడీవో స్వరూపారాణి అన్నారు. ఆయన జయంతి సందర్భంగా పంగులూరు మండల పరిషత్ కార్యాలయంలో చిత్ర పటానికి ఎంపీడీవో శుక్రవారం పూలమాల వేసి నివాళులర్పించారు. పీఆర్ఏఈ హనుమంతరావు, ఈవోపీఆర్డీ సుమంత్, ఏపీవో, సిబ్బంది పాల్గొన్నారు.

యద్దనపూడి : శుక్రవారం యద్దనపూడి మండల తహసీల్దారు కార్యాలయంలో పూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో తహసీల్దారు కె.రవికుమార్ తోపాటు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మేదరమెట్ల : గర్భిణులు పోషకాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఇందిర తెలిపారు. శుక్రవారం రావినూతల 1- అంగన్వాడీ కేంద్రంలో పోషకాహార పక్షోత్సవాల సందర్భంగా గర్భిణులకు బాలసంజీవిని కిట్స్ పంపిణీ చేశారు.

ఆటలొద్దు... పాఠాలు చాలు

(5వ పేజీ తరువాయి)

ఈశ్వర్‌భాయ్ పటేల్ కమిటీల వరకు సిలబస్‌పై పలు సూచనలు ఇచ్చాయి. ప్రశ్నాపత్రం పార్ట్-1లో జనరల్ నాలెడ్జ్, కరెంట్ ఎఫైర్స్ ఉంటే, పార్ట్-2లో విద్యా దృక్పథాలకు సంబంధించి ఉండాలని సూచించాయి. అయితే దీనికి విరుద్ధంగా 2024 డీఎస్సీలో జగన్ ప్రభుత్వం మార్పులు చేసింది. 100 మార్కుల ప్రశ్నాపత్రంలో ప్రాక్టికల్స్‌తో పనిలేకుండా పూర్తిగా థియరీలో మార్కులు సాధిస్తే ఎంపికయ్యేలా మార్పులు చేశారు. పైగా వివరణాత్మక సమాధానాలు కాకుండా కేవలం ఆబ్జెక్టివ్ పద్ధతిలో సమాధానాలతో అదృష్టాన్ని పరీక్షించుకుంటే చాలన్నట్లు మార్చేశారు. గతంలో 70 శాతం థియరీలో ఉత్తీర్ణత అంతంత మాత్రంగా మార్కులు సాధించినా, క్రీడల్లో నైపుణ్యం ఉన్న వారికి ప్రాక్టికల్స్‌లో కలిసివచ్చేది. వారి ప్రతిభ ఆధారంగా మార్కులు పెరిగేవి. దీంతో నిజమైన క్రీడాకారులకు వ్యాయామ ఉపాధ్యాయులు, అధ్యాపకులుగా అవకాశం దక్కేది. అయితే కొత్త విధానంతో ఇదంతా తారుమారైంది. మైదానంలో ఆటలు ఆడలేని, నాలుగు గోడల మధ్య చదవగలిగినవారే వ్యాయామ ఉపాధ్యాయులుగా వచ్చేస్తున్నారు.

పాత పద్ధతిని తీసుకురావాలి..

పాత విధానం ప్రకారం 100 మార్కుల ప్రశ్నా పత్రంలో 70 మార్కులు థియరీకి ఉంటే, మిగిలిన 30 మార్కులు ఫిజికల్ ఫిట్‌నెస్, స్పోర్ట్స్ స్కిల్ టెస్ట్‌లు, క్రీడల్లో ఉన్న నైపుణ్యం తెలుసుకునేలా ప్రాక్టికల్స్ ఉండేవి. థియరీ పరీక్ష రాయడంతోపాటు, ఆటలు ఆడటం, ఆటలు ఆడగల సామర్థ్యం ఉందని నిరూపించుకోవడం, ఏదో ఒక క్రీడలో నైపుణ్యం కలిగి ఉంటే చాలన్నట్లుండేది. కానీ ప్రస్తుతం ఉన్న సిలబస్‌లో ఇవేమీ లేవు. ఈ పరిస్థితుల్లో జగన్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సిలబస్‌ను చంద్రబాబు గతంలో మాదిరిగానే మార్చాలని పలువురు కోరుతున్నారు. వచ్చే డీఎస్సీలోనూ 70 శాతం థియరీ, మిగిలిన 30 శాతం క్రీడలకు సంబంధించి ప్రాక్టికల్స్ ఉండేలా మార్పులు చెయ్యాలని వ్యాయామ ఉపాధ్యాయ సంఘాలు కోరుతు న్నాయి. జగన్ ప్రభుత్వంలో తీసుకొచ్చిన విధానంతో అథ్లెటిక్స్, వివిధ క్రీడలు, ఇండోర్, అవుట్‌డోర్ గేమ్స్‌లో ప్రతిభ చూపిన వారికి, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో ప్రతిభ చూపినవారికి అన్యాయమే జరుగుతుందని దీనిని మార్చాలని అభ్యర్థిస్తున్నాయి.

ముఖ్యమంత్రికి విన్నవిస్తాం

క్రీడల్లో ప్రావీణ్యం లేకపోయినా, కేవలం బయాలజీలోనో, ఇతర పాఠ్యాంశాల్లో నైపుణ్యం ఉన్నవారు పరీక్షల్లో ఉత్తీర్ణులై వ్యాయామ ఉపాధ్యాయులుగా ఎంపికైతే జరిగే నష్టాలపై ముఖ్యమంత్రి చంద్రబాబుకు వివరిస్తాం. జగన్ ప్రభుత్వం తీసుకొచ్చిన సిలబస్‌తో భావి క్రీడాకారులకు, ఔత్సాహికులకు తీరని నష్టమే జరుగుతుందని చెప్తాం. క్రీడలపై ఎటువంటి అనుభవం, ఏ ఆసక్తి లేనివారు వ్యాయామ ఉపాధ్యాయులైతే నష్టమే. రాష్ట్రం నుంచి జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే క్రీడాకారులే కరువయ్యే పరిస్థితి వస్తుంది. ఈ పరిస్థితుల్లో పాత పద్ధతినే వచ్చే డీఎస్సీలో అమలు చేయాలి.

- కరిముల్లాచౌదరి, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, విజయవాడ

30 కాదు.. 50 శాతం అవసరం

30 శాతం ప్రాక్టికల్స్ సరిపోదు. దానిని 50 శాతానికి పెంచాలి. ఈ మేరకు గతంలోనే మార్పులు చెయ్యాలని కోరాం. ఈ తరహాలో చేస్తేనే క్రీడలకు న్యాయం జరుగుతుంది. అంత నైపుణ్యం ఉన్నవారు వ్యాయామ ఉపాధ్యాయులు, అధ్యాపకులైతే మెరికల్లాంటి క్రీడాకారులు వెలుగులోకి వస్తారు. గత ప్రభుత్వం క్రీడలకు ఏమాత్రం ప్రాధాన్యం లేకుండా నీరుకార్చింది. క్రీడా పరికరాలు, మైదానాల మరమ్మతులకు నిధులు లేకుండా చేయడంతో క్రీడాకారులు నిరుత్సాహానికి గురయ్యారు. మంచి క్రీడాకారులను వెలుగులోకి తెచ్చేలా కొత్త క్రీడా విధానాన్ని తీసుకు రావాలి.

- ఎన్.వెంకటేశ్వరరావు, విశ్రాంత పీడీల సంఘం రాష్ట్ర నాయకులు, తెనాలి.



కల్యాణం.. వైభోగం

రఘువంశ రామయ్య.. సుగుణాల సీతమ్మ
వరమాలకై వేచె సమయాన..
శివధనువు విరిచాకె.. వధువు మది గెలిచాకె
మోగింది కల్యాణ శుభవేళ..
కల్యాణం.. వైభోగం.. శ్రీరామచంద్రుని కల్యాణం...

అన్నట్లుగా ఏకశిలానగరం పులకరించింది. శ్రీరామ నామస్మరణతో ఒంటిమిట్ట మార్మోగింది. ఆంధ్రా భద్రాద్రి, దక్షిణాది అయోధ్యగా పేరొందిన ఏకశిలానగిరి ఒంటిమిట్ట కోదండరామాలయంలో శ్రీరామనవమి వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శుక్రవారం నిండు వెన్నెలలో సీతారాముల కల్యాణాన్ని టీటీడీ ఆధ్వర్యంలో నభూతో నభవిష్యతి అన్న రీతిలో నిర్వహించారు. ముందుగా రామయ్యకు యజ్ఞోపవీతం, సీతమ్మకు స్వర్ణ కిరీటం కానుకగా అందించారు. ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దంపతులు అందించారు. స్వామివారి కల్యాణాన్ని చూసేందుకు భక్తులు విశేషంగా తరలి రావడంతో ఒంటిమిట్ట జనసంద్రంగా మారింది.



కళాకారుల నృత్యం





పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు తీసుకొస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దంపతులు



ఆలయ శిల్పకళను పరిశీలిస్తున్న సీఎం



ఎదుర్కోలు దృశ్యం



సీతారాముల కల్యాణం తిలకిస్తున్న చంద్రబాబు దంపతులు

ఉపాధి పనులలో బోగస్ మస్టర్లు వేస్తే చర్యలు

బల్లికురవ ప్రజా వేదికలో మంత్రి రవికుమార్

బల్లికురవ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకంలో బోగస్ మస్టర్లు వేస్తే సహించేది లేదని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ హెచ్చరించారు. శుక్రవారం బల్లికురవ మండల కేంద్రంలో ప్రజా సమస్యలు తెలుసుకొనేందుకు ప్రజా వేదిక కార్యక్రమం జరిగింది. ఈసభకు మంత్రి రవికుమార్, జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్ హాజరయ్యారు. ఈసందర్భంగా ప్రజల నుంచి మంత్రి రవికుమార్ అర్జీలను స్వీకరించారు. ప్రజా వేదికలో ఉపాధి హామీ పథకంపై పలు ఫిర్యాదులు వచ్చాయి. వెంటనే ఆశాఖ వారిని అయన పిలవగా వారు అందుబాటులో లేరు. అర గంట తరువాత వచ్చిన వారితో అయన మాట్లాడుతూ గ్రామాలలో కూలీలు పనులకు రాకుండా బోగస్ మస్టర్లు వేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని, గత వైసీపీ ప్రభుత్వంలో మాదిరిగా ఇంట్లో కుర్చొనే వారికి కూడా మస్టర్లు వేస్తే సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్ఎల్ గుడిపాడు గ్రామం నుంచి అత్యధికంగా రెవెన్యూ సమస్యలపై అర్జీలు రాగా మంత్రి వెంటనే ఈ గ్రామంలో సమస్యలపై అధికారులు పరిశీలన చేసి రైతులకు ఇబ్బందులు లేకుండా చేయాలని ఆదేశించారు. అలానే భూ సర్వేలో పలు లోపాలు ఉన్నాయని రైతులు తెలపగా వెంటనే పరిష్కరించాలని అయన కోరారు. ముక్తేశ్వరం గ్రామానికి చెందిన షేక్ జిలాని అనే వ్యక్తి తనకు తెలియకుండా తన ఇంటి స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయించుకొన్నారని ఫిర్యాదు చేయగా వెంటనే విచారణ జరిపించాలని అధికారులను కోరారు. విద్యార్థులు కళాశాలకు రావాలంటే బస్సులు సకాలంలో లేవని జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్ ఫిర్యాదు చేయగా వెంటనే మంత్రి ఆర్టీసీ అధికారులతో మాట్లాడి బస్సులు ఏర్పాటు చేయిస్తామని తెలిపారు. అనంతరం మండలంలోని 15 గ్రామాలకు చెందిన రైతులకు వ్యవసాయ యంత్రీకరణ పథకంలో భాగంగా సబ్సిడీపై రూ. 2.28 లక్షల విలువ చేసే 15 వ్యవసాయ పరికరాలను మంత్రి అందజేశారు. ఈ కార్యక్రమాలలో చీరాల ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు, ఎంపీడీవో కుసుమకుమారి, తహసీల్దార్ రవినాయక్, ఏవో కుమారి, మండల టీడీపీ నేతలు మలినేని గోవిందరావు, కొండేటి ఇజ్రాయల్, గొట్టిపాటి లక్ష్మయ్య, సర్పంచ్ పందిరి అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

పూలేకు ఘన నివాళులు

సామాజిక సంస్కరణలకు నాంది పలికిన మహనీయుడు మహాత్మా జ్యోతి రావు పూలే అని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. శుక్రవారం పూలే జయంతి సందర్భంగా అయన చిత్ర పటానికి మంత్రి రవికుమార్ పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు.

పలు కుటుంబాలకు మంత్రి పరామర్శ

మండలంలోని వల్లాపల్లి గ్రామంలో ఇటీవల గుండె పోటుతో మృతి చెందిన టీడీపీ నాయకుడు షేక్ ఖాశీంవలి కుటుంబ సభ్యులను మంత్రి గొట్టిపాటి రవికుమార్ శుక్రవారం పరామర్శించారు. అదే గ్రామంలో గొట్టిపాటి అంజయ్య భార్య అన్నపూర్ణమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబాన్ని మంత్రి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మంత్రి వెంట టీడీపీ నేతలు పాల్గొన్నారు.

యోగిరెడ్డి కుటుంబానికి మంత్రి పరామర్శ

అద్దంకి : మండలంలోని కొత్తరెడ్డిపాలెంలో మాజీ సర్పంచ్ సంగు యోగిరెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా కుటుంబసభ్యులను శుక్రవారం విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పరామర్శించారు. యోగిరెడ్డి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. టీడీపీ నేతలు చింతా వెంకటేశ్వరరెడ్డి, కరి పరమేష్, పోతిరెడ్డి శ్రీనివాసరెడ్డి, చాగంటి రాజేంద్ర తదితరులు ఉన్నారు.



బల్లికురవలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి రవికుమార్, జేసీ ప్రఖర్‌జైన్

నేడు మంత్రి రవికుమార్ పర్యటన వివరాలు

విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ శనివారం పలు కార్యక్రమాలలో పాల్గొననున్నారు. ఉదయం 10 గంటలకు బల్లికురవ సమీపంలోని ఈర్ల గంగమ్మ తిరుణాళ్ల సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. 10.30 గంటలకు పంగులూరు మండలం రేణింగవరం వద్ద జయ ఆగ్రోస్‌ను ప్రారంభించనున్నారు. 11.30 గంటలకు విజయవాడలోని ఎ కన్వెన్షన్‌లో జరిగే కార్యక్రమంలో పాల్గొననున్నారు.

అవీ..ఇవీ



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల ప్రిన్సిపాల్ మోహనరావు, అధ్యాపకులు

26 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపిక

అద్దంకిటౌన్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): జాబ్ డ్రైవ్‌లో కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన 26 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపిక అయ్యారు. శుక్రవారం ఒంగోలులోని దామచర్ల సక్కుబాయమ్మ ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాలలో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ సహకారంతో జాబ్ మేళా నిర్వహించారు. ఈ జాబ్ మేళాకు కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి 30 మంది విద్యార్థులు హాజరయ్యారు. కేఎల్. గ్రూప్ కంపెనీకి 22 మంది, జీజే సొల్యూషన్స్‌కు ఇద్దరు, ఇసుజు మోటార్స్‌కు ఇద్దరు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి. మోహనరావు తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్‌తో పాటు జేకేసీ కో ఆర్డినేటర్ డాక్టర్ ఎన్. షర్మిల రాణి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఏ. శిఖామణి, కెరీర్ గైడెన్స్ కోఆర్డినేటర్ బి. ఆశోక్, డి. గంగయ్య, జేకేసీ మెంటర్ రమేష్, కళాశాల అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.



సిబ్బందితో మాట్లాడుతున్న ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఇంజనీరింగ్) చెంగల్‌రెడ్డి

బస్‌ల నిర్వహణ ఎప్పటికప్పుడు పరిశీలిస్తుండాలి

● ఈడీ చెంగల్‌రెడ్డి

అద్దంకి, ఏప్రిల్11 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్‌ల కండీషన్‌ను మెకానిక్‌లు ఎప్పటికప్పుడు పరిశీలిస్తుండాలని ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(ఇంజనీరింగ్) చెంగల్‌రెడ్డి అన్నారు. అద్దంకి ఆర్టీసీ గ్యారేజ్‌ను ఈడీ చెంగల్‌రెడ్డి శుక్రవారం పరిశీలించి మెకానిక్‌లు, ఇతర సిబ్బందితో మాట్లాడారు. వారానికి రెండు సార్లు టైర్‌లు ఖచ్చితంగా చెక్ చేయాలన్నారు. బస్‌ల నిర్వహణలో క్లీనింగ్, వాషింగ్ కీలకం అన్నారు. కండక్టర్, డ్రైవర్ లు ప్రయాణికుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. గ్యారేజ్‌లో ఆయా విభాగాలను పరిశీలించి సిబ్బందితో ప్రత్యేకంగా మాట్లాడారు. మెకానిక్‌లు ఉత్తమ సేవలు అందిస్తున్న చెన్నేశ్వరరావు, రమణారెడ్డిలను ఈడీ చెంగల్‌రెడ్డి అభినందించారు. చీఫ్ ఇంజనీర్ వెంకటరమణ, డిపో మేనేజర్ రామ్మోహనరావు, అసిస్టెంట్ డీఎం మహబూబి తదితరులు ఉన్నారు.

రేపు కమ్మసేవాసమితి అన్నదాన సత్రం సభ్యుల సమావేశం

అద్దంకి, ఏప్రిల్11(ఆంధ్రజ్యోతి): శింగరకొండలోని కాకతీయ కమ్మసేవాసమితి అన్నదాన సత్రం సభ్యుల సమావేశం ఈ నెల 13 వ తేదీ ఉదయం 10 గంటలకు జరుగుతుందని అభివృద్ధి కమిటీ బాధ్యుడు, మాజీ జడ్పీటీసీ నందిరెడ్డి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు.గత నెలలో జరిగిన 70 వార్షిక తిరుణాళ్లకు సంబంధించి జమా, ఖర్చులు, ఇతర విషయాల పై చర్చిస్తామని తెలిపారు.

పన్ను వసూళ్లలో భేష్

ఆరేళ్లుగా రాష్ట్రస్థాయిలో అద్దంకి మున్సిపాల్టీకి ద్వితీయ స్థానం

అద్దంకి, ఏప్రిల్11(ఆంధ్రజ్యోతి): అద్దంకి మున్సిపాలిటీ గత ఆరేళ్లుగా పన్ను వసూళ్లలో ద్వితీయ స్థానం పొందుతూ రాష్ట్ర ఉన్నతాధికారుల అభినందనలు పొందుతున్నారు. 2011లో అద్దంకి నగరపంచాయతీగా ఏర్పడింది. అనంతరం 2022 లో మున్సిపాలిటీగా మారింది. అయితే పన్ను వసూళ్లలో నగరపంచాయతీ గా ఉన్న సమయంలో ఉమ్మడి ప్రకాశంలో, బాపట్ల జిల్లా ఏర్పడ్డ తరువాత జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలుస్తూనే ఉంది. ఇక రాష్ట్ర స్థాయిలో గత 6 సంవత్సరాలుగా ద్వితీయ స్థానంలో ఉంటోంది. పన్ను వసూళ్లపై సిబ్బంది, అధికారులు ఏడాది పొడవునా ప్రత్యేక దృష్టి సారించటంతో పాటు, జనవరి నుంచి మార్చి నెల చివర వరకు మున్సిపల్, సచివాలయ సిబ్బంది ఇంటింటికీ తిరిగి పన్ను చెల్లింపు వివరాలను వివరిస్తున్నారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయటం కూడా పన్ను వసూలుకు మరింత దోహదపడుతుంది. దీంతో చెల్లింపుదారులు కూడా స్వచ్ఛందంగా ముందుకు వచ్చి చెల్లిస్తున్నారు. అదే సమయంలో ఇంటి పన్ను చెల్లింపు లో ప్రభుత్వం కల్పించే రాయితీని అత్యధిక శాతం మంది సద్వినియోగం చేసుకుంటుండటంతో పన్ను వసూళ్లలో అగ్ర భాగంలో నిలిచేందుకు దోహదపడుతోంది. గత మూడు సంవత్సరాలలో పన్ను వసూళ్లు పరిశీలిస్తే 2022-23 సంవత్సరంలో రూ. 4.24 కోట్ల రూపాయలు డిమాండ్ కాగా రూ. 3.81 కోట్లు (90 శాతం)వసూలు చేశారు. 2023-24 సంవత్సరంలో 4.13 కోట్ల రూపాయల డిమాండ్ కాగా 3.05 కోట్ల రూపాయలు(74శాతం), 2024-25 సంవత్సరంలో 4.71 కోట్ల రూపాయలు డిమాండ్ కాగా 4.12 కోట్ల రూపాయలు(87.45 శాతం)వసూలు చేశారు. నీటి పన్నులు, ఖాళీ స్థలాల పన్నులు, ప్రభుత్వ కార్యాలయాల పన్నులు వసూలుపై కూడా ప్రత్యేక దృష్టి సారిస్తుండటంతో ఎక్కువ శాతం పన్ను వసూలు జరుగుతోంది. గురువారం విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి వర్క్‌షాప్‌లో పన్ను వసూళ్లలో రెండవ స్థానంలో అద్దంకి మున్సిపాలిటీ నిలిచిన సందర్భంగా అద్దంకి మున్సిపల్ కమిషనర్ రవీంద్ర ను మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ సంపత్, సెక్రటరీ సురేష్‌లు అభినందించి అవార్డు అందజేశారు.



అద్దంకి మున్సిపల్ కార్యాలయం



అందరి సహకారంతో పన్నుల వసూలు

- రవీంద్ర, మున్సిపల్ కమిషనర్,అద్దంకి

అద్దంకి పట్టణ ప్రజలతో పాటు మున్సిపల్ సిబ్బంది, అధికారుల సహకారంతో పన్ను వసూళ్లలో అద్దంకి మున్సిపాలిటీ రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచింది. గత 6 సంవత్సరాలుగా క్రమం తప్పకుండా ద్వితీయస్థానంలో వస్తోంది. చెల్లింపుదారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రత్యేక కౌంటర్‌లు కూడా ఏర్పాటు చేశాం. ప్రజలు ఎక్కువ భాగం స్వచ్ఛందంగా వచ్చి చెల్లిస్తుండటంతో ఎక్కువ మొత్తం పన్ను వసూలు జరిగింది.



డిపో వద్ద నిరసన తెలుపుతున్న నేషనల్ మజ్దూర్ యూనియన్ ప్రతినిధులు

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలపై నిరసన

చీరాల, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కోరుతూ మధ్యాహ్నం భోజన విరామ సమయంలో డిపో వద్ద నిరసన చేపట్టారు. ఈసందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ అక్రమంగా ఉద్యోగులను వేధించి సస్పెండ్ చేయడం, సర్వీసుల నుంచి తొలగించడం నిలిపి వేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ ప్రతినిధులు దయబాబు, రవిబాబు, గాంధీ, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అపరిష్కృత సమస్యలు పరిష్కరించాలి

అద్దంకి : ఆర్టీసీ ఉద్యోగుల అపరిష్కృత సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఎన్ఎంయూ డిపో చైర్మన్ సుబ్రహ్మణ్యం అన్నారు. సమస్యల పరిష్కారం కోసం ఆ యూనియన్ ఆధ్వర్యంలో రెండవ రోజు శు క్రవారం గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిపో సెక్రటరీ వందనం బాబు, అంజి, రహ్మతుల్లా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉరుసు వేడుకలు

భారీగా భక్తుల రాక

పరిశీలించిన డీఎస్పీ రామాంజనేయులు

భారీగా పోలీసు బందోబస్తు

మార్టూరు,ఏప్రిల్11(ఆంధ్రజ్యోతి): షేక్ హజరత్ కరిముల్లాషావలి 49 వ ఉరుసు వేడుకలు శుక్రవారం ఉదయం మార్టూరులో కొణిదెనరోడ్‌లో దర్గా వద్ద ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా గన్నవరం రోడ్ నుంచి మినీ అండరుపాస్ ద్వారా కొణిదెనరోడ్ లో ఉన్న దర్గా వరకు ప్రత్యేకంగా విద్యుత్ దీపాలంకరణ చేశారు. అదేవిధంగా దర్గాలో స్వామి వారిని ప్రత్యేకంగా పూలతో అలంకరణ చేశారు. గన్నవరం రోడ్‌లో పెద్ద కటౌట్ ను ఏర్పాటుచేశారు.కొణిదెన రోడ్‌లో విద్యుత్ దీపాలంకరణతో ప్రభను ఏర్పాటుచేశారు. ఇంకా రోడ్డుకు ఇరువైపులా దుకాణాలు, పక్కనే రంగుల రాట్నాలతో దర్గావరకు రాత్రి సమయంలో ప్రత్యేక ఆకర్షణగా కనిపించింది. రాత్రి 8 గంటల నుంచి దర్గాలో స్వామి వారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులతో రద్దీ మొదలయ్యింది. దర్గాను సందర్శించుకున్న భక్తులు కొబ్బరికాయలు కొట్టి సాంబ్రాణి కడ్డీలను వెలిగించి భక్తి ప్రపత్తులతో స్వామి వారిని దర్శించుకున్నారు. డీఎస్పీ జి. రామాంజనేయులు రాత్రి ఉరుసు మహోత్సవం జరిగిన కొణిదెన రోడ్‌ను పరిశీలించారు.భక్తులు ప్రశాంతంగా ఉరుసు వేడుకలలో పాల్గొనేలా, ఎలాంటి అవాంఛనీయసంఘటనలు జరగకుండా బందోబస్తుపై సీఐ శేషగిరిరావు, సంతమాగులూరు సీఐ వెంకట్రావులకు పలు సూచనలు చేశారు. అదేవిధంగా మార్టూరు,యద్దనపూడి, సంతమాగులూరు, బల్లికురవ ఎస్ఐలతో పాటు,ఏఎస్ఐబాషా, పలువురు పోలీసులు ,హోంగార్డులు ,మహిళా పోలీసులు దాదాపుగా 60 మంది బందోబస్తు నిర్వహించారు.



మార్టూరులో దర్గా వద్ద పూలతో ప్రత్యేక అలంకరణ



ఉరుసు సందర్భంగా విద్యుత్ దీపాలతో ఏర్పాటు చేసిన ప్రభ

ఉప్పుటూరులో అట్టహాసంగా ఎడ్ల బలప్రదర్శన పోటీలు

ఉప్పుటూరు(పర్చూరు), ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి పోలురాధ ఎడ్ల బల ప్రదర్శన పోటీలకు పర్చూరు మండలం ఉప్పుటూరు గ్రామం వేదికగా నిలిచింది. గ్రామంలోని శ్రీ వేంకటేశ్వర, చెన్నకేశవ స్వామివార్ల తిరునాళ్ల సందర్భంగా ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి ఎడ్ల బలప్రదర్శన పోటీలను శుక్రవారం వెల్లటూరి మల్లికార్జునరావు సారథ్యంలో అట్టహాసంగా ప్రారంభించారు. తొలిరోజు సీనియర్ విభాగానికి నిర్వహించిన పోటీలో వివిధ జిల్లాల నుంచి 10 జతల ఎడ్లు పాల్గొన్నాయి. మొదటి బహుమతిగా రూ.55,000, ద్వితీయ బహుమతిగా రూ.35,000, తృతయ బహుమతి రూ.20,000, నాల్గవ బహుమతి రూ.15వేల చొప్పున అందజేయనున్నట్లు కమిటీ ప్రతినిధులు మువ్వా అంజయ్య, కొమ్మనబోయిన రాఘవయ్య తెలిపారు. ఫ్లడ్ లైట్‌ల మధ్య పోటీలు ఉల్లాసభరితంగా సాగుతున్నాయి. పోటీలను తిలకించేందుకు వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో పశుపోషకులు, ప్రజలు తరలి రావటంతో గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా కమిటీ ప్రతినిధులు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు.



ఉప్పుటూరులో రాష్టస్థాయి పోలు రాధ ఎడ్ల బలప్రదర్శనలో సత్తా చాటుతున్న ఎడ్లు

మార్టూరులో విత్తనాల షాపుల తనిఖీ

మార్టూరు,ఏప్రిల్11(ఆంధ్రజ్యోతి): మార్టూరులో విత్తనాల షాపులను రాష్ట్ర స్థాయి తనిఖీ బృందం అధికారులు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీ బృందం అధికారులు సహాయ వ్యవసాయ సంచాలకులు డాక్టర్ బాల భాస్కర్, వ్యవసాయ అధికారి జి. మోహన్ ల ఆధ్వర్యంలో కావేరిసీడ్ కంపెనీ, శ్రీసత్యబయోటెక్ ,అమర్ బయోటెక్ కంపెనీల విత్తనాలను పరీక్షించి హెర్బిసైడ్ టోలరెంట్ పరీక్షలను నిర్వహించారు. అదేవిధంగా పత్తి బీటీ హైబ్రిడ్ స్టాక్‌ను, స్టాక్ రిజిస్టర్‌ను,ఇన్వాయిస్ రశీదులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో మార్టూరు సహాయ వ్యవసాయ సంచాలకులు శ్రీనివాసరావు, అద్దంకి వ్యవసాయ అధికారి కె. వెంకటకృష్ణ ,మార్టూరు వ్యవసాయ అధికారి అంజిరెడ్డి లు పాల్గొన్నారు.

బీటీ పత్తి విత్తనాలపై షాపులలో తనిఖీలు

అద్దంకిటౌన్ : అద్దంకిలోని పలు విత్తనాల షాపులను శుక్రవారం రాష్ట్ర స్థాయి తనిఖీ బృందం పరిశీలించింది. సహాయ వ్యవసాయ సంచాలకులు డాక్టర్ బాల భాస్కర్, వ్యవసాయ అధికారి జి. మోహన్ తదితరులు ఆయా షాపులలోని బీటీ పత్తి విత్తనాల రకాలల్లో నిషేధించిన హెర్బిసైడ్ ట్రైట్‌కి సంబంధించిన పత్తి విత్తనాలు షాపులలో ఉన్నాయా అని పరిశీలించారు.



మార్టూరులో విత్తనాల షాపులో తనిఖీలు చేస్తున్న రాష్ట్ర బృందం సభ్యులు



బీసీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాల మంజూరు పత్రాలను లబ్ధిదారులకు అందజేస్తున్న ఎంపీడీవో సింగయ్య

సబ్సిడీ రుణాలతో ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

అద్దంకిటౌన్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందించే రాయితీ రుణాలను లబ్ధిదారులు సద్వినియోగపర్చుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఎంపీడీవో బత్తిన సింగయ్య సూచించారు. శుక్రవారం బాపట్లలో జరిగిన పూలే జయంతి కార్యక్రమంలో లబ్ధిదారులకు మంజూరు పత్రాలను ఆయన అందజేశారు. అద్దంకి మండలంలో నలుగురు లబ్ధిదారులకు బీసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు మంజూరు అయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ భరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గడ్డి పెంపకానికి నిధులు


మండలంలోని 80 మంది రైతులకు జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా గడ్డి పెంపకం కోసం నిధులు మంజూరు చేశామని ఎంపీడీవో సింగయ్య తెలిపారు. రైతులు తమ పొలంలో పశువుల మేత కోసం గడ్డి పెంచుకునేందుకు ఒక్కొక్కరికి 33వేల రూపాయలు ఆర్థికసాయం అందిస్తున్నామని తెలిపారు.



డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న ఏపీఎం, సీసీలు

స్త్రీ నిధి రుణాల రికవరీలో చినగంజాం మండలం ప్రథమ స్థానం

చినగంజాం, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి) : స్త్రీనిధి రుణాలు ఇవ్వడంలోను, రికవరీలో జిల్లాలోనే చినగంజాం మండలం ప్రథమ స్థానం సాధించింది. డీఆర్‌డీఏ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమీక్షా సమావేశంలో పీడీ .శ్రీనివాసరావు స్త్రీనిధి రుణాలు, రికవరీలు వంద శాతం ఉండటంతో మండల సమాఖ్య జిల్లాలో ప్రథమ స్థానంలో ఉన్నట్లు వెల్లడించారు. జిల్లాలో మండల సమాఖ్య ప్రథమ స్థానం సాధించడంతో ఏపీఎం గద్దె పెదసుబ్బారావు, సీసీలు కె.వెంకటస్వామి, శ్రీలక్ష్మి, మాధవిలకు పీడీ ప్రశంసాపత్రాలు అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ 2024-2025 ఆర్థిక సంవత్సరానికి స్త్రీనిధి రుణాల లక్ష్యం రూ.7కోట్ల రూపాయిలు ఇవ్వగా, రూ.9కోట్ల 56లక్షల రూపాయిల రుణాలు మంజూరు చేసినట్లు తెలిపారు. ఇచ్చిన రుణాలను వందశాతం రికవరీ చేసినట్లు తెలిపారు.



ఉష్ణోగ్రత వివరాలు

కేంద్రం	గరిష్టం	కనిష్టం
నెల్లూరు	37.8	26.7
కావలి	37	27
ఆత్మకూరు	39	28
ఉదయగిరి	38	27
కందుకూరు	39	28



హనుమంతుడిపై జానకీరాముడి వైభోగం

తన ఇష్టమైన హనుమంతుడిపై విహరిస్తూ శ్రీరామచంద్రుడు భక్తులకు దర్శనం ఇచ్చారు. నగరంలోని శబరి శ్రీరామక్షేత్రంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలు శుక్రవారం మూడవ రోజుకు చేరుకున్నాయి. ఉదయం హోమం, బలిహరణ, ఉత్సవమూర్తులకు అభిషేకాలు, తిరుమంజనం వంటి పూజలు జరిగాయి. సాయంత్రం బ్యాండు కచేరీ, హోమం, బలిహరణలు జరగ్గా భక్తులు తరలివచ్చారు. రాత్రి హనుమంతుడిపై కొలువుదీరిన జానకీరాముడు వీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. విశేష పూలంగిసేవ, మంగళవాయిద్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, భారీ విద్యుద్దీకరణలతో ఉత్సవం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా కూచిపూడి భరతనాట్యం, జానపద నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమాలకు రామ్‌నగర్ భక్త బృందం, తదితరులు పాల్గొన్నారు.

- నెల్లూరు (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి)

కళ్యాణం కమనీయం

మంగళవాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ బుచ్చిరెడ్డిపాళెం పెద్దూరులో కోదండరాముడి కల్యాణం కనులపండువగా జరిగింది. సీతా లక్ష్మణ సమేత కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా జరిగిన ఈ వేడుకను కనులారా వీక్షించేందుకు భక్తజనం తరలివచ్చింది. ముందుగా ఆలయ సంప్రదాయాలతో మంగళ మేళాలు, వేదమంత్రాలు, రామనామ స్మరణల నడుమ స్వామి, అమ్మ వార్లను వివాహ వేదిక మీద కొలువు దీర్చారు. అనంతరం వివాహఘట్టాన్ని శోభాయమానంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త దొడ్ల మురళి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం గజవాహనంపై స్వామివారు ఊరేగారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం కోదండరాముడు రథంపై విహరించనున్నారు.

- బుచ్చిరెడ్డిపాళెం, (ఆంధ్రజ్యోతి)



బుచ్చిలో కోదండరాముడి వివాహాన్ని జరిపిస్తున్న పండితులు

రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా నెల్లూరు జిల్లాకు ప్రత్యేక సీజన్ ఎడగారు. దీనినే ముందస్తు ఖరీఫ్ సీజన్ అని కూడా అంటారు. అలాంటి ఈ సీజన్‌లో వ్యవసాయ సాగు, నీరు తదితర అంశాలపై వ్యవసాయ శాఖ యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేసింది. విత్తనాలు, ఎరువుల విషయంలో రైతులు ఇబ్బందిపడకుండా ఇప్పటికే అన్ని చర్యలు తీసుకుంటు న్నారు. మరో నెలలో ప్రారంభమయ్యే సీజన్‌లో పంటలు సాగుకు రైతులు కూడా పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు.

- నెల్లూరు (వ్యవసాయం, ఆంధ్రజ్యోతి)



ఎడగారు.. షురూ!

- 3.5 లక్షల ఎకరాల్లో పంటల సాగు
- వ్యవసాయ శాఖ యాక్షన్‌ప్లాన్ సిద్ధం
- 90 వేల క్వింటాళ్ల విత్తనాలు అవసరం
- 94,700 మెట్రిక్ టన్నుల ఎరువులు

జిల్లాలో సోమశిల రిజర్వాయర్‌లో నీరు పుష్కలంగా ఉంది. తాగు, సాగునీటికి సంబంధించిన అంచనాలు ఇప్పటికే తయారయ్యాయి. ఎడగారు సీజన్‌కు సంబంధించి దాదాపు 3.3 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని వ్యవసాయ శాఖ అంచనా. అదేవిధంగా వ్యవసాయ బోర్లు, బావుల పరిధిలో మరో 20 వేల ఎకరాలకు నీరందుతాయి.

● 90 వేల క్వింటాళ్ల విత్తనాలు

ఎడగారు సీజన్‌కు 90వేల క్వింటాళ్ల విత్తనాలు అవసరం అవుతాయని అంచనా. అయితే 45 నుంచి 50 శాతం విత్తనాలను రైతులు రైతుల నుంచే సేకరించుకుం టారని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. మిగిలిన 50 శాతం రైతులకు అందుబాటులో విత్తనాలు ఉంచేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే జిల్లాలో కేఎన్ఎం 1638 రకం విత్తనాలు 63091 క్వింటాళ్లు, బీపీటీ 2270 రకం 875 క్వింటాళ్లు, కేఎన్ఎం 733 రకం 1394, ఎంటీయూ 1010 రకం 2276, బీపీటీ 5204 రకం 4844, ఆర్ఎన్ఆర్ 15048 రకం 5328, ఎన్ఎల్ఆర్ 34449 రకం 2217, ఎంటీయూ 1271 రకం 2077, ఎన్ఎల్ఆర్ 33892 రకం 1495 క్వింటాళ్లతోపాటు మరికొన్ని రకాల విత్తనాలు మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి. రైతుల అవసరాన్ని బట్టి పక్క రాష్ట్రాల నుంచి కూడా తీసుకువచ్చేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నారు.

ఎలాంటి ఇబ్బందీ లేదు



ఎడగారు సీజన్‌లో అవసరమైన విత్తనాలు, ఎరువులు సిద్ధం చేస్తున్నాం. రైతుల అవసరాన్ని బట్టి తెలంగాణ నుంచి కూడా విత్తనాలు తీసుకొస్తాం. ఏప్రిల్ 15 నుంచి నారుమళ్లు సిద్ధం చేసుకుని మే 15లోగా నాట్లు వేసుకుంటే మంచిది. ఆగస్టులో పంట చేతికొస్తుంది. అక్టోబరులో రెండో పంటకు సిద్ధం చేసుకోవచ్చు. ఈ లెక్కన ప్రతి నెల రైతులకు అవసరమైన ఎరువులను లెక్కగట్టి అందుబాటులో ఉంచేందుకు అన్ని ప్రణాళికలు రూపొందించాం. కెఎన్ఎం 1638, ఎన్ఎల్ఆర్ 34449, ఎన్ఎల్ఆర్ 3354 (ధాన్యరాశి), ఎన్ఎల్ఆర్ 4024 (శ్వేత, సుగంధ), ఎన్ఎల్ఆర్ 8238 (జింక్ వరి) రకాలను రైతులు సాగుచేసే అవకాశం ఉంది. వీటికి అందుబాటులో ఉంచాలని ఇప్పటికే విత్తన తయారీదారులు, హోల్‌సేల్ వ్యాపారులకు సూచించాము. ఎంటీయూ 1010 రకానికి కూడా మార్కెట్‌లో మంచి ధర పలుకుతుండటంతో దాన్ని కూడా అందుబాటులో ఉంచేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం.

- పి.సత్యవాణి, జిల్లా వ్యవసాయాధికారి

● 94,700 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం

ఎడగారు సీజన్‌లో జిల్లాకు 94700 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమవుతాయని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఏప్రిల్ నెలలో 7,512, మేలో 15,723, జూన్‌లో 23,451, జులైలో 18,313, ఆగస్టులో 11,109, సెప్టెంబరులో 18,595 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమవుతాయని ప్రణాళికలు సిద్ధం చేసింది. ఈ లెక్కన యూరియా 38,500, డీఏపీ 10,780, ఎంఒపి 10చ010, కాంప్లెక్స్ 30,796, ఎస్ఎస్‌పి 4620 మెట్రిక్ టన్నులు అవసరం ఉంది.

ఉత్కంఠకు నేటితో తెర!

- నేడు ఇంటర్ ఫలితాలు విడుదల
- ఉదయం 11 గంటలకు ఆన్‌లైన్‌లో వెల్లడి

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : ఎప్పుడెప్పుడా అని ఇంటర్ విద్యార్థులు ఎదురుచూస్తున్న రోజు రానేవచ్చింది. శనివారం ఉదయం 11 గంటలకు ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాలు ఒకేసారి ఆన్‌లైన్‌లో విడుదల చేస్తున్నట్లు ఇంటర్‌బోర్డు అధికారులు తెలిపారు. ఈ ఏడాది మార్చి 1 నుంచి 20వ తేదీ వరకు ఇంటర్ పరీక్షలు జరిగాయి. జిల్లాలో జూనియర్ ఇంటర్‌లో జనరల్ విభాగంలో 26,931, ఒకేషనల్ 1245 మంది కలిపి 28,176 మంది, సీనియర్‌లో జనరల్ విభాగంలో 23,994, ఒకేషనల్‌కు 1030 మంది కలిపి 25,024 మంది పరీక్షలకు హాజరయ్యా రు. అనంతరం రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి నెల్లూరుకు చేరిన 3.54 లక్షల జవాబు పత్రాలను అత్యంత భద్రత నడుమ మూల్యాంకనాన్ని మార్చి 17వ తేదీ ప్రారం భించారు. నాలుగు విడతలుగా ఏప్రిల్ 4వతేదీ నాటికి స్పాట్‌ను పూర్తి చేశారు. స్పాట్‌లో విధులు నిర్వహించేందుకు అన్ని సబ్జెక్టులకు కలిపి 1200 మంది అధ్యాపకులను నియమించారు. స్పాట్‌ను పూర్తి చేసి జవాబు పత్రాలను కట్టుదిట్టమైన భద్రతనడుమ విజయవాడలోని ఇంటర్‌బోర్డు కార్యాలయానికి తరలించారు. శనివారం విడుదల కానున్న ఫలితాల్లో విద్యార్థులకు సంబంధించిన మార్కులే విడుదల కానున్నాయి. ఎవరికెన్ని మార్కులు వస్తాయోనని కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలు సైతం ఎవరికివారు లెక్కలు వేసుకుంటున్నారు. ఈ ఏడాది టెన్త్, ఇంటర్ హాల్‌టికెట్లు విడుదల చేసినట్లుగానే వాట్సప్ గవర్నెన్స్ ద్వారా ఫలితాలు కూడా విడుదల చేసేందుకు సన్నాహాలు చేసినట్లు ఆర్ఐఓ డాక్టర్ ఎ.శ్రీనివాసులు తెలిపారు. వాట్సప్ నెం.9552300009 ద్వారా లేదా బీఐఈఏపీ అధికారిక వెబ్‌సైట్ resultsbie.ap.gov.in ద్వారా ఫలితాలు చూసుకోవచ్చన్నారు.





పూలే దంపతుల విగ్రహాలకు నివాళులర్పిస్తున్న మంత్రి ఆనం, కలెక్టర్ ఆనంద్, జేసీ కార్తీక్ తదితరులు

విద్యకు ప్రాధాన్యత ఇచ్చిన

సంఘసంస్కర్త 'పూలే'

- ఆయన బాటలోనే ఎన్డీఏ కూటమి ప్రభుత్వం
- బీసీల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం
- జ్యోతిబా పూలే జయంతిలో మంత్రి ఆనం

నెల్లూరు (హరనాదపురం), ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : విద్యతోనే పేదల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చిన గొప్ప సంఘసంస్కర్త మహాత్మా జ్యోతిబా పూలే అని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి కొని యాడారు. శుక్రవారం ఉదయం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన పూలే జయంతి సభలో మంత్రి పాల్గొని మాట్లాడారు. అంతక ముందు నగరంలోని పూలే దంపతుల విగ్రహాలకు మంత్రితోపాటు కలెక్టర్ ఆనంద్, జేసీ కార్తీక్ తదితరులు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సంద ర్భంగా కలెక్టరేట్‌లో మంత్రి మాట్లాడతూ పూలే చూపిన బాటలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేస్తూ పేద వర్గాల సంక్షేమానికి అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి విద్యలో అనేక సంస్కరణలు తీసుకొచ్చి ప్రతి కుటుంబానికి విద్యను అందించాలనే లక్ష్యంతో తమ ప్రభుత్వం పని చేస్తోందని అన్నారు. ఆత్మకూరులో బీసీ బాలికల జూనియర్ కళాశాలను ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. బీసీ ప్రొటెక్షన్ యాక్ట్ రూపొందించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. త్వరలో నిర్వహించనున్న మెగా డీఎస్సీ పరీక్షల్లో విజయం సాధించేలా బీసీ యువతకు బీసీ స్టడీ సర్కిళ్ల ద్వారా ఉచిత డీఎస్సీ కోచింగ్ ఇప్పిస్తున్నట్లు చెప్పారు. రూ.5.27కోట్లుతో నెల్లూరులో బీసీ భవన్ పూర్తికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా జిల్లాలో 500 మంది బీసీ యువతకు స్వయం ఉపాధి పథకాల కింద రూ.11.4 కోట్ల సబ్సిడీ రుణాల మెగా చెక్కును మంత్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ మాజీ చైర్మన్ చెంచలబాబు యాదవ్, జిల్లా బీసీ సంక్షేమ అధికారి వెంకటలక్ష్మమ్మ, బీసీ కార్పొరేషన్ ఈడీ నిర్మలాదేవి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివా సులు, బీసీ సంఘ నాయకులు, బీసీ సంక్షేమ శాఖ అధికారులు పాల్గొన్నారు.

అకాల వర్షం.. తడిసిన ధాన్యం

వెంకటాచలంలో రైతన్నకు అపారనష్టం

వెంకటాచలం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : గురువారం అర్ధరాత్రి కురిసిన అకాల వర్షం రైతులకు తీవ్ర నష్టాన్ని కలిగించింది. మండలంలోని తాటిపర్తిపాళెంలో కల్లాల్లో ఆరబోసిన వందల పుట్ల ధాన్యం తడిసి ముద్దయ్యింది. అంతేగాక ఇస్కపాళెం, ఈదగాలి, పూడిపర్తి గ్రామాల్లోనూ ధాన్యం తడిసిపోయింది. తాము ఎంతో కష్టపడి పండించిన పంట నీటిపాలైందని రైతులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. అధికారులు తమను అన్నివిధాలుగా ఆదుకోవాలని కోరుతున్నారు.

● రైతుకు అండగా ఉంటాం : సోమిరెడ్డి

ఇస్కపాళెం, ఈదగాలి, తాటిపర్తిపాళెం, పూడిపర్తి గ్రామాల్లో తడిసిన ధాన్యాన్ని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షానికి సుమారు 10 వేల పుట్ల ధాన్యం తడిచిపోయిందన్నారు. కష్టాల్లో ఉన్న రైతుకు అండగా ఉంటా మని, జరిగిన నష్టాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రైతులకు న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట మండల వ్యవసాయ శాఖాధికారి హరికరుణాకర్‌రెడ్డి, తెలుగురైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావూరి రాధాకృష్ణమ నాయుడు, సర్వేపల్లి కెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ చల్లా నాగార్జున్‌రెడ్డి, టీడీపీ నేతలు, రైతులు తదితరులు ఉన్నారు.



వెంకటాచలం : కల్లాల్లో తడిసిన ధాన్యాన్ని బయటకు తీస్తున్న రైతులు

● సీతారామపురం : గురువారం రాత్రి ఈదురుగాలులతో కూడిన వర్షం కురవడంతో సీతారామపురంలోని తోట కాలనీ వద్ద రహదారిపై తుమ్మ చెట్టు కూలిపోయింది. దీంతో వాహనదారులు తీవ్ర అవస్థలు పడగా, అధికారులు స్పందించి చెట్టును తొలగించి, ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

● లింగసముద్రం : ఉరుములు, మెరుపులతో కురిసిన అకాల వర్షానికి, పిడుగపాటుకు మండలంలో విద్యుత్ వ్యవస్థ దెబ్బతింది. మూడు ప్రాంతాల్లో పిడుగులు పడగా, జంపాలవారిపాలెం ఎస్సీ కాలనీ వద్ద, జంగంరెడ్డిపాలెం బస్టాండ్ సమీపంలో చెట్ల కొమ్మలు విరిగిపడి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మొగిలిచెర్ల, వెంగళాపురం గ్రామాల సమీపంలో పిడుగులు పడి మూడు చోట్ల విద్యుత్ స్తంభాలకు చెందిన ఇన్సులేటర్లు పగిలిపోయాయి. దీనికితోడు రాళ్లపాడు-రోళ్లపాడు మంచినీటి పథకానికి విద్యుత్ సరఫరా చేసే ట్యూబులేషన్ కేబుళ్ళు కాలిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. విద్యుత్ ఏఈ షేక్ ఫిరోజ్, సిబ్బంది యుద్ధప్రాతిపదికన చెట్ల కొమ్మలు తొలగించి, విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.



లింగసముద్రం : రాళ్లపాడు ప్రాజెక్టు వద్ద ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతు చేస్తున్న విద్యుత్ శాఖ సిబ్బంది

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	111
స్కిన్ చికెన్	200
స్కిన్‌లెస్	222

కోడిగుడ్ల ధర (100): 420

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

కావలి రూరల్, ఏప్రిల్11(ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగంగా ఉంటామని ఎమ్పీడీవో శ్రీదేవి తెలిపారు. శుక్రవారం మన్నంగిదిన్నె పంచాయతీలోని చెత్త సేకరణ కేంద్రాన్ని పరిశీలించి మాట్లాడారు. చెత్తను రోడ్లపై వేయకుండా తడి, పొడి చెత్తను వేరు చేయాలని చెత్త సేకరణకు ఇళ్ల వద్దకు వచ్చే గ్రీన్ అంబాసిడర్లు, గ్రామస్థులకు సూచించారు. అనంతరం చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించి చెత్త బుట్టలను స్థానికులకు అందజేశారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ సమద్, పంచాయతీ కార్యదర్శి గీత, గ్రీన్ అంబాజిడర్లు పాల్గొన్నారు.



సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎమ్పీడీవో

న్యూస్ బాక్స్

21న ప్రవేశ పరీక్ష

లింగసముద్రం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మారెడ్డిపాలెం ఏపి మోడల్ స్కూల్‌లో ఈనెల 20వ తేదీ జరగాల్సిన 6వ తరగతి ప్రవేశ పరీక్ష 21వ తేదీకి మార్పు చేసినట్లు ప్రిన్సిపాల్ షేక్ మహమ్మద్ హస్తార్ శుక్రవారం తెలిపారు. 20వ తేదీ ఈస్టర్ పర్వదినం సందర్భంగా పరీక్షను 21వ తేదీకి మార్పు చేశారని ఆయన తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

లింగసముద్రం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మొగిలిచెర్ల, లింగసముద్రం, చినపవని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ల పరిధిలో శనివారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని కందుకూరు రూరల్ ఏడీఈ విజయ్‌బాబు, మండల విద్యుత్ ఏఈ షేక్ ఫిరోజ్‌లు శుక్రవారం ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ఆయా సబ్‌స్టేషన్‌లలో మెయింటెనెన్స్ పనులు చేయడం, అలాగే వాటి పరిధిలోని గ్రామాలలోని విద్యుత్ లైన్ల కింద ఉన్న చెట్ల కొమ్మలు కొట్టడం జరుగుతుందన్నారు. వినియోగదారులు గమనించాలని వారు కోరారు.

● కలిగిరి, (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విద్యుత్‌లైన్ల మరమ్మతుల దృష్ట్యా ఉదయం 9గంటల నుండి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు అందుకు ప్రజలు సహకరించాలని ఏఈ దినేష్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

● కావలి రూరల్, (ఆంధ్ర జ్యోతి): మండలంలోని గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాకు అంత రాయం ఏర్పడుతుందని ట్రాన్స్ కో రూరల్ ఏఈ శ్రీనివాసులు రెడ్డి శుక్రవారం ఓప్రకటనలో పేర్కొన్నారు. 33కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు, లైన్ల కింద చెట్ల కొమ్మలు తొలగింపులో భాగంగా ఉదయం 8గంటల నుండి మధ్యాహ్నం 2గంటల వరకు సరఫరా నిలిపివేస్తామన్నారు.

విద్యతోనే ఉన్నత శిఖరాలు

కావలి రూరల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ విద్యతో విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని రుద్రకోట పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సుశీల్ కుమార్ ప్రియ తెలిపారు. పట్టణంలోని విశ్వోదయ బాలికల పాఠశాలలో జరుగుతున్న పాలిసెట్ శిక్షణ కేంద్రాన్ని శుక్రవారం పరిశీలించి మాట్లాడారు. ఇటీవల రుద్రకోట పాలిటెక్నిక్ కళాశాల ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్‌శాఖకు జాతీయ ప్రమాణాల గుర్తింపు లభించిందన్నారు. అనంతరం విద్యార్థులకు ఉచిత స్టడీ మెటీరియల్ అందజేశారు.

6వ తరగతి ప్రవేశ పరీక్ష 21వ తేదీకి వాయిదా

కందుకూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జీ మేకపాడు ఏపీ మోడల్ స్కూల్‌లో 6వ తరగతి ప్రవేశ పరీక్షలు వాయిదా పడినట్లు ప్రిన్సిపాల్ దాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 20వ తేదీన జరగాల్సిన పరీక్ష ఈస్టర్ పండుగ సందర్భంగా 21కి వాయిదా వేసినట్లు తెలిపారు.

'వంచన' పుస్తకం ఆవిష్కరణ

కావలి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): 2019-24లో జరిగిన వైసీపీ పాలన విధ్వంసం రిస్మా స్కెట్రమ్ పబ్లిషర్స్ అధినేత మోహన్ నాయుడు ఆధ్వర్యంలో సామాజికవేత్త, పాత్రికేయుడు డాక్టర్ ఉదయ్‌కుమార్ రచించిన వంచిన పుస్తకాన్ని శుక్రవారం కావలి టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మలిశెట్టి వెంకటేశ్వర్లు, గుంటుపల్లి రాజకుమార్ చౌదరి, గుంటుపల్లి శ్రీదేవి చౌదరి, తిరువీధి ప్రసాద్ పాల్గొన్నారు.

కిలో పొగాకు రూ.280

కలిగిరి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక పొగాకు వేలం కేంద్రానికి శుక్రవారం రైతులు మొత్తం 414పొగాకు బేళ్లు అమ్మకానికి తీసుకొచ్చారు. వేలంలో 10కంపెనీ ప్రతినిధులు పాల్గొని 361బేళ్లు కొనుగోలు చేశారు. నోబిడ్-28, ఆర్‌ఆర్-6, సీఆర్-13, జంపింగ్‌లాట్స్-6 కారణాలతో 53బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.230, సగటు ధర రూ.260.74గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి మహేష్‌కుమార్ తెలిపారు.

ఆధార్ కార్డులపై నేడు స్పెషల్ డ్రైవ్

కొండాపురం, ఏప్రిల్11 (ఆంధ్రజ్యోతి): ఆదార్ కార్డులేని చిన్నారులకు మండలకేంద్రంలో ప్రత్యే కంగా ఆధార్ కార్డులు తీసేందుకు స్పెషల్ డ్రైవ్ ఏర్పాటు చేసినట్లు శుక్రవారం ఎంపీడీవో ఆదినారాయణరావు తెలిపారు. శనివారం ఉదయం 9 గంటల నుండి మండల పరిషత్ కార్యాలయంలో ఆధార్ కార్డులు తీస్తామన్నారు. తల్లిదండ్రుల ఆధార్ కార్డులతో పాటు రేషన్ కార్డు తీసుకొని ఇప్పటివరకు ఆధార్ కార్డు లేని చిన్నారులను కార్యాలయానికి తీసుకొచ్చి కార్డులు పొందవచ్చన్నారు.



కావలి: పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి



అల్లూరు: జ్యోతిబాపూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు



ఉలవపాడు: నివాళులు అర్పిస్తున్న డిప్యూటీ డీఈవో నరసింహరావు, ఉపాధ్యాయులు

సామాజిక ఉద్యమాల చైతన్య దీప్తి పూలే..

- ఎమ్మెల్యే కృష్ణారెడ్డి
- ఘనంగా జ్యోతిబా పూలే జయంతి వేడుకలు
- బీసీ ఐక్యత భవన్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం

కావలిటౌన్, ఏప్రిల్11(ఆంధ్రజ్యోతి) సామాజిక ఉద్యమాల చైతన్య దీప్తి మహాత్మ జ్యోతిబా పూలే అని ఎమ్మెల్యే దగుమాటి క్రిష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన జయంతి పురస్కరించుకుని మాగుంట పార్వతమ్మ రోడ్డు ఆర్టీసీ కూడలిలోని పూలే విగ్రహం వద్ద పలు పార్టీలు, సంఘాల నాయకులు నివాళులర్పించారు. టీడీపీ బీసీ సెల్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకలో ఎమ్మెల్యే కృష్ణారెడ్డి పాల్గొని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సామాజిక వివక్షలపై అలుపెరుగని పోరాటం, మహిళా విద్యకు విశేష కృషి చేసిన గొప్ప సంఘ సంస్కర్త పూలే అన్నారు. అనంతరం టీడీపీ కార్యాలయంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో బీసీ నేతలు పొట్లూరి శ్రీనివాసులు, బాలగురుస్వామి, ఉప్పాల శ్రీనివాసులు, గుండ్లపల్లి రమణయ్య, పల్లవు కుమార్, కావేటి కోటయ్య, దేవరాల సురేష్, పార్టీ నేతలు గుత్తికొండ కిషోర్, జ్యోతి బాబురావు, ఏగూరి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

● జనసేన ఆధ్వర్యంలో..

జనసేన ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి అళహరి సుధాకర్ పాల్గొని కార్యకర్తలతో కలసి పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి పూలే అందించిన సేవలను సేవలను కొనియాడారు.

● బీజేపీ ఆధ్వర్యంలో..

బీజేపీ ఆధ్వర్యంలో బీజేపీ రాష్ట్రకార్యవర్గ సభ్యులు భరత్‌కుమార్, సీనియర్ నాయకులు జీఎస్టీ బోర్డు గ్రీవెన్స్ సభ్యులు అమరా సుబ్బారావు, సీవీసీ సత్యం, బెల్లంకొండ మాల్యాద్రి, వాయుగండ్ల సుదీర్ పాల్గొన్నారు.

● బీసీ ఐక్యత భవన్ ఆధ్వర్యంలో మెగా రక్తదానం

బీసీ ఐక్యత భవన్ ఆధ్వర్యంలో పలు బీసీ సంఘాల ప్రతినిధులు ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో భవన్ అధ్యక్షులు ప్రభాకర్, కార్యదర్శి ప్రసాద్, గోవిందు, బ్రహ్మయ్య, ఖాదర్‌బాష పాల్గొన్నారు.

● కలిగిరి (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మాహాత్మ జ్యోతిబా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రత్యూష, వెలుగోటి మధు, దీక్షితులు, దత్తాత్రేయ తదితరులు పాల్గొన్నారు.

ఉలవపాడు, (ఆంధ్రజ్యోతి): మండలంలోని చాకిచర్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మహాత్మ జ్యోతిబా పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. కందుకూరు ఉప విద్యాశాఖ అధికారి నరసింహరావు పాల్గొని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఉలవపాడులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అధ్యాపకులు, విద్యార్థులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

అల్లూరు, (ఆంధ్రజ్యోతి): స్థానిక టీడీపీ కార్యాలయంలో శుక్రవారం మహాత్మా జ్యోతిబా పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయనతో పాటు ఆయన సతీమణి సావిత్రిబాయి మహిళా విద్యాభివృద్ధికి చేసిన కృషి మరువలేదని అన్నారు. బండి శ్రీనివాసులు రెడ్డి, మేడా కృష్ణారెడ్డి, తోట శ్రీహరి, నజీర్‌బాషా, ఇస్మాయిల్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

గుడ్లూరు, (ఆంధ్రజ్యోతి): మహాత్మా జ్యోతిబా పూలే నేటి తరానికి ఆదర్శనీయుడని గుడ్లూరు సీఐ మంగారావు అన్నారు. స్థానిక బస్టాండ్ ప్రాంగణంలో పూలే జయంతి వేడుకలను శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ కాకర్ల వెంకటేశ్వర్లు, సీనియర్ జర్నలిస్టు ఉమ్మడిప్రోలు మల్లికార్జునరావు, మహబూబ్ బాషా, ముప్పవరపు కిషోర్, జీ వెంకటేశ్వర్లు, గంగోలు మాల్యాద్రి, తాటిపర్తి రమేష్ పాల్గొన్నారు.

కందుకూరు, (ఆంధ్రజ్యోతి): మహాత్మా జ్యోతిబా పూలే జయంతి వేడుకలు కందుకూరులో బీజేపీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. స్థానిక కోవూరు రోడ్డులోని పూలే కాంశ్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు జొన్నాదుల రాఘవయ్య, గట్టమనేని హరిబాబు, మన్నేపల్లి వరప్రసాదరావు, జగన్నాధం, మాల్యాద్రి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

బిట్రగుంట, (ఆంధ్రజ్యోతి): బోగోలులోని టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఎల్. సుధీర్‌బాబు, జిల్లా రైతు నాయ కులు కే.వెంకటేశ్వరరెడ్డి, బీసీ నేత దేవరాళ్ళ తిరుపతి, ఎమ్మార్పీఎస్ నేత పీ.శ్రీనివాసులు, ఏపీ కన్స్యూమర్ సభ్యులు జయా నందం, శివ కోటయ్య, మధన్, టైలర్స్ అసోసి యేష్ సభ్యులు బాషా, శ్రీనివాసులు ఉన్నారు. అలాగే పిన్నిబోయిన సుధాకర్ యాదవ్ కార్యాలయంలో జరిగిన వేడుకలో ఇజ్రయెల్, ఏసు రేష్, రవిలు పూలేకు నివాళులర్పించారు. రామిశెట్టి వెంకట సుబ్బారావు ట్రస్ట్ నిర్వాహకురాలు మెతు కురాజేశ్వరి స్వగృహంలో నివాళుల ర్పించారు.



కావలి: పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్పీడీవో, సిబ్బంది

కావలి రూరల్, (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎమ్పీ డీవో కార్యాలయంలో జరిగిన వేడుకలో ఎమ్పీడీవో శ్రీదేవి ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళుల ర్పించారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బం ది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



కలిగిరి: జ్యోతిబా పూలే చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న డిప్యూటీ డీఈవో నరసింహరావు, ఉపాధ్యాయులు



బిట్రగుంట: నివాళులర్పిస్తున్న టీడీపీ నేతలు



కావలి: ఏరియా వైద్యశాలలో రక్తదానం చేస్తున్న బీసీ ఐక్యత భవన్ బాధ్యులు

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి : సీడీపీఓ

వలేటివారిపాలెం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శర్మిష్ఠ తెలిపారు. మండలంలోని అత్తింటివారిపాలెం వలేటివారిపాలెంలోని వడ్డెపాలెం అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం పౌష్టికాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు చేశారు. ఈ కార్యక్రమాల్లో కృషి విజ్ఞాన కేంద్రం సైంటిస్టు నిహారిక, సూపర్‌వైజర్ సునీత, టీచర్లు భారతి, లక్ష్మీ, కార్యకర్తలు రాధ, భారతి, హైమావతి, రమ, ధనలక్ష్మీ, మనోహర, ప్రసన్న, వరలక్ష్మీ, ఆశ తదితరులు పాల్గొన్నారు.



అత్తింటివారిపాలెంలో గర్భిణులకు సీమంతాలు చేస్తున్న సీడీపీఓ శర్మిష్ఠ

జడ్పీ హైస్కూల్లో విద్యార్థులను చేర్పించండి

- గ్రామాల బాట పట్టిన ఉపాధ్యాయులు

లింగసముద్రం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): అన్ని వసతి సౌకర్యాలున్న లింగసముద్రంలోని కేఆర్ జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులను చేర్పించాలని హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఉమ్మడిశెట్టి మాధవరావు కోరారు. క్యాంపెయిన్‌లో భాగంగా ఉపాధ్యాయులు శుక్రవారం మండలంలోని చీమలపెంట, పెంట్రాల, వాకమళ్లవారిపాలెం గ్రామాలలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలను సందర్శించారు. ఈసందర్భంగా వారు పాఠశాలలో 5వ తరగతి పూర్తిచేసుకోబోతున్న విద్యార్థులను, వారి తలిదండ్రులను కలిసి, తమ హైస్కూల్‌లో 6వ తరగతిలో చేరాలని కోరారు.



విద్యార్థులు, తలిదండ్రులతో మాట్లాడుతున్న హైస్కూల్ హెచ్ఎం మాధవరావు, ఉపాధ్యాయులు

గ్రామసభలకు 11 వినతులు

కొండాపురం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): నోషనల్ ఖాతా నెంబర్లు రెగ్యులరైజ్ చేసేందుకు రెవెన్యూ అధికారులు నిర్వహిస్తున్న గ్రామసభలకు శుక్రవారం 11వినతులు అందినట్లు తహసీల్దార్ ఎమ్.కోటేశ్వరరావు తెలిపారు. షెడ్యూల్ ప్రకారం జరిగిన గ్రామసభలలో రామానుజపురంలో 3 వినతులు, మర్రిగుంటలో 8 వినతులు వచ్చాయన్నారు. వీటిని పరిశీలించి రెగ్యులరైజ్ చేస్తామన్నారు. కార్యక్రమంలో రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు వీఆర్‌వో కొండయ్య తదితరులు పాల్గొన్నారు.



గానుగపెంటలో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ కోటేశ్వరరావు తదితరులు

రోబోటిక్ సర్జరీతో మోకాలి మార్పిడి శస్త్ర చికిత్స

కందుకూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): రోబోటిక్ సర్జరీతో మోకాలి మార్పిడి శస్త్ర చికిత్స విజయవంతంగా నిర్వహించవచ్చని నెల్లూరు అపోలో ఆసుపత్రి సీనియర్ ఆర్థోపెడిక్ వైద్యుడు డాక్టర్ శశిధర్‌రెడ్డి తెలిపారు. కందుకూరులోని డాక్టర్ అజ్మల్ హుస్సేన్ ఆసుపత్రిలో ఆయన ప్రతినెలా రెండో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు వైద్య సేవలు అందించనున్నారు. ఈసందర్భంగా నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ రోబోటిక్ సర్జరీ నెల్లూరు అపోలో ఆసుపత్రిలో అందుబాటులోకి వచ్చిందని మోకాలు మార్పిడి అవసరమైన జిల్లావాసులు సద్వినియోగం చేసుకోవచ్చు న్నారు. ఈ సమావేశంలో డాక్టర్ అజ్మల్ హుస్సేన్, డాక్టర్ ఆసియా బేగం, డాక్టర్ రహీం, ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ ఆర్థోపెడిక్ వైద్యులు డాక్టర్ శశిధర్ రెడ్డి

వాలీబాల్ పోటీలు ప్రారంభం

బిట్రగుంట, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ జయంతి సందర్భంగా విశ్వనాథరావుపేట పంచాయతీలోని రామస్వామిపాలెంలోని జైభీమ్ అంబేడ్కర్ క్రీడా మైదానంలో శుక్రవారం సాయంత్రం వాలీబాల్ పోటీలు ప్రారంభం అయ్యాయి. మూడురోజుల పాటు పోటీలు జరుగుతాయని కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా గడ్డం రమేష్‌బాబు, జైభీమ్ అంబేడ్కర్ సేవాదళ్ వ్యవస్థాపకులు బత్తుల రవిచంద్రలు మామిడి పులిహోరా, పాయసం, వడపప్పు, పానకం, బతానీలను నైవేద్యంగా సమర్పించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, గ్రామస్థులు ఉన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

అల్లూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక బీసీ కాలనీ సమీపంలోని పోలేరమ్మ చెట్టు వద్ద ప్రధాన రహదారిపై ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. స్థానిక సంఘమిత్ర ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో టీడీపీ నాయకుడు పలగాటి శ్రీనివాసులు రెడ్డి ముఖ్యఅతిథిగా చలివేంద్రను ప్రారంభించారు. ముందుగా మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రజనీకాంత్, డీటీ ప్రవీణ్‌కుమార్, నగర పంచాయతీ కమిషనర్ ఉమామహేశ్వరరావు, వెలుగు ఏపీఎం ప్రసాదరావు, ఈవోపీఆర్డీ పెంచల వీరేంద్ర, నాయకులు మేడా కృష్ణారెడ్డి, బండి శ్రీనివాసులు రెడ్డి, బిట్రగుంట వెంకటేశ్వర్లు రెడ్డి, తోట శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి పన్నుపై అపరాధ రుసుము 50 శాతం మాఫీ

కందుకూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఆస్తి పన్ను ఏకమొత్తంగా చెల్లించే వారికి పన్నుపై అపరాధరుసుము 50 శాతం మిన హాయింపు అవకాశం ప్రభుత్వం కల్పించిందని మున్సిపల్ కార్యాలయం కమిషనర్ శుక్ర వారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను ఖాళీ స్థలం, ఆస్తికి సంబంధించి ఈనెల 30లోపు పన్ను చెల్లించే వారికి వర్తిస్తుందన్నారు. 2025-26 ఆర్థిక సంవత్స రానికి సంబంధించిన పన్ను ఏక మొత్తం గా చెల్లించిన వారికి 5 శాతం రాయితీ ప్రభుత్వం ప్రకటించినట్లు తెలిపారు. పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్విని యోగం చేసుకోవాలని ఆయన కోరారు.

● అల్లూరు, (ఆంధ్రజ్యోతి): స్థానిక నగర పంచాయతీ ప్రజలు పన్నుల బకాయిలు ఉన్నవారు 50 శాతం వడ్డీ రాయితీతో చెల్లించుకునే అవకాశం ఉందని నగర పంచాయతీ కమిషనర్ ఉమామ హేశ్వరరావు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరం వరకు బకాయిలున్న ఇంటి, స్థలాల పన్నులు బకాయిలున్న యజమానులు ఈ అవకాశాన్ని సద్వినియో గం చేసుకోవాలన్నారు. ఒకేదఫా బకాయి మొ త్తం చెల్లిస్తేనే ఈ రాయితీ వర్తిస్తుందన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి చెల్లించాల్సిన పన్నుల బకాయిల్లో 5శాతం రాయితీ ఉం టుందన్నారు. రెండూ కలిపి చెల్లిస్తే మొత్తం పై 55 శాతం రాయితీ పొందవచ్చన్నారు.

ఘనంగా అయ్యప్ప జన్మదినం



కలిగిరి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జిర్రావారిపాలెం సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న అయ్యప్ప ఆలయంలో అయ్య ప్ప జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని రవిస్వామి, గోపీకృష్ణ స్వామి ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక అభిషేకాలు, పడిపూజ నిర్వహించారు. స్థానికులే కాక ఇతర మండలాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం స్వామివారికి గ్రామోత్సవం నిర్వహించారు.

అయ్యపపడిపూజలో భక్తులు

పేద మహిళకు కుట్టు మిషన్ అందజేత

కావలి టౌన్, ఏప్రిల్ 11 (ఆంధ్ర జ్యోతి) ఎన్‌కెఆర్ చికెన్ స్టాల్ అధినేత పోలిశెట్టి శ్రీనివాసులు దాతృత్వంతో సంయుక్త సేవా సంస్థ సభ్యులు పట్టణంలోని వెంగళరావునగర్‌లోని సంయుక్త సేవాసంస్థ కార్యాలయంలో పేద మహిళలకు కుట్టు మిషన్ వితరణ ఇచ్చారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు సురేంద్ర, గౌరవా ధ్యక్షుడు ఖాదర్‌బాష, రఘు కుమార్ రెడ్డి, ప్రసాదరావు, శివప్రసాద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రంలో సమస్యల తిష్ఠ



జంగంరెడ్డిపాలెం అంగన్వాడీ కేంద్రం వద్ద మరమ్మతులకు గురైన మరుగుదొడ్డి

లింగసముద్రం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన లింగసముద్రం పంచాయతీలోని జంగంరెడ్డి పాలెంలోని అంగన్వాడీ కేంద్రంలో సమస్యలు తిష్ఠ వేశాయి. ఈ కేంద్రం వద్ద సుమారు పదేళ్ల క్రితం చేతిపంపు ఏర్పాటు చేశారు. అయితే వెలుగు కార్యాలయం పైఅంతస్తు నిర్మాణ సమయంలో అప్పటి అధికారులు ఈ చేతిపంపు హెడ్‌ను విడదీసి దానికి మోటారు ఏర్పాటు చేసుకొని నీటిని తోడుకున్నారు. అయితే వారి పని పూర్తయిన తరువాత చేతిపంపు హెడ్‌ను బిగించలేదు. దీంతో తాము మంచినీటికి ఇబ్బందులు పడుతున్నట్టు సిబ్బంది తెలిపారు. గ్రామంలోని మరో బోరునుంచి నీరు తెచ్చుకొని పిల్లలకు భోజనం వండి పెడుతున్నట్టు చెప్పారు. అలాగే ఈ కేంద్రానికి చెందిన మరుగుదొడ్డి షీటును గుర్తు తెలియని వ్యక్తులు పగులకొట్టడంతో వాడేందుకు వీలు లేకుండా పోయింది. సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



అంగన్వాడీ కేంద్రం వద్ద హెడ్ లేని చేతిపంపు

కేజీబీవీల్లో ప్రవేశాలకు
గడువు పొడిగింపు

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కేజీబీవీల్లో 11, 12 తరగతుల్లో ప్రవేశా లకు ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణకు ఈనెల 21వ తేదీ వరకు గడువు పొడగించి నట్లు సమగ్ర శిక్ష ఏపీసీ డి.వెంకట సుబ్బయ్య ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను apkgbv.apcfss.in వెబ్‌సైట్‌లో మాత్రమే చేసుకోవాలని పేర్కొన్నారు. పూర్తి వివరా లకు సమీపంలోని కేజీబీవీల్లో లేదా సమగ్ర శిక్ష కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు.

శోభాయాత్ర ప్రశాంతంగా
నిర్వహించాలి: ఏఎస్పీ

నెల్లూరు(వ్యవసాయం), ఏప్రిల్ 11(ఆంధ్ర జ్యోతి): శాంతిభద్రతలకు విఘాతం లేకుండా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా శోభాయాత్ర ప్రశాంతంగా నిర్వహించాలని అదనపు ఎస్పీ సీహెచ్ సౌజన్య పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు శుక్రవారం పోలీసు కార్యాలయంలో శోభాయాత్ర నిర్వహణపై హిందూ, ముస్లిం మత పెద్దలతో ఆమె సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడు తూ కులమతాలకు అతీతంగా ఎవరి మనో భావాలకు ఇబ్బంది కలగకుండా సంయ మనం పాటించాలన్నారు. ఈ సమావేశంలో టౌన్, రూరల్ డీఎస్పీలు సింధుప్రియ, శ్రీనివాసరావు, ట్రైనీ డీఎస్పీ శివప్రియలతో పాటు, రెవెన్యూ, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

సేవలు అమోఘం...

- భూసార పరీక్షా కేంద్రంలో 12 రకాల పరీక్షలు
- రైతులకు కచ్చితమైన ఫలితాలు
- అధికారులు, సిబ్బంది పనితీరుకు జాతీయ గుర్తింపు

గుర్తింపు ఘనం !



సూక్ష్మపోషకాల స్థాయిని అటామిక్ అబ్జార్షన్ స్పెక్ట్రో ఫొటోమీటరుతో పరీక్షిస్తున్న ఏవోలు



ఫ్లేమ్ ఫొటోమీటర్ ద్వారా పొటాష్ స్థాయిని పరీక్షిస్తున్న ఏవో జోత్స్న

నెల్లూరు(వ్యవసాయం), ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మొక్కకు అవసరమైన పోషకాలు అందిస్తూ, దాని పెరుగుదలకు, మంచి దిగుబడిని అందించడంలోనూ మట్టిది కీలకపాత్ర. అయితే పంట దిగుబడులు పెరుగుతాయనే ఆశతో రైతులు మోతాదుకు మించి ఎరువులు, పురుగు మందులు వాడటం వల్ల మట్టి సమస్యాత్మకంగా మారుతోంది. ఈ పరిస్థితుల్లో మట్టి నమూనాలను సేకరించి 12రకాల భౌతిక, రసాయనిక పరీక్షలు పక్కాగా నిర్వహిస్తున్నారు నెల్లూరులోని భూసార పరీక్ష కేంద్రం వారు. ఈ కేంద్రం జాతీయ స్థాయి ప్రమాణాలు కలిగిన ప్రయోగశాలగా ఇటీవల గుర్తింపు పొందింది. ఈనేపథ్యంలో అక్కడ జరుగుతున్న పరీక్షలు, రైతులకు అందిస్తున్న సలహాలను ఆ కేంద్రం ఏడీఏ కే.కన్నయ్య ఆంధ్రజ్యోతికి వివరించారు.

మంచి దిగుబడులే ఉద్దేశం

నేలలో ఏ పోషకాలు తగ్గాయో తెలుసుకుని, ఆయా పోషకాలను మాత్రమే నేలకు అందించడం వల్ల పంటలు బాగా పెరగడంతోపాటు మంచి దిగుబడులు వస్తాయి. ఇవన్నీ తెలియా లంటే భూసార పరీక్షలు తప్పనిసరి. రైతులకు పెట్టుబడి ఖర్చులు తగ్గడమే కాకుండా మంచి ఆదాయం కూడా పొందవచ్చు. ఈ పరీక్షల ద్వారా మంచి నేలను పొందవచ్చు. భూసార పరీక్షల నిర్ధారణ ద్వారా రైతులకు నత్రజని, భాస్వరం, పొటాష్‌లతోపాటు సూక్ష్మపోషకాలను సిఫార్సు చేస్తారు. అంతేగాక సమస్యాత్మక భూములను గుర్తించి యాజమాన్య పద్ధతులను రైతులకు తెలియజేస్తారు.

సమష్టి కృషికి గుర్తింపు



నెల్లూరు భూసార పరీక్ష కేంద్రా నికి జాతీయ స్థాయి ప్రమాణాలు కలిగిన ప్రయోగశాలగా గుర్తింపు రావడం సంతోషం. సమష్టి కృషికి లభించిన గుర్తింపుగా భావిస్తున్నాం. ఇందుకు కేంద్రంలో పనిచేసే అధికారులు, సిబ్బందితోపాటు జిల్లా వ్యవసాయాధికారి పీ.సత్యవాణి సహకారం ఎంతో ఉంది.

- కే.కన్నయ్య, భూసార పరీక్ష కేంద్రం ఏడీఏ

వేసవిలో నమూనాల సేకరణ

వేసవిలో పొలాల్లో పంట లేని సమయంలో మట్టి నమూనాలు కేంద్రం నిర్వాహకులు సేకరిస్తారు. ఎరువులు, కంపోస్టు ఇతర పోషక పదార్థాలు వేసిన నేలల్లో 45రోజుల తరువాత 10 నుంచి 12చోట్ల మట్టిని సేకరిస్తారు. వీ ఆకారంలో 15సెం.మీ లోతు గుంతలు తీసి సుమారు అరకిలో మట్టిని తీసుకుంటారు. చెట్లకింద, గట్ల దగ్గర, కంచెలు, కాలిబాటల వద్ద మట్టిని సేకరించకూడదు. చౌడు భూముల్లో విడిగా తీసుకోవాలి. పండ్ల తోటల్లో మాత్రం ఎంపిక చేసిన ప్రదేశంలో ఆరు అడుగుల గుంత తీసి, ప్రతి అడుగుకు పైనుంచి కింది వరకు ఒక మట్టి నమూనా చొప్పున సేకరించాలి.

కేంద్రంలో పరీక్షలు

భూసార పరీక్ష కేంద్రంలో 12రకాల పరీక్షలు నిర్వహిస్తారు. ముఖ్యంగా నేల రంగు, స్వభావం, ఉదజని సూచిక(పీహెచ్), లవణ పరిమాణం(ఈసీ), సేంద్రియ కర్బనం, నత్రజని, భాస్వరం, పొటాష్ స్థాయిలను గుర్తిస్తారు. రైతులు కోరితే సూక్ష్మపోషకాల విశ్లేషణ, లోపాలు, సవరణలు సూచనలు ఇస్తారు. సమస్యాత్మక నేలల్లో జిప్సం, సున్నం పరిమాణాన్ని కూడా తెలియజేస్తారు. అదేవిధంగా బంక మట్టి, ఒండ్రు మట్టి, ఇసుక ఎంతశాతం ఉన్నాయో కూడా పరీక్షించి నేల స్వభావాన్ని నిర్ధారిస్తారు.

గుర్తింపు ఇలా..

ఢిల్లీలోని నేషనల్ అక్రిడిటేషన్ బోర్డు ఆఫ్ లేబొరేటరీస్ దేశవ్యాప్తంగా ఏదో ఒక ప్రాంతంలో మట్టినమూనాలు సేకరిస్తుంది. ఇలా సేకరించిన మట్టిని గతేడాది అక్టోబరులో జిల్లా పరీక్ష కేంద్రానికి పంపింది. ఇక్కడి ప్రయోగశాలలో 12 రకాల పరీక్షలు చేసి ఫలితాలను తిరిగి కేంద్ర ప్రయోగశాలకు పంపుతారు. అక్కడ, ఇక్కడ వచ్చిన ఫలితాలు ఒకేలా ఉంటే జాతీయస్థాయి ప్రమాణాలు కలిగిన ప్రయోగశాలను గుర్తింపు ఇస్తారు. ఈ మేరకు ఈ నెల 8వ తేదీన కేంద్రానికి సర్టిఫికెట్ అందింది.

నడికుడి - శ్రీకాళహస్తి రైల్వేలైన్
భూ బాధితులకు న్యాయం చేస్తాం

- నెల్లూరు ఆర్డీవో నాగ సంతోషిణి అనూష



రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో అనూష, తహసీల్దార్ లక్ష్మీ నరసింహం

రాపూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : నడికుడి - శ్రీకాళహస్తి రైల్వే లైన్ నిర్మా ణంలో భూములు కోల్పోతున్న రైతులకు ప్రభుత్వం నిర్దేశించిన ధరలో ఏమైనా అభ్యంతరాలు ఉంటే న్యాయస్థానం ద్వారా పరిష్కరించుకోవాలని నెల్లూరు ఆర్డీఓ నాగ సంతోషిణి అనూష పేర్కొన్నారు. రాపూరు తహసీల్దార్ కార్యాలయంలో నడికుడి- శ్రీకాళ హస్తి రైల్వేలైన్ నిర్మాణంలో భూములు కోల్పో తున్న రైతులతో ఆమె సమావేశం నిర్వహిం చారు. మండలంలో 548 మంది రైతులు రైల్వే నిర్మాణంలో భూములు కోల్పోతున్నారని వారికి ప్రభుత్వం పట్టా భూములకు రూ. 6లక్షలు, అసైన్మెంట్ భూములకు రూ. 3లక్షలుగా ధర నిర్దేశించిందన్నారు. ఈ ధరల్లో ఎవరికైనా అ భ్యంతరాలు ఉంటే న్యాయస్థానం ద్వారా సమ స్యను పరిష్కరించుకోవాలన్నారు. ప్రభుత్వం ఇచ్చే పరిహారానికి రైతులు సానుకూలంగా ఉంటే ఆ రైతుల బ్యాంకు ఖాతాలో నగదు జమ అవుతుందన్నారు. అనంతరం రైతుల నుంచి వివిధ సమస్యలపై అర్జీలు స్వీకరించి వారికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పి లక్ష్మీనరసింహం, డిప్యూటీ తహ సీల్దార్ అశోక్, వీఆర్వోలు, సర్వేయర్‌లు తది తరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల్లో రూ. 77,661 అవినీతి

- రికవరీకి డ్వామా పీడీ ఆదేశం



సామాజిక తనిఖీ బహిరంగ వేదికలో మాట్లాడుతున్న డ్వామా పీడీ గంగాభవాని

సంగం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాయంలో శుక్రవారం ఎంపీడీవో షాలెట్ ఆధ్వర్యంలో ఉపాధి హామీ సామాజిక తనిఖీ బహిరంగ ప్రజా వేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డ్వామా పీడీ గంగా భవాని ఉపాధి పనుల్లో రూ. 77,661ల అవినీతి జరిగిందని గుర్తించి రికవరీకి ఆదేశాంచారు. వివరా ల మేరకు మండలంలోని 20 పంచాయతీల్లో సుమారు రూ. 7 కోట్ల విలువైన పనులు జరి గాయి. ఈ పనులపై ఎస్ఆర్పీ ఆధ్వర్యంలో జిల్లా డీఆర్పీ సభ్యులు అన్ని గ్రామాల్లో చేసిన పనులపై కూలీలను విచారించి సుమారు రూ. 77,661 అవినీతి జరిగిందని నిర్ధారించారు. ఈమేరకు సంబంధిత క్షేత్రసహాయలు, టీసీల నుంచి రికవరీకి పీడీ గంగా భవాని ఆదేశాంచారు. ఈ కార్యక్రమంలో అంబుడ్స్‌మెన్ వెంకట్రామిరెడ్డి, జిల్లా విజిలెన్స్ అధికారి రాజ్యలక్ష్మి, ఉపాధి హామి ఏపీడీ శంకరనారాయణ, ఇన్‌చార్జి ఏపీవో సురేష్, టీసీలు, క్షేత్రస హాయకులు తదితరులు పాల్గొన్నారు.

కులగణన చేపట్టాలి

జీసీ సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా



మహాత్మ జ్యోతిబాపూలే విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న బీసీ సమన్వయ కమిటీ నాయకులు

నెల్లూరు(హరనాథపురం), ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కులగణన చేపట్టి బీసీలకు న్యాయం చేయాలని కోరుతూ బీసీ సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో నగరంలోని మహాత్మ జ్యోతిబాపూలే విగ్రహం వద్ద శుక్రవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా బీసీ సమన్వయ కమిటీ నెల్లూరు జిల్లా చైర్మన్ బొమ్మి నాగకిషోర్ మాట్లా డుతూ విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో జనాభా దామాషా ప్రకారం బీసీలు ఎంతమంది ఉంటే అంత వాటా ఇవ్వాల న్నారు. బీసీలు ఐక్యంగా ఉంటేనే ఏదైనా సాధించు కోగలమన్నారు. 'మన వాటా మన హక్కు'గా ప్రతి ఒక్కరూ గొంతు కలపాలన్నారు. ఐక్యమత్యంతో సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. నెల్లూరులో బీసీ భవన్ నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు. ధర్నాకు ముందు మహాత్మ జ్యోతిబాపూలే జయంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీసీ సమన్వయ కమిటీ కన్వీనర్ బుదవరపు బాలాజీ, బీసీ సంఘ సీనియర్ నాయకులు దేవరాల సుబ్రహ్మణ్యం, బీసీ సమన్వయ కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ భాస్కర్‌గౌడ్, నాయకులు పలమాల శ్రీహరియాదవ్, తాళ్లూరు రాము, కిన్నెర మాలకొండయ్య, నక్క దినేష్, పద్మజాయాదవ్, తదితరులు పాల్గొన్నారు.

నీలకంఠేశ్వరస్వామి భూముల కౌలు వేలం

- జామాయిల్ సాగుకు అనుమతి - ఐదేళ్లకు రూ. 20 లక్షల ఆదాయం



దేవుడి మాన్యం భూములకు వేలం నిర్వహిస్తున్న దేవదాయ శాఖ అధికారులు

ఉలవపాడు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): నీలకం ఠేశ్వర స్వామికి చెందిన దేవుడి మాన్యం 30 ఎక రాలకు సంబంధించిన కౌలు వేలంపాట శుక్ర వారం స్థానిక ఎండోమెంట్ కార్యాలయం వద్ద నిర్వహించారు. ప్రకాశం జిల్లా సింగరాయకొండ మండలంలోని శానంపూడి గ్రామం సర్వే నెంబరు 519లో నీలకంఠేశ్వరస్వామి దేవస్థానంకు 30.05 ఎకరాల కొండబీడు భూమి ఉంది. ఎండోమెంట్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఉలవపాడు మండల గ్రూప్ ఆఫ్ టెంపుల్స్ కార్యనిర్వాహక కార్యదర్శి శ్రీనివాసులు 5 సంవత్సరాల వ్యవధికి కౌలు సాగు వేలంపాట నిర్వహించారు. కందు కూరు దేవదాయ ఈవో వీవీ రవీంద్రనాథ్ పర్వే క్షణలో ఈ వేలంపాట జరిగింది. ఇందులో కౌలు దక్కించుకున్న ఉన్నం మధు నుంచి సెక్యూరిటీ డిపాజిట్ కింద రూ.5 లక్షలు, మొదటి సంవత్సరం కౌలు డబ్బులు రూ.4 లక్షలు వసూలు చేసి నీలకంఠేశ్వర స్వామి దేవస్థానంకు చెందిన బ్యాంక్ అకౌంట్‌లో జమచేసినట్లు దేవస్థానం ఈవో శ్రీనివాసులు తెలిపారు. ఏడాదికి రూ. 4 లక్షల చొప్పున 5 ఏళ్లకు రూ. 20 లక్షల ఆదాయం దేవస్థానంకు సమకూరినట్లు అయ్యింది. స్థానిక ఎస్సై అంకమ్మ తన సిబ్బందితో వేలం పాట సజావుగా జరిగేలా చూశారు.

మైనింగ్ జరిపితే కేసు నమోదు

దేవస్థానం అధికారులు విధించిన నిబం. దనల ప్రకారం నడుచుకోవాలని మెట్ట పంట లను సాగు చేసుకోవాలని, జామాయిల్ సాగు కు అనుమతి ఇస్తున్నట్లు ఈవో పేర్కొన్నారు. ఎత్తుపల్లాల చదును పేరుతో అక్రమంగా గ్రావెల్ మైనింగ్ చేస్తే సంబంధిత కౌలుదా రుడిపై కేసు నమోదు చేసి లీజు రద్దు చేస్తా మని దేవస్థానం ఈవో తెలిపారు.

కావలిలో మరో
ఆన్‌లైన్ ట్రేడింగ్ మోసం

రూ.2కోట్ల వరకు వసూలు చేసిన కలిగిరివాసి

రీపేమెంట్ ఆగడంతో బాధితుల లబోదిబో

న్యాయం చేయాలన్నా పట్టించుకోని పోలీసులు

కావలి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : కావలి పట్టణంలో ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో ప్రజలను నిలువు దోపిడీ చేసిన షేక్ మహబూబ్ సుభానీ ఉదంతం మరవక ముందే మరో మోసం వెలుగులోకి వచ్చింది. ట్రేడ్ మార్కెటింగ్‌లో పెట్టుబడుల పేరుతో ప్రజల నుంచి నగదు వసూలు చేసి ఓ వ్యక్తి పరారయ్యాడు. దీంతో బాధితులు లబో దిబోమంటూ పోలీసులను ఆశ్రయించినా వారు పట్టించుకోక పోవడంతో ఎమ్మెల్యేను కలిసే యత్నంలో ఉన్నారు. కలిగిరి మండలానికి చెందిన ఒక వ్యక్తి కావలి పాతూరు శివాల యం సమీపంలో ఉంటూ నాలుగేళ్లుగా ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో షేర్ మార్కెటింగ్ చేస్తున్నట్లు అందరితో నమ్మబలికాడు. తొలుత రూ.50 వేలు వంతున ప్రజల నుంచి వసూలు చేసి, వారికి నెలకు రూ.7 వేల వరకు చెల్లిస్తూ నమ్మకం ఏర్పరుచుకున్నారు. ఒకరి నుంచి మరొకరికి అలా వ్యాపించి మానస హాల్‌సెంటర్ ప్రాంతవాసుల నుంచే సుమారు రూ.2 కోట్ల వరకు వసూలు చేసినట్లు తెలిసింది. కొంతకాలం వరకు రూ.లక్షకు రూ.14 వేలు దాకా ఇస్తూ వచ్చిన సదరు వ్యక్తి ఆ తర్వాత మార్కెట్ తగ్గిందని చెప్పి రూ.10 వేలు ఇస్తూ వచ్చారు. దీంతో చిరుద్యోగులు, వ్యాపారులు తమ దగ్గర ఉన్న డబ్బులే కాకుండా బంగారం కుదవపెట్టి మరీ ఇచ్చినట్టు బాధితులు ఆవేదన చెందుతున్నారు. మార్చి నుంచి రీపేమెంట్ చేయకపోగా ఫోన్ ఎత్తకపోవడంతో బాధితుల్లో ఆందోళన మొదలైంది. ఇంటికి కూడా తాళం వేసి ఉండటంతో ఒకటోపట్టణ స్టేషన్‌కు వెళ్లి తమ గోడు చెప్పుకోగా కోర్టుకువెళ్లి తేల్చుకోండంటూ పోలీసులు ఉచిత సలహా ఇచ్చారని పేర్కొన్నారు. ఆ తర్వాత సదరు వ్యక్తి ఇంటికి వెళ్లగా ఆయన భార్య తమ వద్ద డబ్బులేవటూఈ నిర్లక్ష్యంగా సమా ధానం ఇచ్చారని వాపోతున్నారు. దీంతో బాదితులంతా త్వరలో కావలి ఎమ్మెల్యే కృష్ణాఆరెడ్డిని కలిసే ప్రయత్నంలో ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

కందుకూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి చెందిన సంఘటన మండలంలోని ఓగూరు కోల్డ్ స్టోరేజి వద్ద శుక్రవారం చోటు చేసుకుంది. రూరల్ ఎస్సై మహేంద్ర తెలిపిన వివ రాల ప్రకారం.. ఓగూరు గ్రామానికి చెందిన గంగవరపు వెంకటేశ్వరరెడ్డి (72) మోటారుసైకిల్‌పై సింగరాయకొండ వైపు వెళ్తుండగా అదే మార్గంలో పొగాకు బేళ్ల లోడుతో వెళుతున్న లారీ వెనుక నుంచి ఢీకొని ముందు ఆగిఉన్న టాటామ్యాజిక్ వాహనాన్ని ఢీకొంది. ఈ సంఘటనలో వెంకటేశ్వరరెడ్డిపైకి లారీ ముందు టైరు ఎక్కడంతో అక్కడికక్కడే మృతిచెందగా మ్యాజిక్ వాహనంలో ఉన్న మార్టూరుకు చెందిన ఇద్దరు వ్యక్తులకు స్వల్ప గాయాలయ్యాయి. వెంకటేశ్వరరెడ్డి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కందుకూరు ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో కారు దగ్ధం

- తప్పిన పెనుప్రమాదం



తగలబడుతున్న కారును ట్యాంకర్ నీటితో ఆర్పుతున్న ఎస్సై అంకమ్మ, స్థానికులు

ఉలవపాడు, ఏప్రిల్ 11 (ఆంధ్ర జ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఒక కారు దగ్ధమైన సంఘ టన శుక్రవారం సాయం త్రం ఉలవపాడు జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... నెల్లూరు నుంచి విజయవాడకు నలుగురు వ్యక్తులు కారులో బయలుదేరారు. మార్గమధ్యంలో ఉలవపాడు సౌత్ బైపాస్ వద్ద ఎంజీ బ్రదర్స్ పెట్రోల్ బంకు దాటిన తరువాత ముందు వెళుతున్న లారీని ఢీకొట్టడంతో అదుపుతప్పిన కారు మార్జిన్ ఫెన్సింగ్ వద్ద ఆగిపోయింది. కారు కిందభాగం పూర్తిగా దెబ్బతిని మంటలు చెలరేగడంతో కారులోని నలుగురు వ్యక్తులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. చూస్తుండగానే మంటలు కారుని చుట్టుముట్టి పూర్తిగా దగ్ధమైంది. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



రఘువంశ రామయ్య.. సుగుణాల సీతమ్మ
వరమాలకై వేచె సమయాన..
శివధనువు విరిచాకె.. వధువు మది గెలిచాకె
మోగింది కల్యాణ శుభవేళ..
కల్యాణం.. వైభోగం.. శ్రీరామచంద్రుని కల్యాణం...

అన్నట్లుగా ఏకశిలానగరం పులకరించింది. శ్రీరామ నామస్మరణతో ఒంటిమిట్ట మార్మోగింది. ఆంధ్రా భద్రాద్రి, దక్షిణాది అయోధ్యగా పేరొందిన ఏకశిలానగిరి ఒంటిమిట్ట కోదండరామాలయం లో శ్రీరామనవమి వార్షిక బ్రహ్మోత్సవాలు అంగ రంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శుక్రవారం నిండు వెన్నెలలో సీతారాముల కల్యా ణాన్ని టీటీడీ ఆధ్వర్యంలో నభూతో నభవిష్యతి అన్న రీతిలో నిర్వహించారు. ముందుగా రామ య్యకు యజ్ఞోపవీతం, సీతమ్మకు స్వర్ణ కిరీటం కానుకగా అందించారు. ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దంపతులు అందించారు. స్వామివారి కల్యాణాన్ని చూసేందుకు భక్తులు విశేషంగా తరలి రావడంతో ఒంటిమిట్ట జనసంద్రంగా మారింది.



కళాకారుల నృత్యం





పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు తీసుకొస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దంపతులు



ఆలయ శిల్పకళను పరిశీలిస్తున్న సీఎం



ఎదుర్కోలు దృశ్యం



సీతారాముల కల్యాణం తిలకిస్తున్న చంద్రబాబు దంపతులు